

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM హైదరాబాద్ : fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

23-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 112 పేజీలు: 10+4 వెల: 6.50


బ్లాక్‌లో ఐపిఎల్ టిక్కెట్లు: ఉప్పల్‌లో నలుగురి అరెస్టు 3లో

సిఎం విజయ్ కేబినెట్‌లో మరో ఇద్దరికి చోటు 8లో



## 24 రాజ్యసభ సీట్లకు జూన్ 18న పోలింగ్

ఎపి నుంచి అయోధ్యరామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ, సానా సతీష్ సీట్లు ఖాళీ

దేవెగౌడ, ఖర్గే, దిగ్విజయ్‌సింగ్ కూడా రిటైర్

మొత్తం 10 రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలు 2లో



## ఐఎఎస్‌ల పిల్లలకూ ఇంకా రిజర్వేషన్లా?

ఉన్నత స్థానాలకు చేరిన కుటుంబాలు కోటా ఆశించడమేమిటి?

సమాజంలోని చివరి వ్యక్తికీ రిజర్వేషన్ ఫలాలు అందాలి

జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు 8లో



సంచలనం సృష్టించిన ఐపిఎల్ ఉప్పల్ మ్యాచ్

## 55 పరుగుల తేడాతో బెంగళూరుపై హైదరాబాద్ ఘన విజయం

అభిషేక్, ఇషాన్ కిషన్, క్లాసెన్ హాఫ్ సెంచరీలు

-'ఆట'లో



శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో భేటీ అయిన సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్

## ఇండో-సైప్రస్ వ్యూహాత్మక దౌత్యం

ప్రధాని మోడీతో సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడ్స్ ద్వైపాక్షిక చర్చలు

**న్యూఢిల్లీ,మే 22:** భారత్, సైప్రస్ దేశాల దౌత్య సంబంధాలలో సరికొత్త అధ్యాయం ప్రారంభం అయిందని, రెండుదేశాల మధ్య దశాబ్దాలుగా ఉన్న స్నేహ బంధాన్ని మరింత ఉన్నతమైన వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచుతున్నట్లు ప్రధాని నరేంద్ర మోడీ ప్రకటించారు. శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో భారత్ పర్యటనలో ఉన్న సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడా >>2




వేడి గాడ్పులకు తెలంగాణ విలవిల

20 జిల్లాల్లో 46°పైగా ఉష్ణోగ్రతలు నమోదు

వడదెబ్బకు మరో ఐదుగురు మృతి

ప్రపంచ అత్యధిక వేడి ప్రాంతాల్లో జగిత్యాల

# ఎండ నిప్పులు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. రోజు రోజుకూ ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ మరణాలు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో వడదెబ్బ కారణంగా మరో అయిదుగురు మృతి చెందారు. భూపాలపల్లి జిల్లాలో ముగ్గురు మృతి చెందగా, మంచిర్యాల జిల్లాలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. శనివారం పలు జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశాలున్నాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి వరంగల్, జగిత్యాల, సిరిసిల్ల, కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్ నగర్, సిద్దిపేట జిల్లాల్లో వడగాల్పులు వీస్తాయని తెలిపింది. అదే సమ యంలో ఆదిలాబాద్, ఆసిఫా బాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్గొండ, సూర్యాపేట, నాగర్ కర్నూల్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు మించి నమోదవు తుందని అంచనా వేసింది. కాగా గురువారం ఒక్కరోజే రాష్ట్రంలో వడదెబ్బతో 22 మంది మరణించారు. కాగా... తెలంగాణలోని జగిత్యా లలోకూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మధ్యాహ్నం 43 డిగ్రీల ఎండతో జగిత్యాల దేశంలోనే 11వ స్థానంలో ఉండటం విశేషం. ప్రపంచంలోనే అత్యధిక ఎండ (ఉష్ణోగ్రత) కలిగిన టాప్ 50 నగరాలు ఇండియాలోనే ఉన్నాయి. గడిచిన 24 గంటల్లో రాష్ట్రంలో 46.5 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యధికంగా పెద్ద పల్లి జిల్లా ముత్తారం, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇక భద్రాద్రికొత్తగూడెం, హన్మకొండ, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరింనగర్, ఖమ్మం, కొమరంభీం ఆసీఫాబాద్, మంచిర్యాల, ములుగు, నల్గొండ, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 46.4డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా.. మహబూబాబాద్, నిర్మల్, నిజామాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 46.3 డిగ్రీలు, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో 46.2 డిగ్రీలు, సిద్ధిపేట జిల్లాలో 46.1 అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కామారెడ్డిలో 45.9, జనగామలో 45.5, మెదక్‌లో 45.1 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకూడదని, తగినంత నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రస్తుతం తీవ్రమైన ఎండల కారణంగా వేడి, ఉక్కబోత రోజు రోజుకి పెరిగిపోతున్నాయని, ఈ తరహా వేడి శరీరానికి ప్రమాదకరమని వైద్య నిపుణులు >>2

| | |
|---|---|
| ముత్తారం, మునగాల : | $46.5^0$ |
| మంచిర్యాల, నల్లగొండ: | $46.4^0$ |
| ఆదిలాబాద్, వరంగల్లు : | $46.2^0$ |

## రైతు గోస వినలేరా?

సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి కవిత నిరసన

అరెస్టుచేసిన పోలీసులు, ఫలక్‌నుమా స్టేషన్‌కు తరలింపు



శుక్రవారం సెక్రటేరియట్ వద్ద ధర్నా చేస్తున్న కవితను అరెస్టు చేసి తీసుకువెళుతున్న పోలీసులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,మే22:** రైతుల బాధలను చూసి చలించిన తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన తెలిపారు. శుక్రవారం ఉదయం సెక్రటేరియట్ ప్రధాన ద్వారం ముందు కవిత వివిధ జిల్లాల నుంచి వచ్చిన రైతులు, మహిళలు, తెలంగాణ రక్షణ సేన కార్యకర్తలతో కలిసి వరికంకులు, ప్లకార్డులతో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా >>2

మరో భారీ అవినీతి జలగ!

## ఎసిబి వలలో స్పెషల్ గ్రేడ్ డి.కలెక్టర్

రూ. 200 కోట్ల అక్రమాస్తులు గుర్తింపు

రంగారెడ్డి, మేడ్చల్‌లో 10 చోట్ల సోదాలు



ఎసిబికి పట్టుబడ్డ డి.కలెక్టర్ వంశీ మోహన్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** మరో అవినీతి అధికారి ఎసిబికి చిక్కారు. వాటర్ వర్క్స్ బోర్డు ప్రాజెక్టు విభాగంలో ఇంజనీరింగ్ సెక్షన్ జిఎంగా వున్న అనంత లక్ష్మీ కుమార్ వంద కోట్ల రూపాయల అక్రమాస్తుల కేసులో అరెస్టు విషయం మరువక ముందే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ మర్రి వంశీ మోహన్‌ను ఎసిబి అధికారులు ఆదాయానికిమించి భారీగా అక్రమా స్తులు కలిగివున్న నేరంపై అరెస్టు చేశారు. వంశీ మోహన్ వద్ద 200 కోట్ల రూపాయల వరకు అక్రమాస్తులు పట్టుబడినట్లు తెలు స్తోంది. ఆయన ఇంటితో పాటు పది చోట్ల ఎసిబి అధికారులు సోదాలు జరిపారు. మేడ్చల్ మల్కాజిరి అర్బన్ ల్యాండ్ సీలింగ్ విభాగంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న వంశీ మోహన్ గతంలో శేరిలింగంపల్లి ఆర్‌డిఒగా పనిచేయగా దీంతో పాటు శివార్లలో పలు కీలక స్థానాల్లో పనిచేశారు. ఈ సమయంలో ఆయన పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు వచ్చాయి. రియల్టర్ల నుంచి పదుల ఎకరాల భూము లను కాజేసి, వాటిని తన బంధువుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి ఆనక వాటిని ప్లాట్లుగా మార్చి అమ్మేవాడని ఎసిబి అధికారులకు సమాచారం అందింది. ఈ క్రమంలోనే ఆయనపై నిఘా వుంచిన ఎసిబి అధికారులు పక్కా సమాచారంతో శుక్రవారం ఉదయం దాడులు చేబట్టారు. దాడుల సందర్భంగా నాలుగు కోట్ల 46 లక్షల రూపాయల విలువచేసే 19 ఫ్లాట్లు, వనస్థలిపురంలోని ఎన్‌జిఒ కాలనీలో ఖరీదైన ఇల్లు, మణికొండ, మజీద్‌బండలో కోటి 12 లక్షల రూపాయల విలువచేసే రెండు ప్లాట్లు ఇబ్రహీంపట్నంలోని నారపల్లిలో పది కోట్ల రూపాయల విలువ చేసే రెండు ఎకరాల ఫాం హౌస్ వెలుగు చూసింది. ఆయన ఇంట్లో రెండు >>2

# ఇక డిజిటల్ తెలంగాణ



శుక్రవారం హైదరాబాద్‌లో డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్‌లో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు

పౌర సేవలు ప్రజలకు మరింత చేరువగా కాంప్రహెన్సివ్ రోడ్ మ్యాప్

నెక్ట్స్ జెన్ ఆవిష్కరణలు, ఆర్థిక వృద్ధిని అనుసంధానించే ఎకోసిస్టం

డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్‌లో మంత్రి శ్రీధర్ బాబు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఇందులో భాగంగా... ప్రభుత్వ పౌర సేవల్ని మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా ప్రజల ముంగిటకే చేర్చేలా ఒక ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. ది ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ఆధ్వర్యంలో శుక్రవారం హెచ్ఐసిసిలో నిర్వహించిన డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్ ఫైనాన్స్ సమ్మిట్ 2026కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ప్రస్తుతం గ్లోబల్ ఎకానమీ ఊహించని వేగంతో డిజిటల్ వైపు దూసుకుపోతోందని, సంప్రదాయ పద్ధతుల స్థానంలో వ్యవస్థను రీడిఫైన్ చేసే సరికొత్త డిజిటల్ ఈక్వేషన్స్ తెరపైకి వచ్చాయన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌కు అనుగుణంగా మార్పుల్ని అందిపుచ్చుకునే దేశాలకే భవిష్యత్తు ఉంటుందన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఒకటిగా నిలిచిందన్నారు. డిజిటల్ పేమెంట్స్ నుంచి డిజిటల్ >>2

## 2 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు 2లో



## పోక్సో కేసు నిందితుని 9 రోజులు దాచిందెవరు?

ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యంపై శ్వేతపత్రం విడుదల చేయాలి : కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** పోక్సో కేసు విషయంలో బండి భగీరథ్‌ను కాపాడేందుకు సిఎం రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రి బండి సంజయ్ కుమ్మక్కయ్యా రని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆరోపించారు. బండి భగీరథ్ లొంగిపోయాడని బండి సంజయ్ చెబితే, పోలీసులే అరెస్టు చేశారని రేవంత్ రెడ్డి చెప్పారని, పోక్సో కేసులో నిందితుడిని 9 రోజులు దాచిపెట్టిందెవరు? అని ప్రశ్నించారు. సామాన్యుడైతే పోలీసులు ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. ఆయన లొంగుబాటు అంటే, ఈయన అరెస్టు అని చెప్పడం విడ్డూరమని >>2

తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్

## ఆకునూరి మురళి రాజీనామా



**హైదరాబాద్, ప్రభాతవార్త, మే 22:** తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ పదవికి విశ్రాంత ఐఎఎస్ అధికారి ఆకునూరి మురళీ రాజీనామా చేశారు. కమిషన్ ఛైర్మన్ పదవికి తాను సమర్పిం చిన రాజీనామాను ఆమోదిం చాలని కోరుతూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణా రావుకి ఆకునూరి మురళీ శుక్రవారం లేఖ రాశారు. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్‌గా సేవ చేసే అవకాశం కల్పించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్టు లేఖలో పేర్కొన్నారు. విద్యారంగంపై సిఫార్సులతో కూడిన సమగ్ర నివేదికను సమర్పించే పనిని తాము పూర్తి చేసినందున, తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ పదవికి తాను రాజీనామాను సమర్పిస్తున్నానని, తన రాజీనామాను ఆమోదించా లని లేఖలో కోరారు. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ పదవికి నాలుగు నెలల కాలం ఉన్నప్పటికీ ఆయన రాజీనామా సమర్పించడంపై సర్వత్ర చర్చ జరుగుతోంది. తాను ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ప్రభుత్వ ఉపాధ్యాయులకి ఎక్కువ వేతనాలు ఉన్నాయని పేర్కొనడం పెద్ద దుమారం లేపింది.




శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన బ్యాంకర్ల సమావేశంలో డి.సిఎం భట్టి. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

• తెలంగాణ వృద్ధిరేటు 10.7 శాతం నమోదు • వడ్డీలేని రుణాలు రూ. 10 లక్షలకు పెంపు • బ్యాంకర్ల సమావేశంలో డి.సిఎం భట్టి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణను 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా నిలిపేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. 2047 ఆర్థిక సంవత్సరం నాటికి ఈ లక్ష్యాన్ని సాధించాలనేదే పెద్ద కలగా తెలిపారు. తెలంగాణ ప్రస్తుత వృద్ధి రేటు చూస్తుంటే ఇది ఖచ్చితంగా సాధ్యమేనని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు, ఆర్థిక స్వావలంబన, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మహిళా సాధికారత, మూసీ పునరుజ్జీవం తమ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. రాష్ట్రం పారిశ్రామిక రంగంలో దేశంలోనే అత్యంత వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు దాదాపు రూ.9.43 లక్షల కోట్లు, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం గొప్ప విషయమన్నారు. రాష్ట్రం 130.78 శాతం క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తితో ముందుకు సాగుతోందని చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాల విషయంలో బ్యాంకులు మరింత సానుకూల >>2



శుక్రవారం ధార్‌లోని భోజ్‌శాల ఆలయంలో ప్రజలు ప్రార్థనలు చేస్తుండగా ఓ బాలిక శంఖం పూరిస్తున్న దృశ్యం

# 721 యేళ్ల తర్వాత తొలిసారి భోజ్‌శాల ఆలయంలో హారతి

**న్యూఢిల్లీ, మే 15:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాలలో ఇవాళ అద్భుత ఘట్టం ఆవిష్కృతమవుతోంది. సుమారు 721 ఏళ్ల తర్వాత శుక్రవారం రోజున భోజ్‌శాల ఆలయంలో మహాహారతినిర్వహిస్తున్నారు. ధార్ జిల్లాలో ఉన్న ఆ ఆలయంలో ఇన్నాళ్లూ ముస్లింలు నమాజ్ చేశారు. మధ్యప్రదేశ్ హైకోర్టు తీర్పులో భోజ్‌శాల సరస్వతీ దేవి ఆలయమని కోర్టు తన తీర్పులో వెల్లడించిన విషయం తెలిసిందే. భోజ్‌శాల ఆలయ పరిసరాల్లో సుమారు 1800 మంది బలగాలను మోహరించారు. ఈనెల 15వ తేదీన తీర్పు వచ్చిన తర్వాత అక్కడ తొలి శుక్రవారం కావడంతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల మధ్య కట్టుదిట్టమైన భద్రత మధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు.

# ముఖ్యమంత్రులతో సమావేశం ఏర్పాటుచేయండి

## ప్రధానిమోడీకి ఎంపి కమల్ హాసన్ విజ్ఞప్తి

**చెన్నై, మే 22:** అమెరికాఇజ్రాయెల్, ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల కారణంగా ఏర్పడిన ఆర్థిక సంక్షోభం నుంచి సామాన్య ప్రజలను కాపాడేందుకు జాతీయ స్థాయిలో ఒక సమన్వయ యంత్రాంగాన్ని రూపొందించాలని నటుడు, రాజకీయ నాయకుడు కమల్ హాసన్ ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రులందరితో తక్షణమే ఒక జాతీయ సదస్సును ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఇంధనాన్ని పొదుపు చేయాలన్న ప్రధాని మోడీ పిలుపును తాను పూర్తిగా సమర్థిస్తున్నానని, ఇలాంటి క్లిష్ట సమయాల్లో జాతీయ బాధ్యత అనేది రాజకీయాలకు అతీతంగా ఉండాలని స్పష్టం చేశారు. నాలుగు నిమిషాల నిడివిగల వీడియో సందేశాన్ని పోస్ట్ చేసిన కమల్, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న సంక్షోభం, భారత ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం గురించి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ యుద్ధం కారణంగా సముద్ర వాణిజ్య మార్గాలు స్తంభించాయన్నారు.

# రైతు గోస వినలేరా?

>> నినాదాలు చేశారు. బస్తాల్లో తీసుకు వచ్చిన వడ్లను కొందరు రైతులు సెక్రటేరియట్ ముందు పోసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ.. రెండున్నరేళ్లుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యవసాయ శాఖపై సమీక్ష చేయకపోవడం దారుణమన్నారు. ధాన్యం, మక్కలు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంటలు కొనక పోవటంతో రైతులు ఆవేదనతో ఉన్నారన్నారు. తేమ శాతం ఎక్కువ ఉందంటూ ధాన్యం కొనుగోలుకు మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారని, తరుగు పేరిట మోసం చేస్తున్న పట్టించుకునే వారు లేరని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. 45-46 డిగ్రీల టెంపరేచర్ లోనూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీసం తాగడాని నీళ్ల లేవు..టెంట్‌లు కూడా వేయలేదన్నారు, వడ దెబ్బకు గురై కొందరు చనిపోయారు...పంటలను కొనే వారు లేక, అప్పులు తీరే దారి కనిపించక మరికొందరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు బాధలను చూసే,ఈ ప్రభుత్వానికి బుద్ధి రావాలని, రైతులకు మేలు చేయాలని సచివాలయం వద్ద ధర్నా చేస్తున్నామని కవిత చెప్పారు. ఈ ప్రభుత్వం వడ్లు, జొన్నలు, పొద్దు తిరుగుడు పంట కొనటం లేదన్నారు. వెంటనే పంట ఉత్పత్తులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న కవితతో సహా రైతులు, మహిళలు, టిఆర్ఎస్ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. కవితను పలక్‌నుమా పోలీస్ స్టేషన్ తరలించగా మిగతావారిని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# ఎండ నిప్పులు

>> స్పష్టం చేస్తున్నారు. ఇలాంటి ఎండలో ఎక్కువసేపు ఉంటే శరీర ఉష్ణోగ్రత పెరిగి డీహైడ్రేషన్, వడదెబ్బకు గురై తీవ్రమైన ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వేడి, ఉక్కబోత వల్ల శరీరం నుంచి చెమట ద్వారా నీరు, ఎలక్ట్రోలైట్స్‌ను కోల్పోతుందని, దాహం వేసే వరకు వేచి చూడకుండా క్రమం తప్పకుండా నీరు తాగాలని, ఒఆర్ఎస్, కొబ్బరి నీరు, నిమ్మరసం, తాజా పండ్ల రసాలను తీసుకోవాలని సూచిస్తున్నారు. వేసవిలో టీ, కాఫీ, మద్యం, షుగర్ డ్రింక్స్‌కు దూరంగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు. కాగా.. రాష్ట్రంలోని వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో శనివారం వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

# ఇక డిజిటల్ తెలంగాణ

>> పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వరకు... మనం సాధిస్తున్న పరివర్తనను ప్రపంచం ఆసక్తిగా గమనిస్తోందన్నారు. ఈ గ్లోబల్ డిజిటల్ ట్రాన్స్ ఫర్మేషన్‌లో భారత్ సాధిస్తున్న ప్రగతికి తెలంగాణ ఒక గ్రోత్ ఇంజన్‌లా మారిందన్నారు. భావితరాల అవసరాలకు అనుగుణంగా నెక్ట్స్ జనరేషన్ ఇన్నోవేషన్స్, టాలెంట్, ఎకనామిక్ గ్రోత్.. ఈ మూడింటినీ నడిపించే ఒక బలమైన ఎకోసిస్టంను ఇప్పటి నుంచే అభివృద్ధి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జిడిపిలో మన వాటాను10 శాతానికి చేర్చాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. ఒకప్పుడు కేవలం సంప్రదాయ బుక్ కీపింగ్, అకౌంట్స్ ఆడిటింగ్‌కే పరిమితమైన సిఎలు.. నేడు కార్పొరేట్ సంస్థలకు 'స్ట్రాటజిక్ బిజినెస్ అడ్వైజర్స్'గా రూపాంతరం చెందారన్నారు. ఎఐ, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ తదితర ఎమర్జింగ్ టెక్నాలజీస్ వల్ల ఫైనాన్స్ రంగంలో సరికొత్త అవకాశాలు... అదే స్థాయిలో సైబర్ మోసాలు, డీప్‌ఫేక్స్, సైబర్ అరెస్ట్, క్రిప్టో ఫ్రాడ్స్ తదితర సవాళ్లు కూడా తెరపైకి వచ్చాయన్నారు. ఇలాంటి తరుణంలో సిఎలు కేవలం ఫైనాన్షియల్ ఆడిటింగ్‌కే పరిమితం కాకుండా... 'సైబర్ అష్యూరెన్స్'కూ ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముంద న్నారు. మారుతున్న ట్రెండ్స్‌కు స్కిల్లింగ్, అప్ స్కిల్లింగ్, రీ స్కిల్లింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సి అండ్ ఎజి ఆనంద్ మోహన్ బజాజ్, సెర్ట్ - ఇన్ జాయింట్ డైరెక్టర్ అభిషేక్ సోలంకి, ప్రిన్సిపల్ డైరెక్టర్ ఆఫ్ ఇన్ కం ట్యాక్స్ ఇన్వెస్టిగేషన్ రాజగోపాల్ శర్మ, సెబీ సిజిఎం సాహిల్ మాలిక్, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఎస్పీ హర్షవర్ధన్, ఆర్బీఐ సిజిఎం శైలజా రాణి జంపాల, ఎన్ ఎస్ ఈ సిఐఎస్వో రాజేష్ థాపర్, డేటా సెక్యూరిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా సిఇఒ వినాయక్ గాడ్సే తదితరులు పాల్గొన్నారు.

# 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం

>> దృక్పథంతో ముందుకు రావాలని ఆయన చెప్పారు. విద్యార్థులకు ఇచ్చే రుణాలు యువతపై మనం పెట్టే భవిష్యత్ పెట్టుబడి అని ఆయన చెప్పారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటిని జోడెడ్లుగా పరుగులు తీయగలవని తమ ప్రభుత్వం చేతల్లో నిరూపించిందని అన్నారు. అలాగే వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని వీటి రుణాల విషయంలో రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్లు పంపిణీ చేసి 101.88 శాతం సాధించాయన్నారు. నేడు ప్రపంచమంతా పునరుత్పాదక ఇంధనరంగంపై దృష్టి సారిస్తోందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలో కూడా సౌరశక్తి విభాగంలో స్థిరమైన ప్రగతిని సాధిస్తోందన్నారు. సౌరశక్తి ప్రాజెక్టులు, రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు ఇతర పర్యావరణ అనుకూల కార్యక్రమాలకు బ్యాంకులు చురుగ్గా రుణ సహాయం అందించాలని సూచించారు. సామాజిక భద్రత, బీమా పథకాల పరిధిలోకి రాష్ట్ర ప్రజలను తీసుకురావాలన్నారు. బ్యాంకులు కేవలం డబ్బు డిపాజిట్ చేసే, రుణాలు ఇచ్చే ఆర్థిక సంస్థలుగానే కాకుండా, రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల డబ్బు అంతా బ్యాంకులకే చేరుతుంది, కాబట్టి ఆ నిధులను ఏ రంగాల అభివృద్ధికి రుణాలుగా ఇస్తున్నామనేది చాలా ముఖ్యం. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధికి ఏ రంగం ఎక్కువ దోహదపడుతుందో ఆలోచించి బ్యాంకులు వ్యూహాత్మకంగా రుణాలు అందించాలన్నారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధి రేటు 8.2 శాతంగా ఉంటే, తెలంగాణ వృద్ధి రేటు 10.7 తో దూసుకుపోతోందని చెప్పారు. దేశ సగటు తలసరి ఆదాయం రూ.2.1 లక్షలుగా ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో దేశంలోనే అగ్రగామిగా ఉందని వెల్లడించారు. అలాగే మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ నిర్మాణం అత్యంత వేగంగా పూర్తి చేయడంకూడా ప్రధాన లక్ష్యాలుగా నిర్దేశించుకుని ముందుకు సాగుతున్నామని వివరించారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని చెప్పారు. ఈ నేపథ్యంలో సేవల రంగాని అధిక అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. మహిళా ఆర్థిక సాధికారత కోసం రాష్ట్రంలోని స్వయం సహాయక సంఘాల వడ్డీ లేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ఈ సందర్భంగా చెప్పారు. ఈ సంవత్సరం హైదరాబాద్‌లో మహిళా సంఘాలకు రుణ పంపిణీ యుద్ధప్రాతిపదికన దృష్టి సారించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నగరం మహిళలకు వ్యాపార రంగంలో, చిన్న, మధ్యతరహా పరిశ్రమల్లో ఎదగడానికి ఎన్నో అవకాశాలను ఇస్తోందన్నారు. నగరంలోని మురికివాడల్లోని యువ మహిళా పారిశ్రామికవేత్తలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్రంలో త్వరలోనే అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లను తీసుకువస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ వంటి వివిధ రంగాలను డిజైన్ చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యమని తెలియచేశారు. ఈ సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రెటరీ దాన కిషోర్, ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఆర్బీఐ రీజనల్ డైరెక్టర్ చిన్మయ మోహన్, ఎస్బీఐ సీజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు.

# 2 లక్షల మందికి కొత్తగా పెన్షన్లు

## జూన్ 2న ఘనంగా రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

## ప్రైవేటు విద్యాసంస్థలలో ఫీజుల నియంత్రణకు చర్యలు

## నేటి సాయంత్రం కేబినెట్ భేటీ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు సచివాలయంలో జరుగనుంది. జూన్2న రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర కేబినెట్ దిశానిర్దేశం చేయనుంది. రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు మే 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన (పెంచిన) భూముల మార్కెట్ విలువలు (రిజిస్ట్రేషన్ ధరలు) అమలులోకి రానున్న నేపథ్యంలో కేబినెట్ తుది నిర్ణయం తీసుకోనుంది. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన హిల్ట్ పాలసీ గైడ్‌లైన్స్ సిద్ధమైన నేపథ్యంలో వీటికి సంబంధించిన ఉత్తర్వుల జారీపై కేబినెట్ మరోసారి స్పష్టత ఇవ్వనుంది. ప్రైవేటు విద్యా సంస్థలలో ఫీజుల నియంత్రణకు సంబంధించి ప్రత్యేకంగా బిల్లును తీసుకొచ్చేందుకు కేబినెట్ నిర్ణయం తీసుకోనుందని తెలుస్తోంది. రెండోదశ ఇందిరమ్మ ఇళ్ల పథకం జూన్ 2 నుంచి ప్రారంభం కానుండటంతో లబ్ధిదారుల ఎంపికలో ఉండాల్సిన విధివిధానాలు, మార్పులపై కేబినెట్‌లో చర్చించనున్నారు. హ్యామ్ రోడ్ల టెండర్ల ప్రక్రియ ముగియడంతో పనుల వేగవంతంపై కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.సాగునీటి ప్రాజెక్టులు, ఉద్యోగ నియామకాలు, జర్నలిస్టుల ఇళ్లస్థలాలు, ఉద్యోగులు, పింఛనుదారుల ఆరోగ్యకార్డులు అంశాలను చర్చించే అవకాశాలున్నాయి. కొత్తగా 2 లక్షల మందికి పెన్షన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాల వారీగా అర్హుల జాబితాను సిద్ధం చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. తొలుత దివ్యాంగులు, తర్వాత వృద్ధులు, వితంతువులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించింది. మరోవైపు సెర్ప్ రాష్ట్ర వ్యాప్తంగా పెన్షనర్ల వివరాలను ఫేషియల్ రికగ్నిషన్ యాప్‌లో నమోదు చేస్తోంది. ఈ అంశంపై కేబినెట్ తుది నిర్ణయం తీసుకోనుంది. శనివారం సాయంత్రం జూన్ 2న తెలంగాణ అవతరణ దినోత్సవం సందర్భంగా నూతన సంక్షేమ కార్యక్రమాలు, పథకాల ప్రారంభంపై ఈ సందర్భంగా చర్చించనున్నట్లు సమాచారం.

# నీట్ పేపర్ లీక్ కేసులో మరో నిందితురాలి అరెస్ట్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** నీట్ యూజీ పేపర్ లీక్ కేసులో మరో కీలక నిందితురాలిని పోలీసులు అరెస్ట్ చేశారు. పుణెకు చెందిన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ మనీషా సంజయ్‌ని అదుపులోకి తీసుకున్నారు.గత ఏప్రిల్‌లో ఆమె ఫిజిక్స్‌కు సంబంధించిన కొన్ని ప్రశ్నలను లీక్ చేసినట్లు గుర్తించారు. ఇప్పటికే పోలీస్ కస్టడీలో ఉన్న నిందితుల సమాచారంతో మనీషాను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఈ కేసులో ఇప్పటి వరకు అరెస్ట్ అయిన వారి సంఖ్య 12కు చేరింది.

# రాజకీయాల కోసం రైతాంగాన్ని రెచ్చగొట్టొద్దు

## ధాన్యం కొనుగోళ్లపై వాస్తవాలను వక్రీకరించొద్దు

## కెటిఆర్ మాటల్లో రాజకీయ నిరాశ, అసహనం ప్రతిధ్వనిస్తోంది: మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రైతుల పేరుతో బిఆర్ఎస్ నేతలు ఆడుతున్న రాజకీయ నాటకాలు పరాకాష్టకు చేరాయని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లపై కెటిఆర్ చేసిన ప్రకటననే ఇందుకు నిదర్శనమని మండిపడ్డారు. నిజానిజాలు తెలుసుకోకుండా శవరాజకీయలు చేయడం బిఆర్ఎస్ పార్టీ నేతలకు పరిపాటిగా మారిందని కెటిఆర్‌పై విరుచుకుపడ్డారు. ఈ విషయమై శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పదేళ్ల పాటు అధికారంలో ఉండి రైతులను రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన కెటిఆర్, బిఆర్ఎస్ నేతలకు అకస్మాత్తుగా రైతుల మీద ప్రేమ పొంగిపొర్లడం హాస్యాస్పదంగా ఉందన్నారు. బిఆర్ఎస్ నేతలకు రైతుల సమస్యలపై ఆందోళన కంటే వారిలో రాజకీయ నిరాశ, అసహనం ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ధాన్యం కొనుగోళ్ల పై కెటిఆర్ చేస్తున్న అనుచితమైన ఆరోపణలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రైతాంగంలో గందరగోళం సృష్టించి అపోహలు కల్పించి రాజకీయ ప్రయోజనం పొందలన్నదే కేటీఆర్ ముఖ్య ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తోందని, ఏ విషయాన్ని దాచి పెట్టకుండా ప్రతీ విషయాన్ని బహిర్గతం చేస్తున్నామని వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు నుండి కొనుగోళ్ల ప్రక్రియ వరకు ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రజానీకానికి వివరాలు అందిస్తున్నామని, ఇక అనుమానాలకు ఆస్కారం ఎక్కడిదని కెటిఆర్‌ను మంత్రి ఉత్తమ్ నిలదీశారు. రైతుల మరణాలను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం అత్యంత దురదృష్టకరమని, ఎవరి మరణమైనా ప్రభుత్వానికి భాదకరమేనన్నారు. అయితే వాస్తవాలు నిర్ధారించుకోకుండా ఆరోపణలు చేసి సంచలనం సృష్టించేందుకే ధాన్యం కొనుగోళ్లను రాజకీయం చేసే ఎత్తుగడను బిఆర్ఎస్ అనుసరిస్తోందని దుయ్యబట్టారు. రైతుల మరణాలను బిఆర్ఎస్ నేతలు రాజకీయ ప్రయోజనాల కోసం మార్చుకోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో చేసిన ధాన్యం కొనుగోళ్లు, ప్రస్తుతం రెండేళ్లుగా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కొనుగోళ్లను ఆయన లెక్కలతో సహా వివరించారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటి వరకు రూ. 11499 కోట్ల విలువైన 48.21 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేసి రూ.8,203 కోట్లు చెల్లించినట్లు వివరించారు.

దాన్యం కొనుగోళ్ల ప్రక్రియను గణాంకాలతో పబ్లిక్ డొమినియన్‌లో పెడుతున్నప్పుడు వాస్తవాలను కెటిఆర్ వక్రీకరించి చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాన్యం కొనుగోళ్లు, దిగుబడిలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలిపిన ఘనత ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని, అది తట్టుకోలేక కెటిఆర్ నీతిమాలిన ప్రచారానికి దిగుతున్నారని మంత్రి ఉత్తమ్ దుయ్యబట్టారు. కెటిఆర్, బిఆర్ఎస్ నేతలు చేస్తున్న శవరాజకీయలు ,అసత్యపు ప్రచారాలు తెలంగాణ రైతులు నమ్మరని స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

23-05-2026, అధికజ్యేష్ఠ శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, రోహిణి కార్తె
అష్టమి తె.4.28
మఖ రా.2.11
వర్జ్యం : మ.2.11-మ.3.47
దు.తె.5.34-ఉ.7.14
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** పోటీ పరీక్షలు, విదేశీయానం, ఉద్యోగం వంటి విషయాలు కుటుంబానికి కలిసి వస్తాయి. స్వల్పధనలాభం.

**వృషభం:** సంతాన పురోగతి బాగుంటుంది. మీరు సుఖపడక పోయినా మీ కృషి వల్ల మీ వాళ్ళు సౌఖ్యంగా వుంటారు.

**మిథునం:** హడావుడిగా నిర్ణయాలు చేయాల్సి వస్తుంది. కృషి వ్యర్థం కాదన్న సంగతి కొన్ని సంఘటనలు ఋజువు చేస్తాయి.

**కర్కాటకం:** శుభకార్యాల విషయంలో మీ నిర్ణయాలు చర్చనీయాంశమవుతాయి. పూర్వపు మిత్రులను కలుసుకుంటారు.

**సింహం:** ముఖ్య ప్రయాణాలు మీకు మీరుగా వాయిదా వేస్తారు. విలువైన కొనుగోళ్ళకు సంబంధించి నిర్ణయాలు చేస్తారు.

**కన్య :** భాగస్వాముల తెలివితక్కువ నిర్ణయాల వల్ల కొన్ని అవకాశాలు మీకు ఇష్టం లేనివారికి దక్కుతాయి. వస్త్ర లాభం.

**తుల :** ప్రతి విషయంలోను జాగ్రత్తగా ఉండాలని నిర్ణయించుకుంటారు. భద్రపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తారు.

**వృశ్చికం:** పెద్ద స్థాయిని గలిగిన వ్యక్తులు కూడా చిన్న చిన్న పనులను చేసికోవలసి వస్తుంది. వ్యాపారాలు ప్రోత్సాహకరం.

**ధనుస్సు:** పెట్టుబడి ఖర్చు, అభివృద్ధికి భవిష్యత్ ప్రణాళికలు ఉపయోగము అవుతాయి. ప్రయాణాలు జాగ్రత్త.

**మకరం :** మీరు చెబితేనే గాని, అభివృద్ధి విషయములు మీ కార్యాలయంలోని వారికి నీ తెలియవు. స్థలాలు కొనుగోలు.

**కుంభం:** కొంత మంది విదేశీ ద్రవ్యమును, విశేషముగా ఆర్జించగలరు. పేరు ప్రఖ్యాతలు అధిగమగును. శుభవార్తలు అందుకుంటారు.

**మీనం:** గృహాలంకరణలకు ధనమును ఖర్చు చేస్తారు. శుభవార్తా శ్రవణం చేస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శుక్రవారం న్యూఢిల్లీలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన బెంగాల్ సిఎం సువేందు అధికారి

# 24 రాజ్యసభ సీట్లకు జూన్18న పోలింగ్

**న్యూఢిల్లీ, మే 22:** ఈ యేడాది జూన్, జులైలో సభ్యుల పదవీ విరమణ కారణంగా ఖాళీ కానున్న 24 రాజ్యసభ స్థానాలను భర్తీ చేసేందుకు నిర్వహించే ద్వైవార్షిక ఎన్నికల షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) శుక్రవారం ప్రకటించింది. ఎన్నికల కమిషన్ తెలిపిన వివరాల ప్రకారం, 10 రాష్ట్రాల నుండి ఎన్నికైన 24 మంది రాజ్యసభ సభ్యుల పదవీకాలం జూన్-జులైలో ముగియనుంది. జూన్ 1న ఎన్నికల నోటిఫికేషన్లు జారీ చేయనుంచడగా, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీగా జూన్ 8ని నిర్ణయించారు. నామినేషన్ల పరిశీలన జూన్ 9న జరుగుతుంది, అభ్యర్థులు తమ నామినేషన్లను జూన్ 11 వరకు ఉపసంహరించుకోవడానికి అనుమతి ఉంటుంది. జూన్ 18న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించబడుతుంది, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. మొత్తం ఎన్నికల ప్రక్రియ జూన్ 20 నాటికి పూర్తి కావాల్సి ఉంది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు తీసుకుంటామని, ఇందులో భాగంగా పరిశీలకులను నియమించి ఎన్నికల ప్రక్రియను నిశితంగా పర్యవేక్షిస్తామని కూడా ఇసి తెలిపింది. ఈ ఎన్నికలు ఆంధ్రప్రదేశ్, గుజరాత్, జార్ఖండ్, మధ్య ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, రాజస్థాన్, అరుణాచల్ ప్రదేశ్, కర్ణాటక, మిజోరాం రాష్ట్రాలలోని స్థానాలకు వర్తిస్తాయి. పదవీకాలం ముగియనున్న ప్రముఖ నాయకులలో మధ్యప్రదేశ్ నుండి దిగ్విజయ్ సింగ్, కర్ణాటక నుండి హెచ్.డి. దేవెగౌడ, మల్లికార్జున ఖర్గే ఉన్నారు. ఆగస్టు 4, 2025 నుంచి ఖాళీగా ఉన్న జార్ఖండ్ నుంచి దివంగత శిబు సోరెన్‌కు చెందిన స్థానానికి కూడా ఎన్నికలు జరగనున్నాయి. అయోధ్య రామిరెడ్డి అల్లా, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వానీ, సానా సతీష్, రాంభాయ్ హర్జిభాయ్ మొకారియా, జార్జ్ కురియన్, మహారాజా సనజౌబా లీషెంబా, వాన్‌వీరోయ్ ఖర్లూఖీ, నీరజ్ డాంగి, రాజేంద్ర గెహ్లాట్, నబం రెబియా, ఈరన్నా కడాడి, మరియు కె. వనలాల్వేనా, ఇతర సభ్యులు పదవీ విరమణ చేస్తున్నారు.

# 9 రోజులు దాచిందెవరు?

>> అన్నారు. ఇద్దరు తోడు దొంగలని, వారు కలిసి డ్రామాలు ఆడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డికి హైట్ ఒక్కటే తక్కువ అనుకున్నానని, కానీ బుర్ర కూడా తక్కువేనని వ్యాఖ్యానించారు. బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేశారని, కానీ హైకోర్టులో అనుకూలంగా తీర్పు రాలేదని కెటిఆర్ తెలిపారు. ఒక అమ్మాయికి అన్యాయం జరిగితే ఆ అమ్మాయి వివరాలు బయటపెట్టింది బిజెపి వారే అన్నారు. పేట్ బషీరాబాద్‌లో 15 మందిపై కేసులు నమోదయ్యాయని, వారంతా బిజెపివారే అన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోడీ తెలంగాణ పర్యటనకు వచ్చి చావు కబురు చల్లగా చెప్పారని విమర్శించారు. రైతులు యూరియా ఉపయోగించడం తక్కువ చేయాలని, ప్రజలు బంగారం కొనుగోలు తగ్గించాలని చెప్పారని గుర్తు చేశారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ధాన్యం సేకరణలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, ధాన్యం సేకరణపై సిఎం రేవంత్ రెడ్డి దుర్మార్గంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అబద్ధాలతో సిఎం రేవంత్ పాలనను నెట్టుకొస్తున్నారని అన్నారు. మంచిర్యాల జిల్లాలో నలుగురు రైతులు చనిపోయారని.. కానీ ఒక్కరైతు కూడా చనిపోలేదని మంత్రులు మాట్లాడటం శోచనీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటివరకు 35శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని మాజీ మంత్రి విమర్శించారు. రైతులే కాదు.. కాంగ్రెస్ కార్యకర్తలూ ధర్నా చేస్తున్నారని తెలిపారు. గురువారం సిఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గంలో కూడా రైతులు ధర్నా చేశారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ విషయంలోనూ ప్రణాళిక లేదని మాజీ మంత్రి కెటిఆర్ విమర్శలు గుప్పించారు. కొనుగోలు కేంద్రాల్లో చనిపోయిన రైతులు దాదాపు 10 మంది ఉన్నారు. 45 డిగ్రీల ఎండలో రైతులు పడిగాపులు కాస్తున్నారని చెప్పారు. శనివారం జరిగే కేబినెట్ సమావేశంలో ఈ అంశమే అజెండగా ఉండాలని,ప్రభుత్వం ఎంత ధాన్యం కొనుగోలు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

# ఎసిబి వలలో స్పెషల్ గ్రేడ్ డి.కలెక్టర్

>> లక్షల పది వేల 800 రూపాయల నగదు, 20 లక్షల రూపాయల బ్యాంకు బ్యాలెన్స్, 122 గ్రాముల బంగారు నగలు, 32 లక్షల రూపాయల విలువ చేసే రెండు కార్లు పట్టుబడ్డాయి. వీటి విలువ ఆరు కోట్ల 22 లక్షల 38 వేల 800 రూపాయలుగా తేలింది. దీంతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ పిగ్లిపురంలో ఎనిమిది ఎకరాల ఖరీదైన భూమిని వంశీ మోహన్ కాజేసినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. ఇదే ప్రాంతంలోని మరో రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తీసుకున్నట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో వంశీమోహన్ అక్రమాలపై ఎసిబి అధికారులు పక్కా సమాచారం సేకరించి శుక్రవారం ఉదయం ఆరు గంటల సమయంలో వనస్థలిపురంలోని ఆయన ఇంటితో పాటు కార్యాలయం, బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో దాడులు చేశారు. శేరిలింగంపల్లి మండలం నానక్‌రాంగూడ సర్వే నంబర్ 149లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని నిబంధనలకు విరుద్ధంగా జిఓ 59 కింద ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టిన విషయాన్ని ఎసిబి అధికారులు సోదాల్లో గుర్తించినట్లు తెలిసింది. దీంతో పాటు ఖానామెట్‌లో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు రెవెన్యూ సిబ్బంది పేరిట నిబంధనలకు విరుద్ధంగా మార్చినట్లు ఎసిబి అధికారులు గుర్తించినట్లు తెలిసింది. గచ్చిబౌలిలో సర్వే నంబర్ 91లో ఎకరన్నర ప్రభుత్వ భూమిలో తన సోదరుడితో కలిసి ప్రైవేటు భూమిగా చూపుతూ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు ఎసిబి అధికారులు గుర్తించారు. వంశీ మోహన్ వద్ద పట్టుబడిన ఆస్తుల విలువ 200 కోట్ల రూపాయల వరకు వుండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఆయనను అదుపులోకి తీసుకుని ఇంకా విచా రిస్తున్నారు.

# ఇండో-సైప్రస్ వ్యూహాత్మక దౌత్యం

>>లిడ్స్‌తో ప్రధాని మోడీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. తర్వాత జరిగిన సంయుక్త మీడియా సంక్షిప్తీకరణలో ప్రధాని మాట్లాడుతూ, ఈ నూతన నిర్ణయం ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలకు సరికొత్త ఉత్సాహాన్ని, స్పష్టమైన గమనాన్ని ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భారతసైప్రస్ బంధం కాల పరీక్షకు నిలబడిందని, దశాబ్ద కాలంలో సైప్రస్ నుండి భారతదేశానికి వచ్చే పెట్టుబడులు దాదాపు రెండు రెట్లు పెరిగాయని ప్రధాని మోడీ వెల్లడించారు. భారత్-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం వల్ల రెండు దేశాలకు అనేక కొత్త అవకాశాలు లభిస్తున్నాయని ఆయన అన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో ఇరు దేశాల మధ్య పెట్టుబడులను మరోసారి రెట్టింపు చేయాలనే అత్యున్నత లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు ప్రధాని ఉద్ఘాటించారు. రక్షణ, డిజిటల్ రంగాల్లో అవగాహన ఒప్పందాలు ఈ ఉన్నత ఆశయాలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి ఇరు దేశాలు పలు కీలక రంగాలలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ముఖ్యంగా డిజిటల్ మౌలిక సదుపాయాలు, ఫిన్‌టెక్ ఎకోసిస్టమ్స్, సరికొత్త పరిశోధనా కేంద్రాల ఏర్పాటులో పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవాలని నిర్ణయించారు. వీటితో పాటు విద్యాసంస్థల మధ్య సంస్థాగత భాగస్వామ్యాలు, విద్యార్థుల మార్పిడి కార్యక్రమాలు, ఉమ్మడి శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహించడంపై దృష్టి పెట్టారు.

ఇరు దేశాల మధ్య తరలివెళ్లే ఉద్యోగుల హక్కుల రక్షణ కోసం సమగ్ర వలసరవాణా ఒప్పందంతో పాటు సామాజిక భద్రతా ఒప్పందాన్ని తీసుకురావడానికి ఇరు దేశాలు ఏకీభవించాయి. తూర్పు మధ్యధరా ప్రాంతంలో సైప్రస్ భౌగోళిక స్థానం అత్యంత కీలకమని మోడీ గుర్తుచేసారు. సరిహద్దు ఉగ్రవాద బెదిరింపులు, రాడికలైజేషన్, సైబర్ నేరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా ఉగ్రవాద నిరోధకతపై ఒక ఉమ్మడి కార్యనిర్వాహక బృందాన్ని అధికారికంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ, సముద్ర భద్రత, ఉగ్రవాద నిర్మూలన రంగాలలో సహకారాన్ని మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యం, చట్టబద్ధత, అన్ని దేశాల సార్వభౌమత్వం మరియు ప్రాదేశిక సమగ్రతను గౌరవించడమే ఈ భాగస్వామ్యానికి ప్రధాన సూత్రాలని మోడీ వివరించారు. ఉన్నత స్థాయి ప్రతినిధుల బృందంలో విదేశాంగ మంత్రి కాన్స్టాంటినోస్ కొంబోస్, రవాణా మంత్రి అలెక్సిస్ వాఫియాడెస్ సహా భారత్ వచ్చిన అధ్యక్షుడు క్రిస్టోడౌలిడ్స్ పర్యటన మహారాష్ట్రలో ప్రారంభమైంది. ముంబైలో ఆయనకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, సిఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఘనంగా స్వాగతం పలికారు. అక్కడ జరిగిన బిజినెస్ మీట్‌లో గ్లోబల్ షిప్పింగ్, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ రంగాల్లోని భారీ పెట్టుబడి అవకాశాలను భారతీయ పారిశ్రామిక ప్రముఖుల ముందు సైప్రస్ ప్రతినిధులు ప్రవేశపెట్టారు. తర్వాత ఢిల్లీ చేరుకున్న సైప్రస్ అధ్యక్షుడికి రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారిక స్వాగతం పలికి, ఆయన గౌరవార్థం అధికారిక విందును ఏర్పాటు చేశారు.



శుక్రవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వరస్వామి దర్శనానికి వచ్చిన గవర్నర్ శివప్రతాప్శుక్లా దంపతులకు స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు

# కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్న గవర్నర్ శివప్రతాప్శుక్లా దంపతులు

## సరస్వతి అంత్యపుష్కరాల ఏర్పాట్లపై హర్షం

### పట్టువస్త్రాల తయారీని వివరించిన మంత్రి శ్రీధర్‌బాబు

**మహదేవపూర్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా దంపతులు శుక్రవారం ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు గురువారం రాత్రి వీరు పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానాన్ని ఆచరించారు. అనంతరం సరస్వతి ఘాట్ వద్ద కాశీ పండితులు నిర్వహించిన సరస్వతి నవరత్న మాలా హారతి, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను గవర్నర్ దంపతులు ఆసక్తిగా వీక్షి ంచారు. ముక్తీశ్వర స్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్ దంపతులకు దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల నడుమ పరివట్టం, పూర్ణకుంభం, మంగళ వాయిద్యాలతో ఘన స్వాగతం పలికారు. ఆలయంలో గవర్నర్ దంపతులు స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పూజారులు వారిని వేదాశీర్వచనం అందించి, శేష వస్త్రాలు, లడ్డు ప్రసాదం, చక్కెర పొంగలితో పాటు అమ్మవారి జ్ఞాపికను బహూకరించారు. ఆలయ ప్రాంగణంలోని స్టాల్లో ఏర్పాటు చేసిన దసలి పట్టు వస్త్రాల స్టాలును గవర్నర్ దంపతులు సందర్శించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు టస్సార్ పట్టు వస్త్రాల తయారీ విధానాన్ని, వాటి ప్రత్యేకతను గవర్నర్కు స్వయంగా వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ.. సరస్వతి అంత్య పుష్కరాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయని కొనియాడారు. సరస్వతి ఘాట్ వద్ద కాశీ పండితులు ఇచ్చిన నవరత్న మాలా హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతికి, ఆధ్యాత్మికతకు అద్దం పడుతున్నాయని ప్రశంసించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని వసతులు, అద్భుతమైన ఏర్పాట్లు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. భక్తులందరూ పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరించి, స్వామి, అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని గవర్నర్ ఆకాంక్షి ంచారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఇతర ఉన్నతాధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బ్లాక్‌లో ఐపిఎల్ క్రికెట్ టిక్కెట్లు

## ఉప్పల్‌లో నలుగురి అరెస్ట్

**హైదరాబాద్ (ఉప్పల్), మే 22, ప్రభాతవార్త :** ఉప్పల్లోని రాజీవ్గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వద్ద బ్లాక్లో టిక్కెట్లు విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను ఎస్ఓటి పోలీసులు అదుపులోకి తీసుకుని ఉప్పల్ పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకా రం.. ఉప్పల్లోని రాజీవ్గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ చాలెంజర్స్ బెంగుళూరు జట్ల మధ్య చివరి మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్లో బెంగ ళూరు జట్టు నుంచి విరాట్ కోహ్లీ రానుండడంతో మ్యాచ్కు విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. దీనిని ఆసరాగా చేసుకుని కొందరు కాంప్లిమెంటరీ టిక్కెట్లను బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్నారు. ఉప్పల్ స్టేడియం గేట్ నెం.2వ వద్ద బ్లాక్లో టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు 'వార్త' దినపత్రికలో కథనాలు రావడంతో పోలీసులు స్పందించి మఫ్టీలో గస్తీ ఏర్పాటు చేశారు. దీంతో అక్కడ టిక్కెట్లు విక్రయిస్తున్న నలుగురికి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఐదు టిక్కెట్లు స్వాధీనం చేసుకున్నారు. సెలబ్రిటీలు, అధికారులు, వివిఐపిలకు ఉచితంగా కేటాయించే అత్యంత విలువైన కాంప్లిమెంటరీ టికెట్లు బహిరంగంగా బ్లాక్ మార్కెట్లోకి రావడం గమన్హారం. సాధారణ టికెట్లతో పాటు ఈ ఉచిత పాసులను కూడా అక్రమారులు సామాన్య అభిమానులకు భారీ ధరలకు విక్రయిస్తూ సొమ్ముచేసుకుంటున్నారని తెలిపారు. వీరి వద్ద నుంచి ఐదు కాంప్లమెంటరీ టికెట్లను, నగదును, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకు న్నారు.



ఉప్పల్లో బ్లాక్లో విక్రయిస్తున్న ఐపిఎల్ టిక్కెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్న దృశ్యం.

**పక్కదారి పడుతున్న కాంప్లిమెంటరీ టికెట్లు?**

కాంప్లమెంటరీ పాసుల విక్రయాలపై పోలీసులు పలు కోణాలలో విచారణ చేస్తున్నారు. వివిపిలు, రాజకీయ నాయకులకు కేటాయించే వీరి టిక్కెట్లను కొందరు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారని పలు వురు విమర్శిస్తున్నారు. గత రెండు నెలలుగా సాగుతున్న ఈ బ్లాక్ టికెట్ల దందాపై పలు కోణాలలో విచారణ చేస్తున్నారు. మ్యాచ్ సమయంలో అభిమానుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేస్తున్న ముఠాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు.

# బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తాం

## మాజీమంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్రావు అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న మాజీ మంత్రి.. కాంగ్రెస్ సర్కార్ చేపడుతున్న ఫ్యూచర్ సిటీ ప్రాజెక్ట్పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీకి మాత్రమే కేంద్ర పర్యావరణశాఖ అనుమతి ఇచ్చిందని తెలిపారు. డీవియేషన్ ఉంటే రైతుల భూములు వెనక్కి ఇవ్వాలని చట్టంలో ఉందని వెల్లడించారు. ఫార్మా సిటీని కొనసాగిస్తామని ఓ వైపు కోర్టుకు చెబుతూ.. రేవంత్ ప్రభుత్వం జిమ్మిక్కు చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీ వస్తే దానికి అనుబంధంగా కనీస సౌకర్యాలు ఎడ్యుకేషన్, హౌసింగ్ రావాలని ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. 75శాతం ఫార్మా సిటీ ఉండి... మిగతా 25శాతం మిగతావి ఉండాలని అన్నారు. కానీ..75శాతం మిగతా వ్యాపారం చేసి.. కేవలం 25శాతమే ఫార్మా వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. ఇది చట్ట ప్రకారం చెల్లదన్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని.. ఫార్మా సిటీని రీస్టోర్ చేస్తామని స్పష్టం చేశారు. "ఇది నా మాట కాదు.. పార్లమెంట్ చట్టం. ఫార్మా సిటీ వస్తే లక్షలాది మందికి ఉద్యోగాలు వస్తాయని మేము ప్రారంభించాం. మన దగ్గర నుంచి ఒక్క ఫార్మా కంపెనీ బయటికి వెళ్లొద్దని చేశాం.

ఇప్పటికే రెండున్నరేళ్లు గడిచిపోయింది. లాస్ట్ వన్ ఇయర్ ఎలక్షన్ ఉంటుంది. రేవంత్ సర్కార్ ఏమీ చేయలేదు. భూములు పంచి పెడితే బ్యాక్ ఎండ్ ఏదో లబ్ధి పొందాలని ప్లాన్ చేశారు. ఫార్మా సిటీ అభివృద్ధి చెందితే బీఆర్ఎస్కు పేరు వస్తుందని ఇలా చేశారు. ఉన్నది ఉన్నట్టుగా అక్కడ ఫార్మా సిటీనే వస్తుంది అని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఫార్మా సిటీ కోసం తాము 16 వేల ఎకరాల భూసేకరణ చేశామని, దానికి కేంద్ర పర్యావరణ శాఖ నుంచి అన్ని క్లియరెన్సులు కూడా వచ్చాయని వెల్లడించారు. ఏ ఉద్దేశంతోనైతే రైతుల దగ్గర నుంచి భూములు తీసుకున్నామో దానికి భిన్నంగా భూమిని వేరే అవసరాల కోసం వాడితే ఆ ల్యాండ్ను తిరిగి రైతులకే ఇచ్చేయాలని చట్టం చెబుతోందని తెలిపారు. ఫార్మా సిటీని రద్దు చేసి వేరే ప్రాజెక్ట్ పెడితే చట్ట ప్రకారం ఆ భూములను రైతులకు వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని విమర్శించారు. ఫార్మా సిటీని రద్దు చేయడం లేదని రేవంత్ సర్కార్ హైకోర్టులో కేసు విచారణ సందర్భంగా అబద్ధాలు చెప్పిందని,. ఓవైపు కోర్టుకు ఫార్మా సిటీ కొనసాగిస్తామని చెబుతూనే మరోవైపు ఫ్యూచర్ సిటీ అంటూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని మండిపడ్డారు. ఫార్మా సిటీ ద్వారా లక్షలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు వస్తాయని చట్ట ప్రకారం దాన్నే కొనసాగించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# భూ హక్కు కోసం అమెరికా నుంచి వచ్చిన ఎన్నారై రైతు!

## ఐదు నెలలపాటు తిరిగినా దక్కని న్యాయం

## జిన్నారంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

**జిన్నారం, మే 22, ప్రభాతవార్త:** అమెరికాలో స్థిరపడిన ఓ రైతు స్వ గ్రామంలోని తన భూమి కోసం స్వదేశానికి పరుగెత్తుకొచ్చి, ఐదు నెలలుగా అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం దక్కకపోవడంతో చివరకు జిన్నారం మండల తహశీల్దార్ కార్యాలయం ఎదుటే దీక్షకు దిగారు. జిన్నారం మండల పరిధిలోని శివనగర్కు చెందిన రైతు రవి శంకర్కు చెందిన సర్వే నంబర్ 172లోని 14 గుంటల పట్టా భూమిని సంబంధం లేని వ్యక్తి పేరుపై రెవెన్యూ అధికారులు మార్చారు. ఈ విషయం తెలుసుకున్న రవిశంకర్ అమెరికా నుంచి హుటాహుటిన స్వగ్రామానికి చేరుకుని, ఐదు నెలలుగా రెవెన్యూ అధికారులను కలిసి తన భూమి హక్కుల కోసం పోరాడుతున్నారు. అయితే ఎవరూ తన సమస్యను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పలు మార్లు వినతిపత్రాలు ఇచ్చినా, ఆధారాలు చూపించినా అధికారులు స్పందించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జిన్నారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతు రవిశంకర్(82) ధర్నాకు దిగా రు. 'నా భూమిని తిరిగి నా పేరుపై నమోదు చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేదే'దంటూ ఆయన స్పష్టం చేశారు. మరోవైపు జూన్ మొ దటి వారంతో తన అమెరికా గ్రీన్కార్డు గడువు ముగియనుందని, తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఉన్నప్పటికీ న్యాయం కోసం ఇక్కడే ఉం డాల్సి వస్తోందని కన్నీటి పర్యంతమయ్యారు. రైతు చేస్తున్న దీక్షకు స్థానికులు, రైతు సంఘాల నాయకులు మద్దతు తెలుపుతున్నారు. రెవెన్యూ శాఖ నిరక్ష ్యంపై మండిపడుతూ, వెంటనే విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఎన్నారై రవిశంకర్

# బండి భగీరథ్ కస్టడీ పిటిషన్‌పై విచారణ వాయిదా

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** మైనర్ బాలికపై లైంగిక దాడి చేసిన ఘటనకు సంబంధించి నమోదైన పోక్సో కేసులో అరెస్టయిన బండి భగీరథ్ కస్టడీ పిటిషన్పై మల్కాజిగిరి పోక్సో కోర్టు విచారణను వాయి దా వేసింది. ఈ నెల 8న భగీరథ్పై పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్లో పోక్సో కేసు నమోదు కాగా వెంటనే అతను అజ్ఞాతంలో వెళ్లి హైకోర్టులో మధ్యంతర బెయిల్కు ప్రయత్నించగా అక్కడ డిస్మిస్ అయింది. దీంతో ఈ నెల 15న అతన్ని పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే. అప్పటినుంచి భగీరథ్ చర్లపల్లి జైల్లో రిమాండులో వు న్నాడు. కాగా భగీరథ్ను పోక్సో కేసులో మరింత విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని ఈ కేసును విచారిస్తున్న సిట్ అధికారులు మల్కాజిగిరి పోక్సో కోర్టులో శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. భగీరథ్పై వచ్చిన అభియోగాలు తీవ్రమైనవని, అతన్ని వారం రోజులపాటు విచారించాల్సి న అవసరం ఉందని సిట్ అధికారులు కోర్టును కోరారు. దీనిని డిఫెన్స్ న్యాయవాది వ్యతిరేకించారు. ఇరువర్గాల వాదనలు విన్న పోక్సో కోర్టు న్యాయమూర్తి దీనిపై విచారణకు ఈ నెల 26వ తేదీకి వాయిదా వేశారు.

# విద్యుత్ జెన్కోలో సిబ్బంది హేతుబద్ధీకరణ

## అనుబంధ సంస్థలకు 500 మంది బదలీ

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** విద్యుత్ సంస్థల నిర్వహణను మెరుగుపరిచేందుకు, తెలంగాణ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (టిజి జెన్కో) సిబ్బంది హేతుబద్ధీకరణ చేపట్టింది. ఇందులో భాగంగా హైదరాబాద్ విద్యుత్ సౌధ లో ఉన్న సుమారు 500 మంది అదనపు సిబ్బందిని, ఉద్యోగులను రాష్ట్రంలోని వివిధ థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బదిలీ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ సౌధలో పరిపాలన సిబ్బంది ఎక్కువగా ఉండటం, క్షేత్రస్థాయిలో (పవర్ ప్లాంట్ల వద్ద) సిబ్బంది కొరత ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

అత్యధికంగా ఇంజనీరింగ్, అడ్మినిస్ట్రేటివ్ పోస్టుల్లో పనిచేసే వారిని థర్మల్ ప్లాంట్లకు సర్దుబాటు చేస్తున్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల పనితీరును సమర్థవంతంగా మార్చడం, వివిధ కేంద్రాల మధ్య శ్రామిక శక్తిని (మ్యాన్‌పవర్) సమతుల్యం చేయడం ఈ హేతుబద్ధీకరణ ముఖ్య ఉద్దేశం. సిబ్బంది హేతుబద్ధీకరణ అనేది కార్యాచరణ సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, ఖర్చులను తగ్గించడానికి ఒక సంస్థ యొక్క శ్రామిక శక్తిని పునర్నిర్మించే ఒక వ్యూహాత్మక వ్యాపార ప్రక్రియ.

ఇది కేవలం సిబ్బందిని తగ్గించడం కాకుండా, అనవసరమైన పాత్రలను తొలగించడం, ఉద్యోగ విధులను ఏకీకృతం చేయడం లేదా పనిభారాన్ని పునఃపంపిణీ చేయడం ద్వారా ప్రతిభను వ్యూహాత్మక లక్ష్యాలతో సమలేఖనం చేయడాన్ని కలిగి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ (కేటీపీఎస్), కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టు (కేటీపీపీ)లో అవసరానికి మించి ఉద్యోగులు ఉన్నారు. ఇక విద్యుత్‌సౌధలో ఏకంగా 700మంది పని చేస్తున్నారు.

యాదాద్రిలో 40శాతం ఉద్యోగుల కొరత ఉండగా, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లో 30శాతం ఉద్యోగుల కొరత ఉంది. ఈ అంశాలను పరిశీలించిన జెన్కో ఉన్నతాధికారులు ఉద్యోగులు హేతుబద్ధీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా విద్యుత్ సౌధ నుంచి 500 మందిని యాదాద్రి, భద్రాద్రి థర్మల్ ప్లాంట్లకు పంపించే యోచనలో ఉన్నారు.

# చంచల్‌గూడా జైలుకు బడా కిలాడీ నౌహెరా షేక్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు గల్ఫ్ దేశాలలోనూ మతం పేరు చెప్పి ఐదు వేల కోట్ల రూపాయలు దో చుకున్న కేసులో నిందితురాలుగా వున్న హీరా గోల్డ్ అనే గోల్‌మాల్ కంపెనీ అధిపతి బడా కిలాడి నౌ హేరా షేక్ను మరోసారి చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఎనిమిదేళ్ల క్రితం రట్టయిన హీరా గోల్డ్ కంపెనీ వ్యవహారంలో నౌహెరా షేక్ను మహారాష్ట్ర పోలీసులతో పాటు తెలంగాణ పోలీసులు అరెస్టు చేసి సుధీర్ఘ కాలం పాటు జైల్లో వుంచడం తెలిసిందే.

నౌహెరా షేక్ బాధితులు ఐదు వేల మందికి పైగా వున్నారు. వీరంతా లక్ష రూపాయల నుంచి పది లక్షల రూపాయల వరకు బంగారు, వజ్రాల నగల తయారీకి సంబంధించి పెట్టుబడి పెట్టి మునిగారు. కాగా ఈ కేసులో మనీలాండరింగ్ కోణం వుండడంతో ఎన్‌ఫోర్స్ మెంట్ డైరక్టరేట్ (ఇడి) అధికారులు రంగంలో దిగి మరో కేసు నమోదు చేశారు. ఈడీ నమోదు చేసిన కేసులో హీరా గోల్డ్ కంపెనీకి చెందిన 400 కోట్ల రూపాయల ఆస్తులను మూడేళ్ల క్రితమే జప్తు చేశారు. ఈ ఆస్తులన్నీ హైదరా బాద్లో వున్నాయి.

దేశంలోని ఇతర ప్రాంతాల ఆస్తుల వేలం ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. అయితే నగరంలోని హీరా గోల్డ్ ఆస్తులను వేలం వేయగా కొందరు ఔత్సాహికులు ఖరీదు చేశారు. చట్ట ప్రకారం ఈ ఆస్తులను వాటిని కొనుగోలు చేసిన వారి పేరిట నౌహెరా షేక్ బదిలీ చేయా ల్సి వుండగా ఆమె కొన్ని నెలలుగా తప్పించుకు తిరుగుతోంది. దీంతో ఆమె వెంటనే లొంగిపోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చింది. అయినా కూడా నౌహెరా షేక్ దీనిని ఖాతరు చేయకుండా తప్పుడు పత్రాలతో హరియాణాలోని గురుగ్రాంలో ఒకచోట వుండగా దీనిపై పక్కా సమాచారం అందుకున్న హైదరాబాద్ ఈడీ అధికారులు గురువారం రాత్రి ఆమెను అరెస్టు చేశారు.

అనంతరం శుక్రవారం ఉదయం విమానంలో హైదరాబా ద్కు తరలించి నాంపల్లిలోని ఈడీ కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు రెండు వారాల రిమాండు నిమిత్తం చంచల్‌గూడ మహిళా జైలుకు తరలించారు.

# నేడు పాలిసెట్, ఎల్‌పి సెట్-2026 ఫలితాలు విడుదల

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్)-2026 ఫలితాలతోపాటు లాటరల్ ఎంట్రీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎల్పీ సెట్)-2026 ఫలితాలను నేడు (శనివారం) విడుదల చేయనున్నారు. ఫలితాలను శనివారం ఉదయం 11.30 గంటలకు మాసబ్ ట్యాంక్లోని సాంకేతిక భవన్లో సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ ఫలితాలను విడుదల చేయనున్నారు. పాలిసెట్-2026 పరీక్షను ఈ నెల 13న రాష్ట్ర వ్యాప్తంగా 293 కేంద్రాల్లో పరీక్షలను నిర్వహించారు. పరీక్షకు 1,06,439 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 98,029 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 52,200 మంది బాలురు ఉండగా, 45,829 మంది బాలికలు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో బాలురు 92.40 శాతం హాజరు కాగా, 91.75 శాతం బాలికలు హాజరయ్యారు. లాటరల్ ఎంట్రీ పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఎల్పీ సెట్)-2026 ఫలితాలను కూడా నేడే పాలిసెట్ ఫలితాలతోపాటు విడుదల చేయనున్నారు. ఎల్పీసెట్ పరీక్ష ఈ నెల 15న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించారు. పరీక్షలకు 522 మంది బాలురు దరఖాస్తు చేసుకోగా వారిలో 490 మంది(93.87శాతం) హాజరయ్యారు. బాలికలు 19 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 18 మంది(94.74 శాతం) పరీక్షలకు హాజరయ్యారు. ఈ రెండు ఫలితాలను నేడు విడుదల చేయనున్నారు. పాలిసెట్ ఫలితాలు విడుదల కాకముందే ఈ నెల 27 నుంచి కౌన్సెలింగ్ను నిర్వహించనున్నట్టు పాలిసెట్ అధికారులు ప్రకటించారు.

# 28న జరగాల్సిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలు వాయిదా

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** ఈ నెల 28న బక్రీద్ (ఈద్‌ఉల్‌అజ్హా) పండుగ ఉన్న నేపథ్యంలో ఆ రోజు జరగాల్సిన డిపార్ట్‌మెంటల్ పరీక్షను వాయిదా వేస్తున్నట్టు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీ పీఎస్‌సీ) ప్రకటించింది. ఈ నెల 28న జరగాల్సిన డిపార్ట్‌మెంటల్ పరీక్షలను జూన్ 3న నిర్వహించనున్నట్టు కమిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ఉద్యోగుల సేవా సంఘం సమర్పించిన విజ్ఞప్తి మేరకు ఈ నెల 28న జరగాల్సిన శాఖాపరమైన పరీక్షలను వాయిదా వేసి, జూన్ 3కి తిరిగి షెడ్యూల్ చేయడం జరిగిందని ప్రకటించింది. ఈనెల 28 న జరగాల్సిన పరీక్ష అభ్యర్థులు, ఈ నెల 30 సాయంత్రం 5 గంటల నుండి కమిషన్ అధికారిక వెబ్‌సైట్ నుండి తమ హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని స్పష్టం చేసింది. హాల్‌టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవడంలో ఏమైనా ఇబ్బంది ఎదురైతే అభ్యర్థులు 040-22445566 నంబర్ ద్వారా హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించవచ్చని కమిషన్ ప్రకటనలో పేర్కొంది.



సిఎం ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న డా.జి.చిన్నారెడ్డి

# సిఎం ప్రజావాణికి అందిన దరఖాస్తులు 396

**హైదరాబాద్ (బేగంపేట) మే 22, ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్లో శుక్రవారం నిర్వహించిన సీఎం ప్రజావాణీ కార్యక్రమంలో మొత్తం 396 దరఖాస్తులు అందాయి.వీటిలో పం చాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 163 దరఖాస్తులు, రెవెన్యూ శాఖకు సంబంధించి 47 దరఖాస్తులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం 113 దరఖాస్తులు, ప్రవాసీ ప్రజావాణీకి 1దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 72 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణీ ఇంచార్జ్,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్‌ఛైర్మన్ డా.జీ. చిన్నారెడ్డి దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ ఉమేందర్,ఎన్ఆర్ఐ సమన్వయ మండలి వైస్‌ఛైర్మన్ మంద భీంరెడ్డి వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘం తూప్రాన్, జిల్లా మెదక్
బహిరంగ వేలము ప్రకటన

ఫైల్ నెం.: A1/602/2026-27 తేది: 22.05.2026

ఇందుమూలముగా పట్టణ ప్రజలకు మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా తూప్రాన్ పురపాలక సంఘంనకు సంబంధించిన పాత మున్సిపల్ కార్యాలయం ప్రక్కన ఉన్న (08) మున్సిపల్ దుకాణాలకు సంబంధించి ఈ దిగువ చూపబడిన దుకాణముల నెలసరి అద్దె ప్రతిపాదన పైన 5 సం॥ ల కాలమునకు కేటాయించుటకు గాను ఈ క్రింది షరతులకు లోబడి పురపాలక సంఘ కార్యాలయ ఆవరణ లో బహిరంగ వేలము నిర్వహించుటకు నిర్ణయించడం జరిగినది. బహిరంగ వేలములో పాల్గొనుటకు దరఖాస్తులు సమర్పించు చివరి తేది.03.06.2026, సాయంత్రం 5:00 గంటల వరకు మరియు బహిరంగ వేలము తేది పట్టికలో చూపనైనది.

| క్ర.సంఖ్య | వేలము నిర్వహించే షాపుల వివరాలు | షాపు విస్తీర్ణం (Sft) | పురపాలక సంఘం నిర్ణయించిన నెలసరి అద్దె | వేలము తేది మరియు సమయము |
|---|---|---|---|---|
| 1 | 1 | 264 | 14000/- | 04-06-2026 (11.00 గం.లకు) |
| 2 | 2 | 264 | 14000/- | |
| 3 | 3 | 165 | 6000/- | |
| 4 | 4 | 165 | 6000/- | |
| 5 | 5 | 165 | 6000/- | |
| 6 | 6 | 165 | 6000/- | |
| 7 | 7 | 208 | 2500/- | |
| 8 | 8 | 129.35 | 2500/- | |

1. ధరవత్తు సొమ్ము షాప్ నెంబర్ 1,2,3,4,5,6,7,8 లకు రూ.1,00,000/- శ్రీయుత కమీషనర్ తూప్రాన్ పురపాలక సంఘం పేరు ఏదైనా జాతీయ బ్యాంకు లో తీసిన డిమాండ్ డ్రాఫ్టును నిర్ధారిత దరఖాస్తుతోపాటు జత చేసి పైన చూపిన దరఖాస్తు సమర్పణ తేదీలలో మున్సిపల్ కార్యాలయములో సమర్పించి రశీదు పొంది, బహిరంగ వేలం తేది మరియు సమయం పాల్గొనవలెను. 2. వేలము ధ్రువీకరణ పొందిన రోజు నుండి (7) దినములలో పాట పాడినటువంటి నెలసరి అద్దె (6) మాసములకు అడ్వాన్స్ రూపంలో కార్యాలయములో చెల్లించి రశీదు పొందవలేను. 3. షాపు కేటాయింపు పత్రము పొందిన తేది నుండి (30) రోజులలో లీజ్ డీడ్‌ను రిజిస్ట్రేషన్ శాఖ వారి ద్వారా విధిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవలెను మరియు కేటాయింపు పొందిన (7) రోజులలో లీజ్ డీడ్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన వేలములో నిర్ణయించబడిన నెలసరి అద్దె ప్రకారము (3) సం॥ అద్దె విలువ పై 1% రుసుము స్టాంప్ డ్యూటీ మరియు రిజిస్ట్రేషన్ నిమిత్తము పురపాలక సంఘ కార్యాలయంలో విధిగా చెల్లించవలెను. 4. వేలములో నిర్ధారించబడిన నెలసరి అద్దెను ప్రతి నెల విధిగా 5వ తారీఖు లోపు చెల్లించవలెను. నిర్ణీత గడువు నుండి 30 రోజుల లోపు అద్దె చెల్లించని యెడల లీజు రద్దు చేయబడును. 5. వేలంలో పాల్గొనవారు పురపాలక సంఘం నకు ఎలాంటి బాకాయి ఉండరాదు. 6. వేలములో సంతృప్తికరంగా లేని యెడల రద్దు పరచి తిరిగి వేలం వేయుటకు మరియు వేలమునకు వాయిదా వేయుటకు కమిషనర్ గారికి అధికారము కలదు. 7. అద్దె వేలము కౌన్సిల్ ఆమోదమునకు లోబడి ఉండును. 8. బహిరంగ వేలములో ఎక్కువ మొత్తము పాట పాడిన వారికి వేలం పాట హక్కు వర్తింప చేయబడును. 9. వేలములో షాపు పొందిన వారు ఎట్టి పరిస్థితులలో కూడా ఇతరులకు సబ్ లీజ్ / కిరాయికి ఇవ్వకూడదు. 10. అగ్రిమెంట్‌లోని నిబంధనలు అతిక్రమించినా యెడల ఏవిధమైన ముందస్తు నోటీసు లేకుండా లీజును రద్దు పరచి తిరిగి వేలము వేయు అధికారము కమీషనర్ గారికి ఉండును. 11. మిగితా వివరములు కార్యాలయము పని వేళల్లో తెలుసుకొనవచ్చును. 12. దరఖాస్తుల సమర్పించుటకు నిర్ణయించబడిన చివరి తేది:03/06/2026 సాయంత్రం 05:00 గంటల తరువాత వచ్చిన దరఖాస్తులు పరిగణించబడవు.

సం/- మునిసిపల్ కమిషనర్, తూప్రాన్ మునిసిపాలిటీ
DIPR.No.2869-PP/CL/Advt/1/2026-27, తేది: 22.05.2026



హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: 09, కమ్యూనిటీ సెంటర్, బసంత్ లోక్, వసంత్ విహార్, న్యూఢిల్లీ-110057
ఫోన్: 011 49267000, టోల్ ఫ్రీ నం: 1800 212 8800, ఇ-మెయిల్: customer.care@herohfl.com
వెబ్‌సైట్ : www.herohousingfinance.com | CIN: U65192DL2016PLC30148
సంప్రదించు చిరునామా: A-6, మూడవ అంతస్తు, సెక్టార్-4, నొయిడా-201301.

డిమాండ్ నోటీస్

సెక్యూరిటైజేషన్ మరియు రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002 ("చట్టం") సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు, 2002 ("నిబంధనలు") యొక్క నిబంధన 3తో చదువబడే దాని యొక్క 13(2) సెక్షన్ క్రింద

ఐది ఇలా ఉండగా హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (HHFL) యొక్క అధీకృత అధికారి అయినందున దిగువ సంతకందారు చట్టం క్రింద మరియు నిబంధనల యొక్క నిబంధన 3తో చదువబడే సెక్షన్ 13(12) క్రింద సంక్రమించబడిన అధికారాలను [illegible]

| రుణ ఖాతా నం. | అప్పుగార్(లు)/చట్టవారసుడు(లు) చట్టప్రతినిధి(లు) యొక్క పేరు | క్రింది తేది నాటికి మొత్తం బకాయి (రూ)* | డిమాండ్ నోటీస్ తేది / NPA తేది |
|---|---|---|---|
| HHFSHALAP24000049813, HHFSHALAP25000066233, HHFSHAIPL25000066235 | మహమ్మద్ ఫాహీమ్, ఫర్హీన్ బేగమ్, మహమ్మద్ అబ్దుల్ హమీద్ అమీనా బేగమ్ | రూ.3496148/- 15.05.2026 నాటికి | 19.05.2026 / 07.05.2026 |
| HHFSAGHOU 24000049939 | కటిక కృష్ణ ప్రసాద్, అంకార్ కవితాబాయి, గొడుగు చంద్రశేఖర్ | రూ.2419304/- 15.05.2026 నాటికి | 15-05-2026 / 07-05-2026 |

తేది: 23.05.2025, ప్రదేశం: వికారాబాద్, సంగారెడ్డి సం/- అధీకృత అధికారి, హీరో హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున



పంజాబ్ నేషనల్ బ్యాంకు punjab national bank ...the name you can BANK upon!
జోనల్ ఆఫీస్: 6-1-73, 2వ అంతస్తు, సయీద్ ప్లాజా, లక్డీ-కా-పూల్, హైదరాబాద్-500004.
ఫోన్: 040-24475118 ఈ-మెయిల్: zohydsec@pnb.co.in
దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో, హైదరాబాద్ జోనల్ ఆఫీస్ వద్ద దాని శాఖలు/కార్యాలయాల వద్ద AMC ద్వారా CCTV సిస్టమ్‌యొక్క నిర్వహణ, సరఫరా, స్థాపన, టెస్టింగ్ & కమిషనింగ్(SITC)కొరకు SIs యొక్క జాబితా కొరకు టెండర్. ... https://www.pnbindia.in నుండి టెండర్ డాక్యుమెంట్ లు డౌన్లోడ్ చేసుకోవచ్చును.
తేది: 23-05-2026 ప్రదేశం: హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్



గౌరవ తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి వారి సమక్షంలో
విద్యుత్ నియంత్రణ భవన్, జి.టి.ఎస్. కాలనీ, కళ్యాణ్ నగర్, హైదరాబాద్-500045.
దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ (TGSPDCL)
ప్రజా ప్రకటన
O.P. No. 15 of 2026
విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 18 నిబంధనల ప్రకారం మరియు TGERC Distribution Licence Regulation No.4 of 2016 ప్రకారం "దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ లిమిటెడ్ (TGSPDCL)" లైసెన్స్ సవరణకు సంబంధించిన పిటిషన్ విషయమై.

1. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సంస్కరణల చట్టం, 1998 లోని సెక్షన్ 15 ప్రకారం జారీ చేయబడిన లైసెన్స్ నం.13/2000 ఆధారంగా పంపిణీ మరియు రిటైల్ సరఫరా లైసెన్స్ కలిగిన TGSPDCL, కాలానుగుణంగా సవరించబడిన తన లైసెన్స్‌లో మార్పులు చేయుటకు, విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 18 మరియు TGERC Distribution Licence Regulation No.4 of 2016 ప్రకారం లైసెన్స్ సవరణ పిటిషన్‌ను దాఖలు చేసింది.
2. తెలంగాణ ప్రభుత్వం G.O. Ms. No. 4 తేది 11.03.2026 ద్వారా "తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (TGRPDCL)" ను రైతు డిస్కంగా ఏర్పాటు చేయుటకు ఆమోదం తెలిపింది. తదనుగుణంగా, G.O. Ms. No. 44, తేదీ 17.12.2025లో పేర్కొన్న వ్యవసాయం, Composite Protected Water Supply Scheme (CPWS)/ మిషన్ భగీరథ, హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా మరియు మురుగునీటి పారుదల మండలి (HMWSSB), Lift Irrigation Schemes (LIS), ప్రత్యేక DTRలతో ఉన్న మున్సిపల్ వాటర్ కనెక్షన్లు (LT VI-B) వంటి వినియోగదారుల వర్గాలకు విద్యుత్ పంపిణీ మరియు సరఫరా బాధ్యతలను TGRPDCL ప్రత్యేకంగా నిర్వహించును. ఈ వినియోగదారులను TGSPDCL నుండి TGRPDCL కు బదిలీ చేయబడును. మిగిలిన అన్ని వినియోగదారుల వర్గాలకు TGSPDCL యథావిధిగా సేవలు అందించును.
3. లైసెన్స్ సవరణకు సంబంధించిన దరఖాస్తు, అనుబంధ పత్రాలు మరియు ప్రస్తుత లైసెన్స్ TGSPDCL కార్పొరేట్ కార్యాలయం మరియు అన్ని సూపరింటెండింగ్ ఇంజనీర్/ఆపరేషన్ కార్యాలయాలలో పరిశీలనకు అందుబాటులో ఉంచబడినవి. కార్యాలయ సమయాల్లో వీటిని పరిశీలించవచ్చు. అవసరమైతే, ఫోటోకాపీ ఖర్చులను మించకుండా తగిన రుసుము చెల్లించి ప్రతులను పొందవచ్చు. పై పత్రాలు TGSPDCL వెబ్‌సైట్ www.tgsouthernpower.org మరియు TGERC వెబ్‌సైట్ www.tgerc.telangana.gov.inలో కూడా అందుబాటులో ఉంచబడినవి.
4. ప్రతిపాదిత సవరణలపై భాగస్వాములు, ఆసక్తి గల వ్యక్తులు మరియు సాధారణ ప్రజలు తమ అభిప్రాయాలు / అభ్యంతరాలు / సూచనలు సమర్పించవలసిందిగా కమిషన్ కోరుచున్నది. ఈ అభిప్రాయాలు / అభ్యంతరాలు / సూచనలు Regulation No.2 of 2015 (Conduct of Business Regulation)లో సూచించిన నమూనాలో సమర్పించవలెను. ఈ నియమావళి కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుంది.
5. అభిప్రాయాలు / అభ్యంతరాలు / సూచనలు 6 ప్రతులుగా సమర్పించి, ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి 30 రోజులలోపు కార్యదర్శి గారికి పంపవలెను.
6. విద్యుత్ చట్టం, 2003 లోని సెక్షన్ 18 ప్రకారం, అభిప్రాయాలు / సూచనలు / అభ్యంతరాలను స్వీకరించుటకు ఈ ప్రకటన జారీ చేయబడినది. వీటిని కార్యదర్శి, TGERC గారికి పై చిరునామాకు లిఖితపూర్వకంగా పంపవచ్చు లేదా secy-tgerc@telangana.gov.in కు ఇ-మెయిల్ ద్వారా పంపవచ్చు. అయితే, ఇ-మెయిల్ ద్వారా అభ్యంతరాలు పంపిన సందర్భంలో, ధృవీకరణ కొరకు 3 హార్డ్ కాపీలను పోస్టు ద్వారా పంపవలెను. అన్ని అభిప్రాయాలు / అభ్యంతరాలు / సూచనలు 22.06.2026 సాయంత్రం 5.00 గంటలలోపు కమిషన్‌కు సమర్పించబడవలెను. అదే ప్రతిని TGSPDCL కు కూడా పంపవలెను, తద్వారా స్పందన సమర్పించగలుగును.

స్థలం: హైదరాబాద్ సం/-
తేదీ: 23.05.2026 చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ TGSPDCL
DIPR RO No.2885-PP/CL/ADVT/2026-27, Dt:22.05.2026

వార్త


పనిలేని వ్యక్తి తప్పకుండా దిగులు చెందుతాడు. కనుక క్షణం తీరిక లేని పనిలో మునిగిపోవడం అలవాటు కాకపోతే ఆ వ్యక్తి నిరాశ అనే సుడిగుండంలో పడిపోతాడు.

- జి.బి. షా

# నిప్పుల కొలిమి!


దేశమంతటా ఇప్పుడు చండ్ర నిప్పులు కురుస్తున్నాయి. అధిక ఉష్ణోగ్రతల ధాటికి తట్టుకోలేని జనం ఇళ్లకే పరిమితమైపోయారు. ఇంతవరకు ఈ సీజన్‌లో దేశంలోనే అత్యధికంగా ఉత్తరప్రదేశ్‌లోని బాందాజిల్లాలో 48.2 డిగ్రీల సెల్సియస్‌ల గరిష్ట ఉష్ణోగ్రత నమోదు చేసుకోవడం విశేషం. గత ఐదు రోజులుగా ఇదే పరిస్థితి. దేశంలోని ఇది అత్యంత ఉష్ణోగ్రతగల ప్రాంతంగా గుర్తించారు. ఆ ప్రాంతంలో సాధారణ ఉష్ణోగ్రత కన్నా అధిక ఉష్ణోగ్రత నమోదైనట్లు లెక్క. ఎండ తీవ్రతలకు తాళలేక మూగజీవులు కూడా చెట్లనీడకు చేరిపోతున్నాయి. గత రెండు రోజుల్లో వడదెబ్బకు ఒక్క తెలంగాణలోనే 13 మంది మృతి చెందారు. అత్యధిక పగటి ఉష్ణోగ్రతలతో ఉక్కపోతకు గురై వృద్ధులు, పిల్లలు కడుపులో ఉడుకుతో బాధపడ్డారు. ఈనెల 22ననిర్మల్ జిల్లా దిలావర్‌పూర్‌లో తె.రాష్ట్రంలో 46.5 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశముంది. పలుచోట్ల చలివేంద్రాల ఏర్పాటు, వడదెబ్బ తగిలిన వారికి తక్షణ వైద్యసదుపాయం అందించే ఏర్పాట్లో ప్రభుత్వాలు కల్పించుకున్నాయి. గత యేడాది ఇదే సీజన్‌తో పోల్చిచూస్తే 4 డిగ్రీల కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోవడంతో వాతావరణంలో వేడిమి బాగా పెరిగిపోతోంది. దేశంలో కొన్ని ప్రాంతాలు 'వేడిమి'గా మారడానికి కారణం చెట్లను నరికి వేయడం, అక్రమ మైనింగ్. 1877 తర్వాత ఈ యేడాది అంతేస్థాయిలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగాఉందని వాతావరణ శాఖ వివరించింది. ఈ కారణం చేతనే ప్రపంచంలోని వేడిమి నగరాల జాబితాలో కనీసం 100 నగరాలున్నాయి. తెలుగు రాష్ట్రాలు అత్యధిక ఉష్ణోగ్రతలతో అల్లాడుతున్నాయి. ఇంతకు ముందు 45 డ్రీల సెలియస్ నుంచి 47 డిగ్రీల వరకు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలు నమోదైతే అదంతా మానవాళికి అనారోగ్యమేనని హెచ్చరికలున్నాయి. ఎండవేడిమి తట్టుకోలేనట్లుగా ఉంటుందని చర్మరోగాలు ఆవహిసానతయని, శరీరం లోపల ఊదర సంబంధ వ్యాధులకూ అవకాశముందని అప్రమత్తం చేశారు. కానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లోని పిడుగురాళ్లలో గరిష్టంగా 48.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. దేశంలోనే ఆంధ్రప్రదేశ్ లోని పల్నాడు ప్రాంతంలోని 'రెంట చింతల' లో యేటా అత్యధిక ఉష్ణోగ్రత నమోదౌతుందని మూడు, నాలుగు దశాబ్దాలుగా వాతావరణశాఖ అక్కడి రికార్డునే ప్రస్తావన తెస్తుంది.పాఠ్యాంశాల్లో కూడా రెంట చింతల,చిరపుంజి, అత్యధిక వర్షపాత ప్రాంతంగానూ పేర్కొంటున్నారు. అలాంటిది అదే రెంటచింతలకు మధ్య సుమారు 44 కిలో మీటర్ల లోపు దూరం ఉంటుంది. కాగా రెంట చింతల కన్నా పిడుగురాళ్లలో దేశంలోనే అత్యధికంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం ఆంధ్రప్రదేశ్ లోని కనిగిరి అంతకుమించి 48.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు చవి చూసింది. మామూలుగా మధ్యాహ్నానికే రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోతున్నాయి. వాతావరణ కేంద్రాల హెచ్చరికలను పాటించడంలో ఈసారి జనం కాస్త అప్ర మత్తంగా ఉన్నట్లే. వాతావరణ కేంద్రాల హెచ్చరికలకన్నా ఎక్కువస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సందర్భా లూ లేకపోలేదు. అంతకన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమో దవుతున్నాయి. తెలంగాణలో మంగళవారం నాడే జగి త్యాల జిల్లా కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 45.9డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతనమోదైంది. 'ఉత్తర తెలంగాణ జిల్లాలో వడగాల్పులు వీస్తున్నాయి. కొన్ని ప్రాంతాలలో గాలివాన బీభత్సంతో భారీ వృక్షాలు, పలు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అలా అని పూర్తి స్థాయి మిశ్రమ వాతావరణంలా చెప్పలేం. కొన్ని చోట్ల మాత్రమే అకాల వర్షాలు.కానీ నష్టం కన్పిస్తోంది. తెలంగాణ రాష్ట్రంలో పలుజిల్లాలకు ఎండలతీవ్రతను అప్రమత్తం చేస్తూ వాతావరణ శాఖ రెడ్‌అలర్ట్ జారీచేసింది. గురు,శుక్రవారాల్లో కొన్ని జిల్లాలో 45-47 డిగ్రీల ఉష్ణోగ్రతనమోదై ఉంటుందని హెచ్చరికలున్నాయి. అలాంటి ఉష్ణోగ్రత స్థాయి ఉన్నందునే ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రం లో జాతీయ రహదారిపై మంగళవారం మధ్యాహ్నం ఓ కారు ఎండవేడిమికి ఇంజిన్‌లో మండలు చెలరేగిదగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. అధిక ఉష్ణోగ్రత, ఎండ వేడిమిల కారణంగా వడగాల్పులుతో చనిపోయిన వారిలో అత్యధికులు వ్యవసాయ కూలీలు, పారిశుద్ధ్య కార్మికులే ఉన్నారు. అసంఘటిత కార్మికులు విధి నిర్వహణకు వెళ్లి వచ్చి నిస్త్రాణతో వాలిపోతున్నారు. కార్మికుల పరిస్థితి ఇదే. ఏమయితేనే ప్రస్తుత ఉష్ణోగ్రతలు తెలుగు రాష్ట్రాల్లో 48 డిగ్రీల కన్నా పైకి చేరాయి. ఈ యేడాది అసలే అత్యంత'వేడిమి' సంవత్సరంగా వాతావరణ శాఖముందే ప్రకటించింది.ప్రపంచ ఉష్ణోగ్రతలురెండు డిగ్రీల సెల్సియస్‌కు పెరిగితే ఎల్‌నినో స్థాయి నుంచి సూపర్‌ఎల్‌నినో స్థాయికి మారిపోయింది. జనంలో ఇదే పెద్ద గుబులు.బలూచిస్థాన్, రాజస్థాన్, ఎడారిమీదనుంచి వచ్చే వేడిగాలులు ఉత్తర,మధ్య భారత్‌లో వడగాడ్పులకు కారణమ వుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, రాజస్థాన్, పంజాబ్ తదితర రాష్ట్రాలకు 'హీట్ వేవ్' హెచ్చరికలున్నాయి.అయితే అత్యధిక ఉష్ణోగ్రతలు 50డిగ్రీల వరకు ఉండే అవకాశముండవచ్చుననే భయాందోళనలు కలుగుతున్నాయి. దాదాపు దేశమంతటా ఏదోఓరకమైన వాతావరణ హెచ్చరికలున్నాయి.ఎండలో బయటకు వచ్చే సమయంలో పలు జాగ్రత్తలు తప్పనిసరి మంగేష్‌పూర్ అనే ప్రాంతం గతయేడాది 50డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రతలను చూసింది. అందుచే ఎండతీవ్రత నుంచి ఎవరికివారే తమను తామే కాపాడుకోవాల్సిఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

గౌరవం అన్నది పదవులు, హోదాలు పొందడంలో లేదు. పదవులు హోదాలకు మనం అర్హులం అనే భావనలోనే గౌరవం ఉంటుంది. అదే అసలైన హోదా.



అరిస్టాటిల్

ప్రమాణము అంటే వెనుకంజ వేయని నిశ్చయబుద్ధి, దృఢమగు నిశ్చయం లేకపోతే అభివృద్ధికి అవకాశమే ఉండదు.



మహాత్మా గాంధీ

## ప్రజావాక్కు

### రైతులను ఆదుకోవాలి

**దేశంలో** రైతన్న పంట అమ్ముకోవాలని నా పంట కొనట్లేదు నేను నా కుటుంబాన్ని పోషించలేకపోతున్నాను నేను చనిపోవడానికి అవకాశం కల్పించండి అంటూ కలెక్టర్ గారికి వినతిపత్రాలు ఇచ్చేదాక వచ్చింది రైతుల పరిస్థితి. సాధారణ రైతు పంట అమ్మేదామని చెప్పి ప్రభుత్వ మార్కెట్ యార్డుకు వస్తే కాలయాపన పేరుతో ముప్పై రోజులైనాకొనకుండా ఏ రైతుఅయినా ఎలా బ్రతకగలడు?తన కుటుంబంలో పిల్లలు చదువులు, సాధారణ ఖర్చులు ఎలా ఎల్లదియ్యాలి. మార్కెట్ యార్డులో నియమించిన అధికారులు పనేంటి?. వాళ్ళు కేవలం హాజరు శాతం కొరకు ఉద్యోగం చేస్తున్నారా? లేదా సమస్యలు పరిష్కరించడానికి ఉద్యోగం చేస్తున్నారా? ఎక్కడా ఇలాంటి సమస్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటేనే రైతన్న జీవించగలడు.

- మోతె శివకుమార్, రంగారెడ్డి జిల్లా

### వీధికుక్కలను కేంద్రాలకు తరలించాలి

**తాజాగా** సుప్రీంకోర్టు ఆదేశించినట్లు సాధ్యమైన వరకు వీధి కుక్కలను షెల్టర్ కేంద్రాలకి తరలిస్తే వాటి సంతానోత్పత్తి కొంతైనా తగ్గుతుంది. ఒక్కో ఆడ కుక్క ఒకేసారి నాలుగైదు పిల్లలకు, సంవత్సరంలో 20 కుక్క పిల్లలకు జన్మనిస్తుందట. ఇలా పెరిగిన వీధి కుక్కలు గుంపులుగా రోడ్లపైకి వచ్చి దారిన పోయే పిల్లలు, పెద్దలపై దాడులు చేస్తుంటే ఏటా లక్షలాది మంది చనిపోటం తీవ్రంగా గాయపడటం తెలిసిందే. ఇక పల్లెల్లో ఆలనపాలన లేని పేద పసిపిల్లల్ని ఆకలి గొన్న వీధి కుక్కలు తోడేళ్ళ వలె పీక్కుతింటున్న ఘోర సంఘటనలూ ఉన్నాయి. ప్రజా ప్రతినిధులు, మంత్రులు మార్నింగ్ వాక్‌లకు రోడ్ల పైకి వస్తే వాటి దాడుల ప్రతాపం తెలుస్తుంది.

- తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

### గోపాల మిత్రల ఆగడాలు?

**పశుసంవర్ధక** శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న గోపాలమిత్ర సిబ్బంది గ్రామాలలో చాలా అవినీతి అక్రమాలు, గోల్ మాల్ పనులకు పాల్పడడం జరుగుతుంది. గ్రామాల లో మూగజీవాలు పశువుల సంఖ్య గతంలో కన్న చాలా తగ్గింది. పశు వైద్యం పేరుతో పేద ప్రజలు అమాయక ప్రజలను మోసంచేస్తున్నారు. కొందరిపై పోలీసు కేసులు కూడా నమోదు అయినాయి. తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు ఇట్టి గోపాలమిత్ర గోల్ మాల్ వ్యక్తులపై చర్య తీసుకోవాలి.

-కదురు శ్రీనివాస్, వరంగల్

### బంధాలు బలోపేతం

**భారత్-ఇటలీ** సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలపడుతున్నాయి. రోమ్‌లో భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ మధ్య జరిగిన సమావేశం ఇరుదేశాల బంధాలకు కొత్త దిశను చూపించింది. ఈ భేటీలో సంబంధాలను 'ప్రత్యేక వ్యూహాత్మక పార్టనర్‌షిప్' స్థాయికి పెంచుతున్నట్లు ప్రకటించడం విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య వాణిజ్య పరిమాణం వేగంగా పెరుగుతోంది.యంత్రాంగతయారీ, ఫార్మా, విద్యుత్ వాహనాలు, గ్రీన్‌ఎనర్జీ,అంతరిక్ష పరిశోధన, కృత్రిమ మేధస్సు వంటి రంగాల్లో పరస్పర సహకారం విస్తరించనుంది. ఇటలీకి ఉన్న సాంకేతిక నైపుణ్యం, భారతదేశానికి ఉన్న విస్తారమైన మార్కెట్ కలిసి ఇరు దేశాలకు ప్రయోజనకరంగా మారుతున్నాయి.భారత్-ఇటలీ జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029 ద్వారా పెట్టుబడులు, పరిశోధనలు, ఆవిష్కరణలకు కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### అటవీ భూముల ఆక్రమణ

**తిరుపతి** జిల్లా బీఎన్ కండ్రిక మండలం కల్లివెట్టు గ్రామ పరిధిలో అంజూర్ అటవీ భూమి సర్వేనంబర్ 295లో ఒక ట్రస్టు వారు 21 ఎకరాల అటవీ భూమి అక్రమించి ఆశ్రమం పేరుతో మోసంచేస్తున్నారు. అది రెవెన్యూ భూమి అని రెవెన్యూ వాళ్ళునాటకాలు ఆడుతున్నారు. అడవి మధ్యలో రెవెన్యూ వారికి ఎలా వచ్చిందో ఒరిజినల్ డాక్యుమెంట్స్ చూపమంటే ఎలుకలు తిన్నాయి అన్నట్లుగా వారి సమాధానంఉంది.దీనిమీదప్రభుత్వం చొరవ తీసుకొని ఆక్రమించిన అంజూర్ అటవీ భూమిని స్వాధీనం చేసువాలి. ప్రభుత్వ భూములు దొంగల పాలు కాకూడదు అన్న తపన.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### విశ్రాంతి అవసరం

**ఉపాధ్యాయులు** సమాజ నిర్మాణానికి ప్రధాన స్తంభాలు.వారి ప్రధాన బాధ్యత విద్యాబోధనే. సంవత్సరం మొత్తం విద్యార్థుల అభివృద్ధి కోసం శ్రమించే వారికి వేసవి సెలవుల్లో తగిన విశ్రాంతి అవసరం.అదనపు పనులతో వారిపై ఒత్తిడి పెంచకుండా, వారి ఆరోగ్యం, మానసిక ప్రశాంతతను కూడా పరిగణలోకి తీసుకోవాలి. అత్యవసర పనులు ఉన్నపుడు పరిమిత స్థాయిలో, సమయానుకూలంగా అప్పగించడం మంచిది.ఆరోగ్యంగా,ఉత్సాహంగా ఉన్న ఉపాధ్యాయులే విద్యార్థులకు మరింత మంచి భవిష్యత్తును అందించగలరు.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

# వ్యాపారంగా మారుతున్న భిక్షాటన!

**విధివంచనకు గురై అంగవికలురై మరే పని చేయలేక, పొట్టగడవక, నా అనేవారు లేక, మరో గత్యంతరం లేక భిక్షాటనవైపు మొగ్గుచూపుతున్న వారి పరిస్థితి సానుభూతితో అర్థం చేసుకోవచ్చు. వారికి అంతో ఇంతో సహాయం చేయవచ్చు. అలాంటి వారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటి మానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి, ధర్మం. కానీ దాన్ని ఆసరాగా చేసుకొని కాళ్లు, చేతులు అన్ని సక్రమంగా ఉండి, పనిచేసే శక్తి ఉండి భిక్షాటన చేయడం ఎంతవరకు సమంజసం? చివరకు దీన్ని వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో ఊహించుకోవచ్చు. కొన్ని నగరాల్లో ప్రాంతాల వారీగా అడుక్కుతినే ప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రదేశాల్లో తాము తప్ప మరొకరు అడుక్కోకూడదని నిబంధనలు విధిస్తున్నారు.**

దామెర్ల సాయిబాబ

ఆశ అత్యాశగా మారి దురాశగా రూపాంతరం చెందితే పరిస్థితులు దారుణంగా ఉంటాయి. అడ్డదారులకు అదుపుఆజ్ఞా ఉండదు. భిక్షాటన కూడా అలా రూపాంతరం చెందుతుందేమోననిపిస్తున్నది. ఇంటి యజమానులు లేని సమయంలో వారి పిల్లలను తీసుకువెళ్లి వారిని చూపి భిక్షాటన చేస్తున్న సంఘటనలు పలువురిని కలచివేస్తున్నాయి. మొన్నామధ్య భార్యాభర్తలు ఇద్దరు ఉద్యోగాలకు పోవడంతో వారి యేడాదిన్నర వయసున్న బాబును ఇంటి పని మనిషికి అప్పగించి కార్యాలయానికి వెళ్లితే ఆ పనిమనిషి బాబును తీసుకువెళ్లి గుడి ముందు పడుగోబెట్టి భిక్షాటన చేసిన సంఘటన అప్పట్లోనే చర్చనీయాంశమైంది. ఆ పని మనిషిని గుర్తించిన ఆ పసికందు తండ్రి స్నేహితుడు ఫోన్ చేయడంతో మొత్తం సంఘటన వెలుగులోకి వచ్చింది. ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. పోలీసులు చర్యలు తీసుకుంటున్నా ఇవి ఏమాత్రం ఆగడంలేదు. అన్నెంపున్నెం ఎరుగని పిల్లలతో భిక్షాటన చేయించడం నగరాలతోసహా అనేక పుణ్యక్షేత్రాలలో విపరీతంగా పెరిగిపోతున్నది. ఈ భిక్షాటన కోసం ఏకంగా పసిపిల్లలను కిడ్నాప్ చేస్తున్న సంఘటనలు కూడా చోటుచేసుకుంటున్నాయి. భిక్షాటనకు మించి లాభసాటిగా ఉండే వ్యాపారం మరొకటి లేదనే చెప్పొచ్చు. పెట్టుబడి ఉండదు, నష్టాలు వచ్చే అవకాశం లేదు, సర్వకాల సర్వావస్థలయందు వృత్తి ఆగే పరిస్థితి రాదు. అందుకే ఈ వృత్తిలోకి దిగినవారు ఎవరైనా దీన్ని వదిలి రావడానికి ఏమాత్రం అంగీకరించరు. కాకపోతే ప్రారంభించేటప్పుడు కొంత ఇబ్బందిగా ఉంటుంది. ముఖ్యంగా ఆత్మాభిమానం, ఆత్మగౌరవం వంటి పదాలకు చోటు ఇవ్వకుండా వాటిని పట్టించుకోకపోతే ఇంతకుమించిన లాభసాటి వృత్తి మరొకటి లేదనేది నిర్వివాదం. విధివంచనకు గురై అంగవికలురై మరే పని చేయలేక పొట్టగడవక, నా అనేవారు లేక, మరో గత్యంతరం లేక భిక్షాటనవైపు మొగ్గుచూపుతున్న వారి పరిస్థితి సానుభూతితో అర్థం చేసుకోవచ్చు. వారికి అంతో ఇంతో సహాయం చేయవచ్చు. అలాంటి వారికి చేయూతనివ్వాల్సిందే. అందులో మరో అభిప్రాయానికి తావులేదు. సాటి మానవులుగా చేతనైనంత సహాయం చేయడం మన విధి, ధర్మం. కానీ దాన్ని ఆసరాగా చేసుకొని కాళ్లు, చేతులు అన్ని సక్రమంగా ఉండి, పనిచేసే శక్తి ఉండి భిక్షాటన చేయడం ఎంతవరకు సమంజసం? చివరకు దీన్ని వ్యాపారంగా మార్చేశారు. చిన్న పిల్లలను సైతం ఈ వృత్తిలోకి దించి వారితో వ్యాపారం చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయికి వెళ్లిందో ఊహించుకోవచ్చు. కొన్ని నగరాల్లో ప్రాంతాల వారీగా అడుక్కుతినే ప్రదేశాలను పంచుకుంటున్నారు. ఆయా ప్రదేశాల్లో తాము తప్ప మరొకరు అడుక్కోకూడదని నిబంధనలు విధిస్తున్నారు. ప్రధానంగా నగరాల్లోని చౌరస్తాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముందు, వెనుక చూడకుండా వాహనాలకు అడ్డుపడుతున్నారు.అన్నిటికంటే ముఖ్యంగా వీరివెనుక కొన్నిముఠాలు పనిచేస్తున్నాయనే వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. తీవ్ర కరవుతో అన్నానికి జరక్క అల్లాడుతున్న రాష్ట్రాల్లోని దుర్భిక్ష ప్రాంతాలకు ఈ ముఠాలు వెళ్లి పదేళ్లలోపు పిల్లలను తీసుకువస్తున్నారు.వారి తల్లిదండ్రులకు అంతో ఇంతో ముట్టచెప్పి మూడు నాలుగు నెలల కాంట్రాక్టుగా ఈ వృత్తిలోకి దించుతున్నారు. వారికి చింపిరి బట్టలు తొడిగి ఉదయాన్నే వ్యాన్‌లో ఎక్కించుకొని అడుక్కుతినే కూడళ్ల వద్దకు తీసుకువెళ్లి దింపుతారు. తిరిగి సాయంత్రానికి వారి బసకు తీసుకువెళ్లడం ఆ ముఠాల నిత్యకృత్యంగా ఉంటున్న ట్లు సమాచారం. వాస్తవంగా యాచకుల సమస్య ప్రపంచ వ్యాప్తంగా కూడా ఉంది.జర్మనీ, పోలాండ్‌లో 19వ శతాబ్దం లోనే భిక్షాటనను నిషేధిస్తూ చట్టాలు చేశారు. పాటించక పోతే ఐదేళ్ల శిక్ష విధించేలా 1927లోనే చట్టాన్ని సవరిం చారు. ఆ చట్టం మేరకు పోలాండ్ రాజధాని వార్సాలో 1933-39 మధ్య కాలంలో దాదాపు ఆరువేల మందిని శిక్షించారు. అలాగే ఎన్నో దేశాలు ఈ యాచక వృత్తిని నియంత్రించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నాయి.కానీ భారత్‌లాంటి దేశంలో చట్టాలు చేస్తున్నారు కానీ అమలు చేయలేకపోతున్నారు. భిక్షాటనను చట్ట విరుద్ధంగా ప్రకటిస్తూ భారత్‌లో 1959లో చేసిన చట్టం ప్రకారం మూడేళ్లవరకు శిక్ష విధించవచ్చు. భారతశిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల ప్రకారం బాలలను అపహరించి తీసుకవెళ్లి భిక్షాటన చేయించి సంపాదించడాన్ని శిక్షార్హనేరంగా ప్రకటించారు. బాధిత బాలల సంక్షేమానికి విడిగా మండళ్ల స్థాపిం చేలా 1960లో కేంద్రం మరో చట్టం తీసుకువచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1977లో భిక్షాటన నిరోధక చట్టాన్ని(ఏపి యాక్ట్‌నెం.12/77) రూపొందించారు. ఆ తర్వాత దాన్ని పట్టించుకోలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్రస్థాయి కమిటీని ఏర్పాటు చేసి ప్రతి ఆరుమాసాలకు ఒకసారి అమలు తీరును సమీక్షించాలని నిర్ణయించారు. ఆ కమిటీలో హోంశాఖ, సాంఘిక సంక్షేమ, పంచాయతీరాజ్,వైద్యఆరోగ్య శాఖలు, ప్రిన్సిపల్ సెక్రెటరీలు, ఆర్థిక శాఖ కార్యదర్శి తదితరులు సభ్యులుగా ఉంటారు. అలాగే ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా స్థాయి సలహా సంఘాన్ని ఆర్‌డివో ఛైర్మన్‌గా రెవెన్యూ డివిజన్ స్థాయిలో స్థానిక అడ్వైజయిరీ కమిటీలను ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులను కూడా భాగస్వాములను చేశారు. ఇవన్నీ కాగితాలకే పరిమితమైపోయాయి. ఫలితంగా యేడాది యేడాదికి యాచక వృత్తి విస్తరించిపోతున్నది. భారత్‌లో 2011 జనాభా లెక్కల ప్రకారం నాలుగు లక్షల మందికిపైగా యాచకులు ఉన్నారు. వారిలో పురుషులు రెండు లక్షల ఇరవైవేలు కాగా, మహిళలు మరో లక్షా ఎనభైవేల మంది ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో అత్యధికంగా ఎనభై వేలమంది ఉండగా, ఉత్తర ప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లు తర్వాత స్థానాల్లో నిలుస్తున్నాయి. యాచకుల పునరావాసానికి, సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం 'స్మైల్' పేరిట ఒక పథకాన్ని ప్రవేశపెట్టినా ఆశించిన ఫలితాలు ఇవ్వలేకపోతున్నది.ఇవి కేవలం అధికార లెక్కలే. అనధికారికంగా అప్పట్లోనే అంతకు నాలుగైదు రెట్లు ఎక్కువ ఉండొచ్చని అభిప్రాయాలున్నాయి. ఇప్పుడు గడచిన ఒకటిన్నర దశాబ్దంలో భిక్షాటన చేసేవారి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. దేశవ్యాప్తంగా కోటి దాటి ఉండొచ్చనేది అనధికార అంచనా. ఈ వృత్తిద్వారా లక్షలాది రూపాయలు సంపాదించేవారు కూడా ఉన్నారు. నెలకు ఇరవై,ముప్పైవేల రూపాయల అద్దెలు వచ్చే భవనాలు ఉన్న భిక్షగాళ్లు ఉన్నారు.యాచనకు అలవాటుపడిన ప్రాణం మరో పనిచేయడానికి ఇష్టపడదు. మంచి, మంచి కుటుంబాల్లోని వారు సైతం ఆదరణ కరవై కుటుంబ సభ్యుల మీద ఆగ్ర హంతో, ఇల్లు వదిలి వచ్చి బతుకు దుర్భరమై ఇంటికి తిరిగి వెళ్లలేక యాచనకు అలవాటుపడి ఆ తర్వాత వదిలిపెట్టలేక పోతున్నారు. హైదరాబాద్‌ను యాచకరహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ఎన్నోసార్లు గట్టి ప్రయత్నమే జరిగింది. కానీ యాచకరహిత నగరంగా తీర్చిదిద్దే మాట దేవుడెరుగు. యేడాదియేడాదికి యాచకుల సంఖ్య పెరిగిపోతున్నది. ఇప్పటికైనా పాలకులు ఆలోచించాలి. పొరుగు రాష్ట్రాల్లో చట్టాలు అమలు చేస్తుండడం వల్ల పెద్దఎత్తున యాచకులు తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్నారు. పిల్లలతో ఈ భిక్షాటన వ్యాపారం చేస్తున్నారు. ఆ పిల్లలను బలవంతంగా అంగవికలురుగా మారుస్తున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అవసరం అనుకుంటే చట్టాన్ని మరింత పటిష్టం చేసేందుకు శ్రీకారం చుట్టారు. అలాగే మరోదారి లేక యాచకులైన వారి సంక్షేమాన్ని కూడా పాలకులు పట్టించుకోవాల్సిన అవసరం ఉంది. ●

## ఒక్క మాట

# జననాలు సరే! భవితకు భరోసా ఏదీ?

నల్ల రవికుమార్

ఒకప్పుడు 'జనాభా నియంత్రణ' నినాదంగా వినిపించిన భారత గడ్డపై, నేడు 'జనాభా సమతుల్యత' ఒక అత్యవసర చర్చగా మారింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో జనన రేటు గణనీయంగా పడిపోతుండటం, భవిష్యత్తులో రాష్ట్రం 'వృద్ధుల ఆశ్రమంగా' మారుతుందన్న ఆందోళన కలగడం సహజం. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జనాభా పెరుగుదలపై చేస్తున్న ప్రకటనలు, మూడవ సంతానానికి నగదు ప్రోత్సాహకాలు అందించాలన్న ప్రభుత్వ నిర్ణయం ఒక దీర్ఘకాలిక విజన్‌ను ప్రతిబింబిస్తున్నాయి. అయితే, కేవలం నగదు ప్రోత్సాహకాలు లేదా ప్రచారం ద్వారా జనాభా గ్రాఫ్‌ను మార్చడం సాధ్యమా? ఆధునిక యువ దంపతులు కేవలం ఆర్థిక ప్రయోజనాల కోసం పిల్లల సంఖ్యను పెంచుకుంటారా? ఈ ప్రశ్నలకు సమాధానం సామాజిక భద్రత మౌలిక సదుపాయాల కల్పనలోనే ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో 'టోటల్ ఫెర్టిలిటీ రేటు'1.5 కి పడిపోయింది. జనాభా స్థిరంగా ఉండాలంటే ఇది 2.1 ఉండాలి. మరోవైపు, ఉత్తర భారత రాష్ట్రాలైన బీహార్ (3.0), ఉత్తర ప్రదేశ్ (2.7) వంటి చోట్ల జనాభా ఇంకా పెరుగుతూనే ఉంది. దక్షిణాది రాష్ట్రాలు విద్య, వైద్య రంగాల్లో సాధించిన పురోగతి వల్ల ఇక్కడ జనన రేటు తగ్గినప్పటికీ, ఇది ఒక వింతపరిస్థితికి దారితీస్తోంది.దేశవ్యాప్త సగటువయస్సు 28ఏళ్లు ఉంటే, ఏపీలో అది 32.5ఏళ్లుగా ఉంది. అంటే మనం దేశం కంటే వేగంగా వృద్ధాప్యం వైపు వెళ్తున్నాం. 2047 నాటికి ఏపీలో ప్రతి నలుగురిలో ఒకరు వృద్ధులే ఉంటారని అంచనా. ఇదే పరిస్థితి గతంలో దక్షిణకొరియా, జపాన్ వంటి దేశాల్లో సంభవించింది. దక్షిణ కొరియాలో జనన రేటు 0.7కి పడిపోవడంతో అక్కడ శ్రామిక శక్తి లేక ఆర్థిక వ్యవస్థ కుదేలైంది. జపాన్లో వేల సంఖ్యలో పాఠశాలలు మూతపడ్డాయి. ఆ దేశాలు ఇప్పుడు లక్షల కోట్లు కుమ్మరించినా ప్రజలు పిల్లల్ని కనడానికి ముందుకు రావడం లేదు.ఆదుస్థితి మనకు రాకూడదన్న ప్రభుత్వ ముందుచూపు ప్రశంసనీయం. కానీ, ఈ లక్ష్యాన్ని చేరుకోవడానికి నగదు కంటే నాణ్యమైన జీవన ప్రమాణాలు ముఖ్యం. నేటి ఉద్యోగినులు ఒకే బిడ్డతో సరిపెట్టుకోవడానికి ప్రధాన కారణం కార్యాలయాల్లో లభించని సహకారం. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగినుల తరహాలో రాష్ట్రంలోనూ రెండు సంవత్సరాల శిశు సంరక్షణా సెలవు సౌకర్యాన్ని ఉదారంగా అమలు చేయాలి. సెలవు మంజూరు చేసేటప్పుడు 'పనికి అంతరాయం కలగకూడదు' అనే అసంబద్ధ నిబంధనను తొలగించి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం అధికారుల బాధ్యతగా మార్చాలి. పని ప్రదేశాల్లోనే అత్యాధునిక క్రెష్ (శిశు సంరక్షణా కేంద్రాలు) అందుబాటులో ఉంటే తల్లులు నిశ్చింతగా విధుల్లో చేరగలరు.వైద్య రంగంలో కూడా సమూల మార్పులురావాలి. ప్రైవేటు ఆసుపత్రులలో పెరుగుతున్న సిజేరియన్ల సంఖ్య మహిళల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. సహజ ప్రసవాలను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వ ప్రసూతి కేంద్రాలను మెరుగుపరచాలి. ఒకవేళ అత్యవసర స్థితిలో ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లినా, ఆ ఖర్చును ప్రభుత్వం భరించేలా రీయింబర్స్మెంట్ సౌకర్యం కల్పించాలి. అలాగే, కిశోర బాలికలకు చిన్నతనం నుండే బలవర్ధకమైన పోషకాహారం అందిస్తేనే భవిష్యత్తులో వారి ఫెర్టిలిటీ రేటు బాగుంటుంది. సహజ వనరులను కాపాడుకోవాలన్నా, పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలన్నా పని చేసే యువత ఉండాలి. ఆ యువత ఆరోగ్యంగా, విద్యావంతులుగా ఎదగాలంటే ప్రభుత్వ పెట్టుబడి కేవలం నగదు రూపంలో కాకుండా నాణ్యమైన విద్య, వైద్యం ఉద్యోగ భద్రత రూపంలో ఉండాలి. అప్పుడే యువ దంపతులు ధైర్యంగా రేపటి తరం వైపు అడుగులు వేస్తారు. ప్రభుత్వం తన విజన్‌కు ఈ భరోసాను కూడా తోడు చేస్తేనే 'స్వర్ణాంధ్రఖి స్వప్నం' సాకారమవుతుంది. ●

# జంతువులే కాదు, మనుషుల ప్రాణాలూ ముఖ్యమే

డి జె మోహన రావు

దేశంలో వీధి కుక్కల దాడులు ఆందోళనకరంగా పెరుగుతున్నాయి. 2026వ సంవత్సరంలో ఉదయ్‌పూర్‌లో దాదాపు 1,750 కుక్కకాటు కేసులు, ఇదే ఏడాది మొదటి నాలుగు నెలల్లోనే తమిళనాడులో సుమారు 2 లక్షల 63 వేల కేసులు నమోదు కాగా ఇందులో 17 మంది ప్రాణాలు కోల్పోయారు. అలాగే భిల్వారాలో ఒక్క రోజులోనే 42 మంది కుక్కకాటుకు గురయ్యారు. వ్యాక్సిన్ వేయించుకోవడంలో ఆలస్యం చేయడం లేదా పూర్తి చికిత్స తీసుకోకపోవడం వల్ల పిల్లలు రేబిస్ బారిన పడి మరణించిన ఘటనలు మహారాష్ట్రలో థానేతో సహా, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి రాష్ట్రాల్లో పలు సందర్భాల్లో చోటుచేసుకున్నాయి. అదేవిధంగా, కర్ణాటకలోని విజయపురలో 2026లో వీధి కుక్కల గుంపు ఒక చిన్న బాలుడిపై దాడిచేసిన ఘటన సీసీటీవీలో నమోదై దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకుదారితీసింది. ఈ సంఘటనలు వేర్వేరు ప్రాంతాల్లో జరిగినప్పటికీ వీటన్నింటి ద్వారా ఒకే సామాజిక వాస్తవం స్పష్టమవుతుంది. కొన్ని సందర్భాల్లో జరిగే గుంపు దాడులు తీవ్రమైన గాయాలకు దారితీస్తున్నాయి. కుక్కకాటు తర్వాత తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోకపోతే రేబిస్ ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉందని ఈ గణాంకాలు స్పష్టంగా తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 19వ తేదీన సుప్రీంకోర్టు వీధి కుక్కల సమస్యపై ఇచ్చిన ఆదేశాలు విశేష ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. దేశంలో వీధి కుక్కల జనాభాను నియంత్రించడానికి దాదాపు ఇరవై ఏళ్ల క్రితమే నిబంధనలు ఉన్నప్పటికీ, రాష్ట్రాలు వాటిని సమర్థంగా అమలు చేయలేదని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి. అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం జంతు సంక్షేమం కంటే మనుషుల ప్రాణాలకే ప్రథమ ప్రాధాన్యమని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం భయం లేకుండా వీధుల్లో తిరిగే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని తేల్చిచెప్పింది. ఈ తీర్పు ప్రకారం పాఠశాలలు, ఆసుపత్రులు, రైల్వే స్టేషన్లు వంటి అత్యంత రద్దీ ప్రాంతాల నుండి వీధి కుక్కలను పూర్తిగా తొలగించాల్సి ఉంటుంది. అలాగే సంతానోత్పత్తి నియంత్రణ శస్త్రచికిత్స అనంతరం వాటిని తిరిగి అదే ప్రాంగణాల్లో వదిలిపెట్టరాదని కోర్టు స్పష్టంగా ఆదేశించింది. ఇంకా పిచ్చిపట్టిన, తీవ్ర దూకుడుతో ముప్పుగా మారిన కుక్కలకు పశువైద్యుల ధృవీకరణతో కారుణ్య మరణం అనుమతించవచ్చని పేర్కొంది. ప్రతి జిల్లాలో ఆధునికజంతు జనన నియంత్రణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కూడా ఆదేశించింది. ఈ ఆదేశాలను అమలు చేసే అధికారులకు క్రిమినల్ కేసుల నుండి రక్షణ కల్పించబడుతుందని, అయితే విధుల్లో నిర్లక్ష్యం జరిగితే కోర్టు ధిక్కార చర్యలు తప్పవని హెచ్చరించింది. వీధి కుక్కల సంఖ్య ఇలా అదుపు తప్పడానికి అనేక సామాజిక, పరిపాలనా, పర్యావరణ కారణాలు ఉన్నాయి. వీటి సహజ



సంతానోత్పత్తి శక్తి చాలా ఎక్కువ కారణంగా జంతు జనన నియంత్రణ చర్యలు విస్తృతంగా, నిరంతరంగా జరగకపోతే వాటి సంఖ్య కొద్ది సంవత్సరాల్లోనే వేగంగా పెరుగుతుంది. అదే సమయంలో నగరాలు, పట్టణాల్లో చెత్త నిర్వహణ లోపాలు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. వీధుల్లో పేరుకుపోయే ఆహార వ్యర్థాలు కుక్కలకు సులభమైనఆహార వనరుగా మారి, అవి అదే ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరచుకునేలా చేస్తాయి. కొన్ని సందర్భాల్లో యజమానులు తమ పెంపుడు కుక్కలను రోడ్లపై వదిలేయడం కూడా ఈ సమస్యను పెంచుతోంది. ఇవి క్రమంగా వీధి జీవనానికి అలవాటు పడి అక్కడి జనాభాలో కలిసిపోతున్నాయి. జంతు జనన నియంత్రణ, రేబిస్ వ్యాక్సినేషన్, షెల్టర్ వ్యవస్థలు అన్ని ప్రాంతాల్లో సమానంగా అమలు కాకపోవడం వల్ల కొన్ని ప్రాంతాల్లో శునకాల సంఖ్య వేగంగా పెరుగుతోంది. నగర విస్తరణతో సహజ నివాసాలు తగ్గిపోతుండగా, ఆ ఖాళీని వీధి కుక్కలు ఆక్రమించుకుంటూ మానవ నివాసాలకు మరింత చేరువవుతున్నాయి. దేశంలో ప్రతి ఏడాది సుమారు 1.7 కోట్ల నుంచి 2 కోట్ల వరకు కుక్కకాటు ఘటనలు నమోదవుతున్నాయని వివిధ ప్రజారోగ్య గణాంకాలు తెలుపుతున్నాయి. ఇందులో అగ్ర భాగం వీధి కుక్కలదే. ఈ సమస్య ప్రజల దైనందిన భద్రతా భావాన్ని నేరుగా ప్రభావితం చేస్తోంది. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, ఉదయం నడకకు వెళ్లేవారు, రాత్రి వేళల్లో తిరిగివచ్చేవారు ఎక్కువగా ఆందోళనకు గురవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో కుక్కలు గుంపులుగా తిరగడం వల్ల రోడ్డుపై నడవడమే భయానక అనుభవంగా మారుతోంది.ఇక్కడ అత్యంత కీలక అంశం కుక్క కాట్లు మాత్రమే కాదు. వాటి తరువాత వచ్చే ఆరోగ్య ప్రమాదాలు కూడా. చిన్న గాయం అయినా సరే సమయానికి సరైన వైద్యం తీసుకోకపోతే ప్రాణాంతక రేబిస్‌సోకి మరణం సంభవించవచ్చు.అందువల్ల ఇది తక్షణ సమస్యగా కాకుండా దీర్ఘకాలిక ప్రజారోగ్య సంక్షోభంగా మారుతోంది. అదే సమయంలో, వీధి కుక్కల ఉనికి ప్రజల్లో మానసిక ఒత్తిడిని కూడా పెంచుతోంది. పిల్లల్లో బయటకు వెళ్లాలన్న భయం, వృద్ధుల్లో ఒంటరిగా నడవడానికి సంకోచం వంటి పరిస్థితులు కనిపిస్తున్నాయి.ఇది వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేయడమే కాకుండా జీవన నాణ్యతను తగ్గిస్తోంది. అకస్మాత్తుగా రోడ్లపైకి వచ్చే కుక్కల కారణంగా వాహనదారులు నియంత్రణ కోల్పోయి హఠాత్తుగా బ్రేక్ వేయడం వలన చిన్న ప్రమాదాల నుంచి తీవ్రమైన ప్రమాదాల వరకు చోటుచేసుకుంటున్నాయి. చెత్త కుప్పల చుట్టూ కుక్కలు గుంపులుగా చేరి పరిసరాలను నాశనం చేస్తున్నాయి. ఇది ఇతర అంటువ్యాధుల వ్యాప్తికి కారణం అవుతున్నాయి. మొత్తం మీద వీధి కుక్కల సమస్య ఒకే కోణంలో చూడదగినది కాదు. ఇది భద్రత, ఆరోగ్యం, మానసిక స్థితి, నగర నిర్వహణపై ప్రభావం చూపే బహుముఖ సామాజిక సమస్యగా రూపుదిద్దుకుంది. ఈ సమస్యను ఏకైక చర్యతో పరిష్కరించడం సాధ్యం కాదు. ప్రజాఆరోగ్యం, నగర నిర్వహణ, జంతు సంక్షేమం అనే మూడు వ్యవస్థల సమన్వయంతో మాత్రమే వీటిని నియంత్రించగల బహుముఖ సవాలు. దీనికి పరిష్కారంగా సమగ్ర స్టెరిలైజేషన్ కార్యక్రమాలు నిరంతర ప్రక్రియగా కొనసాగాలి. రేబిస్ వ్యాక్సినేషన్ ద్వారా వీధి కుక్కలలో వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చు. అలాగే చెత్త నిర్వహణను క్రమబద్ధీకరించడం ద్వారా ఆహార వ్యర్థాలు తగ్గించి కుక్కల గుంపుల ఏర్పాటును నియంత్రించవచ్చు.పాఠశాలలు,ఆసుపత్రులు, రైల్వేస్టేషన్లు వంటిసున్నిత ప్రాంతాల్లో ఫెన్సింగ్ వంటి భద్రతా చర్యలు అవసరం. ●

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# నిమ్స్‌లో 2000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సల ఘనత



నిమ్స్‌లో 2000 కిడ్నీ మార్పిడి చేసిన శస్త్రచికిత్సల వైద్య బృందంలో నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప, యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవరాజ్‌లు

## 1989 నుంచి నేటి దాకా క్లిష్ట ఆపరేషన్లు విజయవంతం

**హైదరాబాద్, మే 22 ప్రభాతవార్త :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) యూరాలజీ విభాగం 2000 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు పూర్తి చేసి ఒక విశిష్ట మైలురాయిని చేరుకుంది. దేశంలోనే అత్యధిక కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఆసుపత్రులలో నిమ్స్ నిలిచింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న వైద్య నైపుణ్యం, అంకితభావం, మరియు చివరి దశ మూత్రపిండ వ్యాధులతో బాధపడుతున్న వేలాది మంది రోగులకు ఆశాకిరణంగా నిలిచిన సేవలకు ఇది నిదర్శనం. 1989లో మొదటి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సతో ప్రారంభమైన ఈ ప్రయాణం, నేడు వేలాది మూత్రపిండ వ్యాధిగ్రస్తులకు ఆశాకిరణంగా మారింది. 1989-2010 మధ్య 448, 2011-2017 మధ్య 552, 2017-2023 మధ్య 500, గత 3 సంవత్సరాల 4 నెలల్లో మరో 500 కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. నిమ్స్ యూరాలజీ బృందం బహుళ రక్తనాళాలున్న కిడ్నీ మార్పిడి, చిన్నారుల కిడ్నీ మార్పిడి, మళ్లీ కిడ్నీ మార్పిడి వంటి క్లిష్ట శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసింది. 2025లో దక్షి ణ భారత ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలి రోబోటిక్ కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సను కూడా నిమ్స్ విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం నిమ్స్ యూరాలజీ విభాగం ప్రతి సంవత్సరం సుమారు 11,000 యూరాలజీ శస్త్రచికిత్సలు నిర్వహిస్తుండగా, గత మూడు సంవత్సరాల్లో 500కిపైగా రోబోటిక్ శస్త్రచికిత్సలు చేశారు. జీవ దాతల ద్వారా జరిగిన కిడ్నీ మార్పిడిలో గ్రాఫ్ట్ సర్వైవల్ రేటు ఒక సంవత్సరం తరువాత 95 , మూడు సంవత్సరాల తరువాత 90 , ఐదు సంవత్సరాల తరువాత 85గా నమోదైంది. మరణించిన దాతల ద్వారా జరిగిన మార్పిడిలో ఒక సంవత్సరం తరువాత 90 , మూడు సంవత్సరాల తరువాత 85 , ఐదు సంవత్సరాల తరువాత 80 సర్వైవల్ రేటు నమోదైంది. ఈ కార్యక్రమానికి నిమ్స్ యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవరాజ్ నాయకత్వం వహించారు. ఆయనకు సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ చి. రాంరెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ రామచంద్రయ్య, డాక్టర్ జి.వి. చరణ్ కుమార్, డాక్టర్ రఘువీర్, డాక్టర్ ఎస్.ఎస్.ధీరజ్, డాక్టర్ విజయ్, డాక్టర్ ఐతగోని రాకేష్ కుమార్, డాక్టర్ జి. అభిషేక్, డాక్టర్ అనుపమ, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ వేద ప్రకాశ్, డాక్టర్ నిశాంత్, డాక్టర్ టాగ్రే, డాక్టర్ సుజన్ బాబు, డాక్టర్ వెంకట సాయి సుదీప్త్, డాక్టర్ సంజయ్, డాక్టర్ రోహిత్ మరియు డాక్టర్ సోమేష్ సమిష్టిగా సహకారం అందించారు. అలాగే అనస్థీషియా, నెఫ్రాలజీ, రేడియాలజీ, పాథాలజీ, క్లినికల్ ఫార్మకాలజీ విభాగాలు మరియు నర్సింగ్ సిబ్బంది అందించిన సేవలు ఈ విజయానికి ఎంతో దోహదపడ్డాయి. నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప మాట్లాడుతూ 2000 మంది రోగుల్లో 1900 మందికి ఆరోగ్యశ్రీ మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాల ద్వారా పూర్తిగా ఉచితంగా కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ విజయానికి కీలక పాత్ర పోషించిన యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ రాహుల్ దేవరాజ్, ఆయన వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

# డీఎంకె వైపు బిజెపి చూపు!

## లోక్‌సభలో మెజార్టీ, వచ్చే ఏడాది రాష్ట్రపతి ఎన్నికలే కీలకం

**న్యూఢిల్లీ, మే 22:** తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం రాజకీయ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. డీఎంకే కాంగ్రెస్ కూటమి విచ్ఛిన్నం కావడంతో బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు చేస్తూ పార్లమెంట్‌లో తన బలాన్ని పెంచుకోవడానికి సువర్ణావకాశంగా భావిస్తున్నదన్న వాదన మొదలయింది. జాతీయ అంశాల్లో పార్లమెంట్ లో డీఎంకేతో కలిసి పనిచేసే అవకాశాలపై బీజేపీ ఇప్పటికే దృష్టి సారించింది. డీఎంకే కూటమిలోని కాంగ్రెస్ పార్టీ రెండు దశాబ్దాల సుదీర్ఘ బంధానికి ముగింపు పలికి విజయ్‌కు మద్దతు ప్రకటించడం సుతరాము ఇష్టంలేదు. లోక్‌సభలో తమ ఎంపీలు కాంగ్రెస్ సభ్యులతో కలిసి కూర్చోవడానికి ఇష్టపడటం లేదని, వారి సీట్లను మార్చాలంటూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు డీఎంకే లేఖ రాసింది. ఈ పరిణామాలతో కొన్ని కీలక అంశాలపై తమతో డీఎంకే కలిసి పనిచేసేందుకు సిద్ధపడొచ్చనే నమ్మకం బీజేపీలో కలిగిస్తున్నాయని వర్గాలు పేర్కొన్నాయి. ఆరు దశాబ్దాలుగా తమిళ రాజకీయాలను శాసిస్తున్న ద్రవిడ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకేల ఆధిపత్యానికి గండి కొట్టి, రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని టీవీకే పూర్తిగా మార్చేసింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో తమతో కలిసి పనిచేసేలా డీఎంకేను ఒప్పించడం సాధ్యమవుతుందని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. కాంగ్రెస్‌లో చేరడానికి ముందు అటల్ బిహారీ వాజ్‌పేయి నాయకత్వంలోని సంకీర్ణ కూటమిలో బీజేపీతో కలిసి డీఎంకే పనిచేసింది. కాబట్టి పాత బంధాన్నీ మళ్లీ పునరుద్ధరించుకోవడం అసాధ్యం కాదని నమ్ముతోంది. కేంద్రం ప్రతిపాదించిన నియోజక వర్గాల పునర్విభజన అంశాన్ని డీఎంకే తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దక్షిణాది ప్రాధాన్యతను పూర్తిగా తగ్గించే ప్రయత్నాలని పేర్కొంటూ, డీఎంకే ఎంపీలు నల్లదుస్తులతో నిరసనలు చేపట్టి, ఆ బిల్లు ప్రతులను మంటల్లో కాల్చేశారు. సనాతన ధర్మంపై డీఎంకే వైఖరి నిరంతరం ఆ పార్టీని బీజేపీకి వ్యతిరేకంగా నిలబెడుతోంది. ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మానికి వ్యతిరేకంగా పదేపదే చేసిన వ్యాఖ్యలు, దాని నిర్మూలనకు చేసిన పిలుపులు చాలాకాలంగా బీజేపీ, డీఎంకేల మధ్య విభేదాలకు కారణమయ్యాయి. ఈ విషయంలో ఇరుపక్షాలు ముందుకు సాగడం ఒక క్లిష్టమైన పరిస్థితి. పార్లమెంటులో సంఖ్యాబలం ముఖ్యం కాబట్టి, నిర్దిష్ట అంశాలపై డీఎంకే తమకు మద్దతు ఇస్తుందనే ఆశలతో బీజేపీ ఉంది. లోక్‌సభలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లు ఆమోదానికి అవసరమైన మూడింట రెండొంతుల మెజారిటీని బీజేపీ సాధించలేకపోయింది. మొత్తం 543 స్థానాలున్న లోక్‌సభలో బిల్లు ఆమోదానికి 362 మంది అవసరం కాగా ఎన్డీఏకు 70 మంది తక్కువగా ఉన్నారు.

డీఎంకేకు చెందిన 22 మంది ఎంపీలు భవిష్యత్తులో ఆ మ్యాజిక్ నంబర్‌కు చేరువ చేయగలరని భావిస్తోంది. డీలిమిటేషన్ బిల్లుపై ఓటింగ్‌లో ఎన్డీఏకు 298 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 230 ఓట్లు పడ్డాయి. ఓటింగ్ సమయంలో 528 మంది ఎంపీలు హాజరుకావడంతో, మూడింట రెండొంతుల మెజారిటీ మార్కు (354) కంటే ఎన్డీఏకు 54 తక్కువ వచ్చాయి. డీఎంకేకు చెందిన 22 మంది ప్రతిపక్ష ఎంపీలు బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. బిజూ జనతా దళ్ (బీజేడీ), వైసీపీ వంటి పార్టీల మాదిరిగా డీఎంకేతో సంబంధాన్ని ఏర్పరచుకోవాలని బీజేపీ ఆశిస్తోంది. ఈ పార్టీలు ఎన్డీఏకు దూరంగా ఉంటూనే, కేంద్రానికి అంశాల వారిగా మద్దతును ఇస్తున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత మిత్రపక్షమైన అన్నాడీఎంకేలో అంతర్గత తిరుగుబాటు వంటి కారణాలు బీజేపీని ప్రత్యామ్నాయంవైపు ఆలోచించేలా చేసింది. అలాంటి తరుణంలో స్టాలిన్ నాయకత్వంలోని డీఎంకే ఏమాత్రం ఆసక్తి చూపినా ఆ పార్టీ దగ్గరవ్వడం బీజేపీకి కష్టమేమీ కాదు. వచ్చే ఏడాది రాష్ట్రపతి ఎన్నిక జరగనుంది. పశ్చిమ బెంగాల్, అసోంలో భారీ విజయాలతో బీజేపీ బలోపేతమైనప్పటికీ,

పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ లేకపోవడం పార్టీ వ్యూహకర్తలను ఇంకా కలవరపెడుతూనే ఉంది. రాష్ట్రపతి ఎన్నికల కోసం డీఎంకే మద్దతు పొందే అవకాశాన్ని తమ పార్టీ అన్వేషిస్తుందని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి.

కేంద్రం తన బలాన్ని పెంచడమే కాకుండా, బీజేపీకి డీఎంకే అంశాల వారీ మద్దతు ఇస్తే ప్రతిపక్షాల ఐక్యతను దెబ్బతీయడంతోపాటు బిజెపికి మైలేజిని పెంచుతుందని అంచనా.

## క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యం

### ధాన్యం కొనుగోళ్లలో జాప్యం.. రోడ్డెక్కిన అన్నదాతలు

## అకాల వర్షానికి నాగర్‌కర్నూలులో తడిసి ముద్దయిన ధాన్యం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:**ప్రభుత్వ ఆదేశాలను సైతం ఖాతరు చేయకుండా క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు ధాన్యం కొనుగోళ్లను జాప్యం చేస్తుండడంతో అన్నదాతల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. గన్నీ సంచుల కొరత, లారీల రాక తూకం వేసిన ధాన్యం లోడ్ కావడంలో ఇబ్బందులు, అధికారుల ఉదాసీనతపై రైతాంగం తీవ్ర నిరసన వ్యక్తం చేస్తోంది. ధాన్యం కొనుగోళ్లలో జరుగుతున్న ఆలస్యాన్ని నిరసిస్తూ పలు జిల్లాల్లో రైతులు రోడ్డెక్కారు. మెదక్ జిల్లా గంగాపూర్ వద్ద ఆగ్రహించిన రైతులు ఏకంగా జాతీయ రహదారిపై ధాన్యపు బస్తాలను వేసి రాస్తారోకోకు దిగారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయినా తమ సమస్య తీరేవరకు కదిలేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఇక రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ప్రాంతంలో పరిస్థితి మరీ దారుణంగా మారింది. దాదాపు 45 నుంచి 50 రోజులుగా రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే పడిగాపులు కాస్తున్నారు."పంట కోసి నెలన్నర అవుతోంది. ఇక్కడే తిండి, తిప్పలు మాని ధాన్యానికి కాపలా ఉంటున్నాం. ఇంకా ఎన్ని రోజులు వేచి చూడాలి..?!" అని వేములవాడ రైతులు కన్నీరు పెట్టుకుంటున్నారు. మరోవైపు ఆకాశం మబ్బులు కమ్ముకుంటుండడంతో రైతుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వర్షాకాలం ముంచుకొస్తుండటం, అకాల వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఓపెన్ యార్డుల్లో ఉన్న ధాన్యం తడిసి ముద్దవుతుందేమోనని రైతులు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతున్నారు. ఒకవేళ ధాన్యం తడిసిపోతే కనీస మద్దతు ధర కూడా దక్కదని, తాము అప్పులపాలవుమని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలోకి వచ్చి చూడాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల నుండి ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి అవసరమైన లారీలను వెంటనే ఏర్పాటు చేయాలని, తూకాల్లో ఎలాంటి మోసాలు జరగకుండా పారదర్శకంగా కొనుగోళ్లు పూర్తి చేయాలని కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన ధాన్యం సేకరించకపోతే, రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. కాగా.. అకాల వర్షం నాగర్‌కర్నూల్ జిల్లా రైతాంగాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. జిల్లాలోని పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో గురువారం రాత్రి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో కొనుగోలు కేంద్రాలకు రైతులు ఎంతో ఆశతో తీసుకొచ్చిన వరి ధాన్యం, మొక్కజొన్న పంటలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## రాష్ట్రంలో పారాక్వాట్ డైక్లోరైడ్ అమ్మకంపై తాత్కాలిక నిషేధం

**విజయవాడ, మే 22,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పారాక్వాట్ డైక్లోరైడ్ అమ్మకంపై తాత్కాలిక నిషేధించినట్లు సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. నేటి నుంచి 60 రోజులపాటు విక్రయం, పంపిణీ, వినియోగంపై నిషేధం అమలు చేశారు. పారాక్వాట్ (సాగు అవసరాలకు వాడే గడ్డిమందు) వల్ల ప్రజల భద్రతకు ప్రమాదం ఉందని, దీని వినియోగంతో మరణాల రేటు పెరిగిందని వైద్యరంగ నిపుణులు తెలిపినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమంలో సీఎస్ పారాక్వాట్‌పై నిషేధం అమలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు.

## సమాజసేవను శిక్షగా విధించే విధి విధానాలు ఆమోదిస్తూ ఉత్తర్వులు

**విజయవాడ, మే 22:** సమాజసేవను శిక్షగా విధించే విధివిధానాలు ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు మార్గదర్శకాలను ఆమోదిస్తూ రాష్ట్ర హోంశాఖ జీవో ఇచ్చింది. దీంతో నేరస్వభావం మేరకు న్యాయస్థానాలు శిక్షలు విధించనున్నాయి. ఒకరోజు నుంచి 31 రోజుల వరకు కోర్టులు శిక్షలు విధించే అవకాశం ఉంది. అలాగే 40 నుంచి 240 గంటల వరకు సమాజసేవ శిక్షలను విధించవచ్చు. ఆస్పత్రులు, మున్సిపాలీలు, జూ, పబ్లిక్ పార్కులు, ట్రాఫిక్ నియంత్రణ సేవలు, ప్రభుత్వ పాఠశాలలు, గ్రంథాలయాల్లో సేవలను శిక్షలుగా విధించే అవకాశం ఉంది.

## టాప్ 50 వేసవి హీట్ నగరాలు భారత్‌లోనే!

**న్యూఢిల్లీ, మే 22:**దేశం మునుపెన్నడూ లేనివిధంగా వేసవి ఉష్ణోగ్రతలు అట్టుడికిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్ట స్థాయి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.శుక్రవారం కూడా భారీగా ఎండలు నమోదయ్యాయి. తెలంగాణలోని జగిత్యాలలో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 43 డిగ్రీల ఎండలతో జగిత్యాల దేశంలోనే 11వ స్థానంలో ఉండటం విశేషం. ఉదయం ప్రపంచంలోనే అత్యధిక ఎండ (ఉష్ణోగ్రత) కలిగిన టాప్ 50 నగరాలు ఇండియాలోనే ఉన్నాయి. వాతావరణం, ఉష్ణోగ్రతలు వంటి వాటిని పరిశీలించే ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఎక్యూఐ డేటా ప్రకారం శుక్రవారం ఉదయం 10.50 గంటలకు అత్యధిక ఎండలు ఇండియాలోనే నమోదయ్యాయి. టాప్ 50 నగరాల్లో ఇతర దేశాలకు చెందిన ఒక్క నగరం కూడా లేదంటే దేశంలో ఏ స్థాయిలో ఎండలు మండిపోతున్నాయో అర్థం చేసుకోవచ్చు. ఉదయం పదకొండు గంటలకు ముందే ఒడిశాలోని బాలంగిర్‌లో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రెండో స్థానంలో మహారాష్ట్రలోని చంద్రాపూర్ 44 డిగ్రీలు, మూడో స్థానంలో యూపీలోని ప్రయాగ్‌రాజ్ 44 డిగ్రీలు, నాలుగు, ఐదు స్థానాల్లో చత్తీస్‌గడ్‌లోని బిలాస్‌పూర్, మహాసముంద్ 44 డిగ్రీలు, ఆరవ స్థానంలో బిహార్‌లోని బుక్సర్ 44 డిగ్రీలు, ఏడో స్థానంలో చత్తీస్‌గడ్‌లోని దుర్గ్ 44 డిగ్రీలు, ఎనిమిదో స్థానంలో బిహార్.


INDIAN RAILWAYS
सत्यमेव जयते
भारत सरकार

యువత నిరంతర ప్రగతియే
వికసిత్ భారత్ కు ప్రోత్సాహక శక్తి



ప్రభుత్వ సేవల ద్వారా యువతను
జాతి నిర్మాణంతో కలిపే ఒక చొరవ

రోజ్‌గార్ మేళా

దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో ప్రభుత్వ ఉద్యోగాల కోసం
ఎంపిక చేయబడిన 51,000+ మంది అభ్యర్థులకు
నియామక పత్రాల పంపిణీ

నరేంద్ర మోదీ
ప్రధానమంత్రి
ద్వారా
(వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా)

శనివారం, 23 మే, 2026 ఉదయం 11:00 గంటలకు

భారత ప్రభుత్వం మరియు భాగస్వామ్య రాష్ట్ర ప్రభుత్వాలు ద్వారా ఉద్యోగాల లక్షలాది నియామక పత్రాల పంపిణీ

సమాన అవకాశాలను నిర్ధారించడానికి 13 ప్రాంతీయ భాషల్లో నియామక పరీక్షల సదుపాయం

మహిళలు, దివ్యాంగులు మరియు ఆకాంక్షిత జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ప్రత్యేకమైన ప్రయోజనాలు

i-GOT కర్మయోగి పోర్టల్ లో 4,800 కంటే ఎక్కువ ఉన్నత నాణ్యత గల కోర్సులు ద్వారా 1.65 కోట్లకు పైగా ప్రభుత్వ ఉద్యోగులు శిక్షణ పొందారు

యూపీఎస్‌సి, ఎస్ఎస్‌సీ, రైల్వే నియామక బోర్డు మరియు ఐబిపిఎస్ వంటి ప్రతిష్టాత్మక ఏజెన్సీల ద్వారా నియామకాలు

నిజాయితీ తో కూడిన మెరిట్ ఆధారిత నియామకం యువత కలలకు కొత్త ఆశలు కల్పిస్తోంది

DD NEWS డీడీ న్యూస్ లో కార్యక్రమం యొక్క ప్రత్యక్ష ప్రసారం చూడండి

శిక్షణ కు సంబంధించిన మరింత సమాచారం కోసం కర్మయోగి మాడ్యూల్ వెబ్‌సైట్ https://igotkarmayogi.gov.in ను సందర్శించండి లేదా క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయండి

మమ్మల్ని అనుసరించండి

# మరిన్ని పిఎంజిఎస్‌వై పనులు, నిధులు కావాలి

### 100 శాతం నిధులను కేంద్రమే భరించాలి

### ఏజెన్సీ ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాలతో పనులు

### దక్షిణాది రాష్ట్రాల పిఎంజిఎస్‌వై ప్రాంతీయ సమావేశంలో మంత్రి సీతక్క




**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** ప్రధాన్‌మంత్రి గ్రామ సడక్ యోజన (పిఎంజిఎస్‌వై) కింద తెలంగాణకు మరిన్ని రహదారి పనులను, నిధులను మంజూరు చేయాలని, ముఖ్యంగా ఆదివాసీ గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారుల అనుసంధానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో జరుగుతున్న దక్షిణాది రాష్ట్రాల పిఎంజిఎస్‌వై ప్రాంతీయ సమావేశంలో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర సమస్యలు, అవసరాలను కేంద్ర ప్రభుత్వ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అతిథిసింగ్, ఎన్ఆర్ఐడీఏ డైరెక్టర్ జనరల్, దక్షిణాది రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. 25 యేళ్లుగా పిఎంజిఎస్‌వై గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్లకు రాకపోకలను మెరుగుపరిచిందన్నారు. ప్రస్తుతం ఈ పథకం మారుమూల గ్రామాలు, ఆదివాసీ గిరి జన గూడెలను, మైదాన ప్రాంతాలతో అనుసంధానం చేస్తుందన్నారు. అయితే గతంలో ప్రధానమంత్రి గ్రామీణ యోజన పథకానికి 100 నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించేదని, కానీ కేంద్ర ప్రభుత్వం నిబంధనలు మార్చి రాష్ట్రాలపై 40శాతం భారం వేస్తోందని, ఆ విధానాన్ని పునఃసమీక్షించాలని కోరారు.

ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్ ఆసిఫాబాద్ వంటి ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా రోడ్డు పనులకు అనుమతులు ఆలస్యమవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. గిరిజనాభివృద్ధి, గ్రామీణ రవాణా సౌకర్యాల దృష్ట్యా అటవీ, వన్యప్రాణి నిబంధనల్లో అనుకూల మార్పులు చేయాలని కేంద్రాన్ని కోరారు. అటవీ సంరక్షణ చట్టాల్లోఇటీవల తెచ్చిన మార్పులు ఆదివాసీల అభివృద్ధికి అటంకంగా మారుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామీణ రహదారుల నిర్వహణ కోసం హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను రాష్ట్రం అమలు చేస్తోందన్నారు. పిఎంజిఎస్‌వై కింద తెలంగాణలో ఇంకా అనేక ప్రాంతాలకు రోడ్డు అనుసంధానం అవసరమని, మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులు, అభివృద్ధి కేంద్రాలకు గ్రామీణ ప్రజలు సులభంగా చేరుకునేలా మరిన్ని పనులు మంజూరు చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖను కోరారు.

## ఫిజికల్ ఎడ్యుకేషన్ సెట్ హాల్‌టికెట్లు విడుదల

### 31 నుంచి జూన్ 3 వరకు పరీక్షలు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణలోని విశ్వవిద్యాలయాలు, వాటి అనుబంధ కళాశాలలు అందించే 2 సంవత్సరాల బి.పి.ఇడి, డి.పి.ఇడి కోర్సులలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశం కోసం నిర్వహించే ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(పీఈ సెట్)-2026కి సంబంధించిన హాల్ టికెట్లను శుక్రవారం విడుదల చేసినట్టు పీఈ సెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ ఒక ప్రకటనలో తలెఇపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో సహకారంతో శాతవాహన యూనివర్సిటీ పీఈ సెట్‌ను నిర్వ హిస్తోంది. ఈ నెల 31 నుంచి జూన్ 3 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ నెల 31 నుంచి జూన్ 3 వరకు కరీంనగర్‌లోని శాతవాహన విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో పరీక్షలను నిర్వహించడం జరుగుతుందని కన్వీనర్ తెలిపారు. ఇందుకు సంబంధించిన హాల్ టికెట్లను పీఈ సెట్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచమని, వెబ్‌సైట్ నుండి హాల్ టికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కన్వీనర్ ప్రొఫెసర్ రాజేష్ కుమార్ తెలిపారు.

## ఫ్యూచర్‌సిటీ రద్దు ప్రకటన తెలంగాణ గొంతు కోయడమే

### ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామన్న హరీశ్‌రావు ప్రకటన తెలంగాణ భవిష్యత్తు గొంతు కోయడమేనని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన చెందారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ హరీశ్ పెట్టుబడిదారులను భయపెట్టి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పదేళ్లు అధికారం అనుభవించి రాష్ట్రాన్ని ఆగంచేసి అమెరికాకు వెళ్లి అక్కడ కూడా బిఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలంగాణ పరువు తీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ విజన్-2047లో భాగమే భారత్ ఫ్యూచర్ సిటీ అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అద్భుత నగర నిర్మాణానికి ప్రణాళిక వేసున్నారని యెన్నెం వివరించారు. ఫ్యూచర్ సిటీ ద్వారా 20 లక్షల ఉద్యోగాలే తమ లక్ష్యమని తెలిపారు. 250 కిలోమీటర్ల హైవే సిఎం రేవంత్ గొప్ప విజన్‌గా రూపొందిస్తున్నారనీ ఆయన గుర్తు చేశారు. తెలంగాణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని ఎప్పుడో విస్మరించారన్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతంలో బ్యాంకుల పాత్ర కీలకం

### వ్యవసాయ రుణాలను పంట రుణాలకే పరిమితం చేయొద్దు

### మౌలిక వసతులు, విలువ ఆధారిత వ్యవసాయానికి రుణాలను విస్తరించాలి

### ఎస్ఎల్‌బిసి త్రైమాసిక సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** పంట రుణాల చెల్లింపులో రైతులు క్రమశిక్షణ పాటిస్తున్నందున బ్యాంకులు పెట్టుబడి రుణాల మంజూరులో ఆలస్యం చేయొద్దని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వ్యవసాయ ఎన్‌పిఎలు (నిరర్ధక ఆస్థులు) 5.23 శాతం నుంచి 4.71 శాతానికి తగ్గడం, టర్మ్ లోన్ల ఎన్‌పిఎలు కేవలం 2.62 శాతం ఉండటం రైతుల రుణ చెల్లింపు నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి బ్యాంకులు మరింత చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాభవన్‌లో నిర్వహించిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ(ఎస్ఎల్‌బిసి) త్రైమాసిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా బ్యాంకింగ్ సంస్థల ప్రతినిధులు, నాబార్డు అధికారులు, సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. రాష్ట్రంలో 2025-26 ఆర్థిక సంవత్సరాంతానికి మొత్తం డిపాజిట్లు సుమారు రూ.9.43 లక్షల కోట్లకు, మొత్తం అడ్వాన్సులు రూ.12.33 లక్షల కోట్లకు చేరాయని, రాష్ట్ర క్రెడిట్ డిపాజిట్ నిష్పత్తి 130.78 శాతంగా నమోదై జాతీయ సగటును మించిపోయిందని తెలిపారు. ప్రధాన రంగ రుణాలు రూ.4.09 లక్షల కోట్లు, వ్యవసాయ రుణాలు రూ.1.87 లక్షల కోట్లకు చేరడం సంతోషకరమని పేర్కొన్నారు.

వ్యవసాయ రుణాల లక్ష్య సాధన 102 శాతం నమోదు కావడం అభినందనీయమన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో పంట రుణాల పంపిణీ రూ.75,486 కోట్లకు చేరి వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యంలో 84.34 శాతం సాధించిందన్నారు. కెనరా, ఇండియన్, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్, టిజిసిఎబి తదితర బ్యాంకులు లక్ష్యాలను మించి రుణాలు పంపిణీ చేయగా, మరికొన్ని బ్యాంకులు తమ పనితీరును మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వ్యవసాయం ఇప్పుడు ఉద్యానవనం, ఆయిల్‌పామ్, సమగ్ర వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, రక్షిత సాగు, పాడి, మత్స్య, యాంత్రీకరణ వంటి రంగాల వైపు వేగంగా మారుతున్న నేపథ్యంలో బ్యాంకింగ్ వ్యవస్థ కూడా మారుతున్న అవసరాలకు అనుగుణంగా స్పందించాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా దాదాపు వెయ్యి రైతు ఉత్పత్తిదారుల సంస్థలు (ఎఫ్‌పిఒ) కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, వీటికి బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి బలమైన ఆర్థిక మద్దతు అవసరమని మంత్రి పేర్కొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థలను వ్యవసాయ రంగంలో స్థిరమైన అభివృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్దాలని బ్యాంకులను కోరారు. వ్యవసాయ యంత్రాల కోసం రైతులకు బ్యాంకులు అవసరమైన అదనపు రుణ సహాయం అందించాలని కోరారు. కౌలు రైతులకు సకాలంలో పంట రుణాలు అందించడం అత్యంత అవసరమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. భవిష్యత్ వ్యవసాయ రుణాలు మైక్రో ఇరిగేషన్, సమగ్ర వ్యవసాయం, అగ్రో ఫారెస్ట్రీ, సోలార్ వ్యవసాయం, రక్షిత సాగు, వాతావరణ అనుకూల వ్యవసాయం వంటి రంగాలపై కేంద్రీకృతం కావాలని బ్యాంకర్లకు సూచించారు. వ్యవసాయ పెట్టుబడులు, గ్రామీణ మౌలిక వసతులు, ఫుడ్ ప్రాసెసింగ్, విలువ ఆధారిత వ్యవసాయం, గ్రామీణ పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వంతో బ్యాంకర్లు కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

## నిరుద్యోగ మహిళలకు సర్కార్ శుభవార్త

### 15,982 అంగన్‌వాడీ సహాయకుల పోస్టుల భర్తీకి చర్యలు

### త్వరలో జిల్లాల వారీగా నోటిఫికేషన్లు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** తెలంగాణలోని నిరుద్యోగ మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 15,982 పోస్టుల భర్తీకి ప్రభుత్వం సిద్ధమైంది. ఇందులో అంగన్‌వాడీ సహాయకుల పోస్టులు 12,882 ఉండగా అంగన్వాడీ టీచర్ పోస్టులు 3,100 ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీకి సంబంధించి త్వరలో జిల్లాల వారీగా నోటిఫికేషన్లు విడుదలయ్యే అవకాశం ఉంది. రాష్ట్రంలో 35,781 అంగన్వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటిల్లో 71,562 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. ఇందులో టీచర్లు, వర్కర్లు సమానంగా ఉంటారు. గత మూడేళ్లుగా పదవీ విరమణ, సిబ్బందికి సూపర్ వైజర్లుగా పదోన్నతులు, కొందరికి ఇతర విభాగాల్లో శాశ్వత ఉద్యోగాలు రావడంతో భారీగా ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అంగన్వాడీ కేంద్రాల్లో పనిచేయాల్సిన సిబ్బందికి సంబంధించి 22.33శాతం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. పదోన్నతులు, పదవీ విరమణతో 2025-26 ఏడాది నాటికి ఏర్పడిన ఖాళీలను పరిగణలోకి తీసుకుంటూ ఖాళీలను ప్రభుత్వం గుర్తించింది. కొత్త నియామక విధానానికి ఆమోదం లభించిన వెంటనే జిల్లాల వారీగా నోటిఫికేషన్లు వెలువడనున్నాయి.అదే సమయంలో అంగన్ వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు, శాశ్వత భవనాలు, ఆరోగ్యం పాట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమవుతోంది.



మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

## ధాన్యం, మక్కల సేకరణ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో వడ్లు, మక్కల (ధాన్యం) సేకరణలో రైతులు ఎదుర్కొంటున్న తీవ్ర సమస్యలను తక్షణమే పరిష్కరించి, వారిని ఆదుకోవాలని రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిసి రైతుల ఇబ్బందులపై సమగ్రమైన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రైతులు అహర్నిశలు కష్టపడి పండించిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే, అక్కడ కనీస సౌకర్యాలు లేక కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రవాణా వాహనాలను పెంచి, వారికి ఇచ్చే రెమ్యునరేషన్ పెంచాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో జాప్యం వల్ల మానసిక ఆందోళనకు గురై ఇప్పటికే మెదక్ జిల్లాకు చెందిన రాజయ్య, సిరిసిల్ల జిల్లాకు చెందిన గడ్డం లక్ష్మయ్య అనే ఇద్దరు రైతులు మరణించారని కృష్ణయ్య మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

## కులగణన తీర్పుపై వాస్తవాలు తెలుసుకోండి

### బిసి ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** కులగణనపై సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పునకు సంబంధించి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు తెలిపారు. కొందరు సుప్రీం తీర్పును వక్రీకరించడం శోచనీయమన్నారు. వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఒక ప్రకటనలో తెలిపారు. జనగణనలో కులగణన నిర్వహించవద్దని కోరుతూ ఇటీవల ఒకరు రిట్ పిటిషన్ దాఖలు చేయగా దానిని కోర్టు కొట్టివేసిందని పేర్కొన్నారు. జనగణనలో కులగణన చేపట్టాలా? వద్దా? అనేది కేంద్ర ప్రభుత్వ శాసనపరమైన విధాన నిర్ణయాల పరిధిలోకి వచ్చే అంశమని చెప్పారు.

## పిసిసి ఎస్‌సి సెల్ నూతన కార్యవర్గం ఏర్పాటు

### 27 జిల్లాలకు ఎస్‌సి సెల్ చైర్మన్ల నియామకం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ ఎస్‌సి సెల్ రాష్ట్ర చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ జిల్లా కమిటీలను రాష్ట్రకమిటీలను ఏర్పాటు చేసుకొని శుక్రవారం అధికారికంగా జాబితాను విడుదలచేశారు. ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలనే లక్ష్యంతో కాంగ్రెస్ పార్టీని సంస్థా గతంగా పటిష్టమైన పునాది ఏర్పాటు చేసుకోవడానికి అనుబంధ సంఘాల బలోపేతంలో భాగంగా నియామకం చేపట్టినట్లు గాంధీభవన్‌లో కవ్వంపల్లి సత్యనారాయణ విలేఖరులకు వివరించారు. జిల్లా, రాష్ట్ర కార్యవర్గంలో దళితుల వర్గాలకు చెందిన 54 కులాలకు ప్రాధాన్యత ఇస్తూ సమతూకం పాటించామని తెలిపారు. ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే, పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలతోపాటు రాష్ట్రంలోని మం త్రులు ఇతర ప్రముఖ నాయకుల సలహాలు సూచనలతో కార్యవర్గంకు తుది రూపు ఇచ్చామని ఇప్పటికి 27 జిల్లాకలు జిల్లా చైర్మన్లు నియామకం చేశామని తెలిపారు.రాష్ట్ర కార్యవర్గంలో కూడా 16మంది వైస్ చైర్మన్‌లను,9 మంది రాష్ట్ర ప్రధాన కార్యదర్శులను 29 మంది రాష్ట్ర కార్యదర్శులను, కార్యవర్గ మెంబర్లు, ఆఫీసు బేరర్లు వంటి కూడా నియమించామని తెలిపారు. నూతనంగా నియామకమైన టిపిసిసి ఎస్‌సిచైర్మన్, వైస్‌చైర్మన్‌లతో నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్‌సిలు కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలనీ రాహుల్ గాంధీని ప్రధాని చేయడంలో ఎస్‌సి లు కీలకం కావాలనీ ప్రతి జిల్లా లో ఎస్ సి సెల్ కమిటీలు ఉంటాయి అలానే శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తామనీ చెప్పారు. త్వరలోనే మిగిలిన ఆరు జిల్లాలు నూతన కమిటీలు వేస్తామని తెలిపారు. ప్రభు త్వం సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకొనిపోవాలని ఆయన కోరారు. ప్రస్తుతం సర్ జరుగుతోందని బిఎల్‌ఎలతో అనుసంధానమై ఒక్క లౌకిక ఓటరును కూడా తొలిగించకుండా అప్రమత్తంగా ఉండాలని ఎస్‌సి సెల్ కార్యకర్తలకు నాయకులకు ఆయన సూచించారు.

## కనీసవేతన పెంపుతో కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగు

### రేవంత్‌రెడ్డి చొరవతో అసంఘటిత కార్మికులకు లబ్ధి

### గాంధీభవన్‌లో ఐఎన్‌టియుసి రాష్ట్ర నేతల సంబరాలు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** కనీస వేతన పెంపుతో కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగవుతాయనీ ఐఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు మెగుళ్ల రాజిరెడ్డి పిసిసి ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీశ్ అన్నారు. కార్మికులకు కనీస వేతనాలు అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాన్న నేపథ్యంలో ఐఎన్‌టియుసి ఆధ్వర్యంలో గాంధీభవన్‌లో శుక్రవారం సంబరాలు జరిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్, జాతీయ అధ్యక్షులు సంజీవ రెడ్డి, కార్మిక శాఖ మంత్రి వివేక్‌లతో కూడిన చిత్రపటాలకు కార్మిక సంఘాల నాయకులు పాలాభిషేకం చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు అదిల్ షరీఫ్, అక్తర్ హుసేన్ తదితరులు పాల్గొని బాణసంచా కాల్చుతూ ,మిఠాయిలు పంపిణీ చేశారు. మెగుళ్ళరాజిరెడ్డి సంగిశెట్టి జగదీష్‌లు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రజా పాలనలో సిఎం సహోసపేతామైన నిర్ణయం తీసుకున్నాడనీ కితాబు ఇచ్చారు రాష్టంలో 1కోటి 11 లక్షల పైన కార్మికులకు లబ్ధి చేకూరుతుందనీ కనీస వేతనంపై సిఎం ప్రకటనతో ఎంప్లాయ్మెంట్ 73 షెడ్యూల్‌లోని అసంఘటిత రంగ కార్మికులకు నెలకు 5 వేల వరకు వేతనాలు పెంచా రని గతంలో ఉమ్మడి రాష్ట్రంలో ఇంతగా ఎప్పుడు పెరగలేదనీ, తెలంగాణ రాష్ట్రం ఆవి ర్భావం తరువాత 12 యేళ్లకు తొలిసారి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మిక పక్షపాతిగా గొప్ప నిర్ణయం తీసకొన్నారని ఐఎస్ టియుసి నేత రాజిరెడ్డి తెలిపారు. కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర అఖిలభారత అసం ఘటిత కార్మికుల సంఘం, ఉద్యోగుల కాంగ్రెస్ చైర్మన్ కౌశల్ సమీర్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం నిరక్ష్యం వలన గడచిన టిఆర్ఎస్ పదేళ్ల పాలనలో కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురయ్యారనీ ఆవేదన చెందారు. సిఎం రేవంత్‌రెడ్డి తెలం గాణ ప్రజల కుటుంబ పెద్దన్నగా ఒక్కక్క కార్మికునికి 3 వేల నుండి 5వేల వరకు వేతనాలు పెంచి కార్మికుల ఆశయాలకు అండగా నిలిచారన్నారు.

## పోలీస్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ విజేతలకు డిజిపి అభినందన



పోలీస్ బ్యాట్‌మింటన్, టేబుల్ టెన్నిస్ విజేతలతో డిజిపి సి.వి. ఆనంద్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఈ నెల తొమ్మిదవ తేదీ నుంచి 12వ తేదీ వరకు జరిగిన రెండవ అఖిల భారత పోలీస్ బ్యాట్‌మింటన్, టేబుల్ టెన్నిస్ క్లస్టర్ ఛాంపియన్‌షిప్‌లో రాష్ట్ర పోలీసు విభాగానికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో ఒక స్వర్ణ పతకంతో పాటు నాలుగు రజత పతకాలు, ఏడు కాంస్య పతకాలను రాష్ట్ర పోలీసు క్రీడాకారులు సాధించారు. ఈ సందర్భంగా విజేతలను డిజిపి సి.వి ఆనంద్ శుక్రవారం తన ఛాంబర్‌లో సన్మానించారు. బ్యాట్‌మింటన్ పోటీల్లో పోలీసు అకాడమిలో శిక్షణలో వున్న డిఎస్‌పిలు నేహా పురోహిత్, లతీఫా ఆషాల జోడి మహిళల విభాగంలో స్వర్ణ పతకం అందుకుంది.

దీంతో పాటు ఆషా మిక్స్ డబుల్‌లో రజతం, సింగిల్స్ విభాగంలో మరో రెండు రజత పతకాలను ఆమె సాధించారు. దీంతో పాటు ఇతర విభాగాల్లో క్రీడాకారులు పతకాలు అందుకున్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను డిజిపి సన్మానించడంతో పాటు భవిష్యత్తులో మరింతగా రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు క్రీడలు, సంక్షేమ విభాగం ఐజి డాక్టర్ గజారా వు భూపాల్‌తో పాటు ఆయా విభాగాలకు సంబంధించిన కోచ్‌లు కూడా పాల్గొన్నారు.

## పార్టీ ఆఫీసుల్లో కూర్చొని కాలక్షేపం వద్దు

### క్షేత్రస్థాయిలో ప్రజల మధ్య నిరంతరం ఉండాలి

### బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో బిజెపి ప్రజాప్రతినిధులకు అభయ్‌పాటిల్ దిశానిర్దేశం

### జూన్‌లో తెలంగాణకు బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబిన్

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో అధికారం దక్కించుకోవడమే లక్ష్యంగా బీజేపీ ఇప్పటి నుంచే వ్యూహాలకు పదును పెడుతోంది. పార్టీని గ్రాస్ రూట్ లెవెల్‌కు (క్షేత్రస్థాయికి) బలంగా తీసుకెళ్లేందుకు రాష్ట్ర నాయకత్వం సరికొత్త కార్యాచరణతో అడుగులు వేస్తోం ది. ఇందులో భాగంగానే శుక్రవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అధ్యక్షతన పార్టీ ప్రజాప్రతినిధుల కీలక సమావేశం జరిగింది. సమావేశంలో రాష్ట్ర పార్టీ ఇన్‌చార్జ్ అభయ్ పాటిల్ పాల్గొని రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అత్యంత కీలకమైన సూచనలు చేశారు. నేతల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్స్ లేకుండా నిరంతరం కోఆర్డినేషన్ చేసుకోవాలన్నారు. కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరూ నిరంతరం జనం మధ్యే ఉండాలని స్పష్టం చేశారు. ఇందుకోసం నిరంతరం ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని ప్రజాప్రతినిధులకు అభయ్‌పాటిల్ సూచించారు. జూన్ నెల మొదటి వారంలో బీజేపీ జాతీయ నాయకులు నితిన్ నబీన్ తెలంగాణకు రానున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు వెల్లడించారు.

## రికార్డులు బద్దలు కొడుతున్న బీర్ల అమ్మకాలు

# రాష్ట్రంలో మండుతున్న ఎండలు

**హైదారబాద్, మే 22, ప్రభాతవార్త:**రాష్ట్రంలో భానుడు భగభగలాడుతున్నాడు. ఉదయం పది దాటిందంటే చాలు జనాలు బయటకు రావడానికే భయపడుతున్నారు. ఈ మండుటెండల వేడి మద్యం ప్రియులను మాత్రం వైన్ షాపుల వైపు పరుగులు పెట్టిస్తోంది. ఎండల దెబ్బకు బాడీని కూల్ చేసుకోవడానికి మందుబాబులు గ్లాసుల కొద్దీ చల్లటి బీర్లను లాగించేస్తున్నారు. ఫలితంగా తెలంగాణలో బీర్ల అమ్మకాలు మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త రికార్డుల వైపు దూసుకుపోతున్నాయి. ముఖ్యంగా మే నెలలో ఎండల తీవ్రత పెరగడంతో బీర్లకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పటి వరకు మే నెలలో రాష్ట్రంలో ఏకంగా 45 లక్షల కేసుల బీర్లు అమ్ముడైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. గత ఏడాది మే నెలతో పోలిస్తే ఇది దాదాపు 18.40 శాతం ఎక్కువ కావడం విశేషం. ఎండల తీవ్రత ఇలానే ఉంటే ఈ నెల ఆఖరి నాటికి అమ్మకాలు 55 లక్షల కేసుల మార్కును దాటేసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అదే జరిగితే తెలంగాణ మద్యం విక్రయాల చరిత్రలోనే ఇది ఒక ఆల్‌టైమ్ రికార్డుగా నిలిచిపోనుంది. సాధారణంగా విస్కీ, బ్రాందీ లాంటి హార్డ్ లిక్కర్‌ను ఇష్టపడే వారు సైతం ఎండల దెబ్బకు రూటు మార్చేశారు. వేడిని తట్టుకోలేక తాత్కాలికంగా హార్డ్ డ్రింక్స్ పక్కనబెట్టి చిల్డ్ బీర్లపై మొగ్గు చూపుతున్నారు. దీంతో వైన్ షాపుల దగ్గర ఎక్కడ చూసినా బీర్ల కోసమే క్యూ లైన్లు కనిపిస్తున్నాయి. అటు ప్రభుత్వానికి కూడా దీని ద్వారా భారీగా ఆదాయం సమకూరుతుండటంతో డిమాండ్‌కు తగ్గట్టుగా స్టాక్‌ను అందుబాటులో ఉంచేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.



సిఎం ప్రజావాణిలో చిన్నారెడ్డిని కలిసిన అనాథ గిరిజన చిన్నారులు

## అనాథ గిరిజన చిన్నారులకు అండగా సిఎం ప్రజావాణి

### ఇద్దరు చిన్నారులకు ఆర్థికంగా ఆదుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్‌కు చిన్నారెడ్డి లేఖ

**హైదరాబాద్ (బేగంపేట), మే 22, ప్రభాతవార్త :** తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన గిరిజన (తోటి) కులానికి చెందిన ఇద్దరు చిన్నారులకు సీఎం ప్రజావాణీ అండగా నిల్చింది. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన సీఎం ప్రజావాణికి ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు ఏజెన్సీ ప్రాంతానికి చెందిన అనాథ పిల్లలను వారి బంధువులు తీసుకు వచ్చారు. రెండేళ్లు, మూడు నెలల చిన్నారుల పోషణ కష్టంగా ఉందని,వారి సంరక్షణ చూస్తున్న పెదనాన్న, పెద్దమ్మ ఆంత్రం సునీత, వెంకటిలు సిఎం ప్రజావాణి ఇంచార్జ్ జి.చిన్నారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకుని చలించిపోయిన చిన్నారెడ్డి ఇద్దరు చిన్నారులకు స్పాన్సర్ షిప్ అందించాలని కోరుతూ ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్‌కు లేఖ రాసారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరు మండలం రాజీ గోండు నగర్ గ్రామానికి చెందిన ఆంత్రం విఠల్, గంగుభాయ్ ఆరు నెలల కాలంలో మృతి చెందడంతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారారు. దీంతో ఆ చిన్నారుల బాధ్యతలు వారి పెదనాన్న, పెద్దమ్మ చూస్తున్నారు.కనీసం డబ్బా పాలు కూడా కొనలేని దీనస్థితిలో ఉన్నామని వారు చిన్నారెడ్డి దృష్టికి తీసుకుని వచ్చారు. ప్రతి నెల ఆర్థిక సాయంతోపాటు డబ్బా పాలను చిన్నారులకు అందించే బాధ్యత తీసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్‌కు చిన్నారెడ్డి సూచించారు.

# గ్రానైట్‌లో రూ.16.96 కోట్ల జిఎస్టీ ఎగవేత

**హైదారబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రానైట్ పరిశ్రమలో అవినీతి, అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా రాష్ట్రంలోని కరీంనగర్ జిల్లా రూ.16.96 కోట్ల విలువైన జీఎస్టీ ఎగవేత జరిగినట్లు వాణిజ్య పన్నుల శాఖ గుర్తించింది. సరైన పన్ను చెల్లింపులు లేకుండా దాదాపు రూ.100 కోట్ల విలువైన గ్రానైట్‌ను రవాణా, ఎగుమతి చేసేందుకు నకిలీ ఇన్‌వాయిస్‌లు, వేబిల్లులు సృష్టించిన ఆరోపణలపై ఒక నకిలీ ఏజెన్సీ ఆపరేటర్‌ను వాణిజ్య పన్నుల శాఖకు చెందిన విజిలెన్స్ అధికారులు అరెస్టు చేశారు. విదేశాలకు గ్రానైట్ ఎగుమతిలో ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ ఉల్లంఘనలు బయటపడిన కొద్ది రోజులకే, కరీంనగర్ గ్రానైట్ పరిశ్రమలో మరో అవకతవక వెలుగులోకి రావడం విశేషం. ఫెమా ఉల్లంఘన విషయం ఇంకా ఒక కొలిక్కి రానప్పటికీ, ఎగుమతుల సమయంలో జీఎస్టీ నిబంధనలను ఎగవేసిన విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో, జీఎస్టీ చెల్లింపును ఎగవేస్తూ గ్రానైట్ రవాణా చేస్తున్న ఒక నకిలీ ఏజెన్సీ నిర్వాహకుడిని జీఎస్టీ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ (డీజీజీఐ) అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నకిలీ ఏజెన్సీ పేరు మీద రూ.100 కోట్ల విలువైన వేబిల్లులు జారీ చేసినప్పటికీ, ఆ వివరాలను జీఎస్టీ ఫైలింగ్‌లో పేర్కొనలేదు. దీనిని గమనించిన డీజీజీఐ అధికారులు ఆ ఏజెన్సీతో పాటు మరికొన్ని గ్రానైట్ యూనిట్లలో కూడా తనిఖీలు నిర్వహించారు. సదరు ఏజెన్సీ నిర్వాహకుడు తన భార్య మొబైల్ నంబర్‌ను ఉపయోగించి నకిలీ వే బిల్లులు, ఇన్‌వాయిస్‌లు తయారు చేసినట్లు సమాచారం. నిందితుడు ఏజెన్సీని రిజిస్టర్ చేయడానికి తన స్నేహితుడి పాన్, ఆధార్ కార్డు నంబర్‌ను ఉపయోగించినట్లు తెలిసింది. ఈ విషయం డీజీజీఐ విచారణలో వెల్లడైంది. శేర్‌లింగంపల్లి, ఘట్‌కేసర్‌లో అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్‌ను డీజీజీఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజాపూర్‌లో గ్రానైట్ స్లాబులను తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గత కొన్నేళ్లుగా గ్రానైట్ సిండికేట్‌లో కీలక పాత్ర పోషిస్తున్న ఒక వ్యక్తి, జీఎస్టీ ఉల్లంఘనల వెనుక సూత్రధారి అని తెలిసింది. పరిశ్రమలో తనకున్న పలుకుబడిని ఉపయోగించి, అతను నకిలీ వేబిల్లులు, ఇన్‌వాయిస్‌లను సృష్టించేవాడు. డీజీజీఐ అధికారులు మరికొంత మందిని అదుపులోకి తీసుకునేందుకు యోచిస్తున్నారు. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి ఇతర దేశాలకు గ్రానైట్ ఎగుమతి చేసినందుకు కొన్ని గ్రానైట్ యూనిట్లకు ఇటీవల రూ.749 కోట్ల జరిమానా విధించింది. ఈ అంశం ఇంకా విచారణలో ఉండగా, మరో కుంభకోణం వెలుగు చూసింది.



# అదనపు ఆదాయం పెంపుపై దృష్టి సారించండి

**లీకేజీలను అరికట్టి బడ్జెట్ లక్ష్యాలను అందుకోవాలి**

**రిసోర్స్ మొబిలైజేషన్ కేబినెట్ సబ్‌కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క**

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఆదాయ వనరులపై పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో ప్రతిపాదించిన బడ్జెట్ అంచనాలకు అనుగుణంగా నిధుల సమీకరణ జరగాలని స్పష్టం చేశారు. శుక్రవారం సచివాయంలో విక్రమార్క మల్లు అధ్యక్షతన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సభ్యులుగా కలిగిన రిసోర్స్ మొబిలైజేషన్ క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. అదనపు ఆదాయ మార్గాల అన్వేషణ, వివిధ శాఖల ప్రగతిపై సమీక్షించింది. ఈ సందర్భంగా విక్రమార్క మాట్లాడుతూ బడ్జెట్ లక్ష్యాలను చేరుకోవడానికి అధికారులు లీకేజీలను పూర్తిగా అరికట్టాలని స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న అన్ని రకాల ఆదాయ వనరులను పూర్తి స్థాయిలో అందిపుచ్చుకోవాలన్నారు. ముందస్తుగా నిర్దేశించుకున్న క్యాలెండర్ ప్రకారమే అన్ని శాఖల అధికారులు ఆదాయాన్ని పెంపొందించేందుకు శ్రమించాలని సూచించారు. రాష్ట్ర క్యాబినెట్ గతంలో ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నెల 28 నుంచి రాష్ట్రవ్యాప్తంగా సవరించిన (పెంచిన) భూముల మార్కెట్ విలువలు (రిజిస్ట్రేషన్ ధరలు) అమలులోకి రానున్నాయని తెలిపారు. దీని ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేసినట్లు చెప్పారు. అలాగే పరిశ్రమల శాఖకు సంబంధించిన హిల్ట్ పాలసీకి సంబంధించిన మార్గదర్శకాలు సిద్ధమయ్యాయని వివరించారు. వీటికి సంబంధించిన ఉత్తర్వులు తక్షణమే వెలువడనున్నాయని వెల్లడించారు. అనివార్య కారణాలవల్ల ఈ సమావేశానికి రానటువంటి వారు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవ్వాలని ఆదేశించారు. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్లు, మైనింగ్, రెవెన్యూ, రవాణా తదితర కీలక శాఖలలో ప్రస్తుత వనరుల పురోగతి, రాబోయే రోజుల్లో సాధించాల్సిన ఆదాయ లక్ష్యాలపై మంత్రుల బృందం అధికారులకు దిశా నిర్దేశం చేసింది.

## నేడు యాదగిరిగుట్టకు సిఎం రేవంత్‌రెడ్డి

**పర్యటన షెడ్యూల్ ఇదే**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే22:** యాదాద్రి భువనగిరి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం యాదగిరిగుట్టలో పర్యటించ నున్నారు. ఈ సందర్భంగా వేద పాఠశాలకు భూమిపూజ, లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం చేసుకోనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన షెడ్యూల్ విడుదలైంది. శనివారం ఉదయం 8.45 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టకు సీఎం రేవంత్ రెడ్డి బయలుదేరుతారు. అనంతరం 9:15 గంటలకు ప్రతిపాదిత వేద పాఠశాల స్థలానికి చేరుకుంటారు.9:15 నుంచి 9:45 మధ్య వేద పాఠశాలకు భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమంలో సీఎం రేవంత్ పాల్గొంటారు. సరిగ్గా ఉదయం 9:37 గంటలకు ఎస్ఎల్ఎన్ఎస్(శ్రీ లక్ష్మీ నరసింహస్వామి) వేద పాఠశాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. 9:50కు వేద పాఠశాల స్థలం నుంచి లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి బయలుదేరుతారు. 10 గంటలకు దేవాలయానికి చేరుకుంటారు. 10 నుంచి 10:30 వరకూ స్వామివారిని దర్శించుకుంటారు. 10:30కు ప్రెసిడెన్షియల్ సూట్‌కు బయలుదేరి 10:40కి అక్కడికి చేరుకుంటారు. ఉదయం 10:40 నుంచి 11 గంటల వరకు సిఎం రేవంత్ రెడ్డి విశ్రాంతి తీసుకుంటారు. 11 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి 11:10కి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అనంతరం 11:15కు యాదగిరిగుట్ట నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

## సంత్ సేవాలాల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

**సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన లంబాడా ప్రజాప్రతినిధులు**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** లంబాడీల ఆధ్యాత్మిక గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ పేరుతో "సంత్ సేవాలాల్ కార్పొరేషన్" ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని లంబాడా ప్రజాప్రతినిధులు కోరారు. శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ నివాసంలో సిఎంను లంబాడ ప్రజాప్రతినిధులు కలిశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కమిషన్ నుంచి ఎస్టీ కమిషన్‌ను వేరు చేసి ప్రత్యేక హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సీఎంను కలిసిన వారిలో ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు మురళీ నాయక్, రాందాస్ నాయక్, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ , అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, తెలంగాణా గిరిజన డెవలప్మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) చైర్మన్ బెల్లయ్యనాయక్ ఉన్నారు.

## నేపాల్ దొంగలను పట్టుకునేందుకు సిట్ ఏర్పాటు

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** జంట నగరాలలో నేరాలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న నేపాల్ దేశానికి చెందిన దొంగలను పట్టుకునేందుకు సిట్‌ను ఏర్పాటు చేశారు. ఈ మేరకు సిటీ కొత్వాల్ సజ్జనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రశాసన్‌నగర్‌లో వుంటున్న విశ్రాంత ఐపిఎస్ అధికారి వినయ్ రంజన్ రే సతీమణి తనూజను నేపాల్ గ్యాంగ్ హత్య చేయడం దేశ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. ఈ నేరానికి పాల్పడ్డ కల్పన అనే పనిమనిషితో పాటు ఇంకొందరు నేరగాళ్లు ఇప్పటికీ పరారీలో వుండడం తెలిసిందే. దీంతోపాటు నగరంలోని అనేకచోట్ల నేపాల్‌కు చెందిన పనిమనుషులు దొంగలుగా మారి నేరాలకు పాల్పడి పారిపోవడం విదితమే. ఇందులో కూడా అనేకమంది పరారీలో ఉన్నారు. వీరిని పట్టుకునేందుకు 20 మందితో కూడిన సిట్‌ను కమిషనర్ ఏర్పాటు చేశారు. వీరిలో ఇద్దరు ఎస్ఐలు, 17 మంది కానిస్టేబుళ్లు వుంటారు. సిట్ కార్యాలయం కమాండ్ కంట్రోల్‌లో ఉంటుంది. కమిషనర్ దీనిని స్వయంగా పర్యవేక్షిస్తారు.

# రక్షణ రంగం కోసం 'వాయు అస్త్ర' ప్రయోగం సక్సెస్

**జోషిమఠ్, ఉత్తరాఖండ్, మే 22:** రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానాన్ని చాటుతూ పుణెకు చెందిన నిబే లిమిటెడ్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. భారత సైనిక అవసరాలకు తగ్గట్టుగా అత్యంత అత్యాధునికమైన ఆయుధ వ్యవస్థలను రూపొందిస్తూ, దేశ రక్షణ సామర్థ్యాన్ని మరో మెట్టు ఎక్కించింది. తాజాగా ఈ సంస్థ అభివృద్ధి చేసిన వాయు అస్త్ర లాయటరింగ్ అమ్యునిషన్ (ఆత్మహుతి డ్రోన్), సూర్యాస్త్ర రాకెట్ లాంచర్ వ్యవస్థలు జరిపిన ప్రయోగాలు అద్భుత విజయం సాధించాయి.

భారత రక్షణ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం ఎలాంటి ముందస్తు చెల్లింపులు, కొనుగోలు హామీ లేని పద్ధతిలో వాయు అస్త్ర1 పరీక్షలను నిర్వహించారు. రాజస్థాన్‌లోని థార్ ఎడారి (పోఖ్రాన్), ఉత్తరాఖండ్‌లోని మంచు పర్వతాలు జోషిమఠ్ వేదికగా జరిగిన ఈ పరీక్షల్లో వాయు అస్త్ర అమోఘమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది.

ఇజ్రాయెలీ డిజైన్ ఆధారంగా రూపొందించిన ఈ ఆయుధం శత్రువుల స్థావరాలను క్షణాల్లో బూడిద చేయగలదు. గతనెల 18, 19 తేదీల్లో పోఖ్రాన్ రేంజ్‌లో జరిగిన యాంటీపర్సనల్ రెయిడ్ పరీక్షల్లో ఈ డ్రోన్ తన విశ్వరూపాన్ని చూపించింది. 10 కిలోల వార్‌హెడ్‌ను మోసుకెళ్తూ, 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న లక్ష్యాన్ని కేవలం ఒక మీటర్ కన్నా తక్కువ తేడాతో ఒకే ప్రయత్నంలో ఛేదించింది. గ్రౌండ్ కంట్రోల్ స్టేషన్ నుండి 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫార్వార్డ్ కంట్రోల్ సెగ్మెంట్‌కు దీని నియంత్రణను విజయవంతంగా బదిలీ చేశారు. చీకట్లో కూడా శత్రువుల ట్యాంకులను ఇన్‌ఫ్రారెడ్ కెమెరా సాయంతో రెండు మీటర్ల కచ్చితత్వంతో ధ్వంసం చేసింది. ఒకవేళ దాడిని మధ్యలోనే రద్దు చేస్తే, సురక్షితంగా వెనక్కి తిరిగి వచ్చి, మరోసారి దాడికి సిద్ధమయ్యే అద్భుత టెక్నాలజీని ఇది ప్రదర్శించింది.



# మావోయిస్టుల పీడ తొలగడం శుభపరిణామం

**తెలంగాణ పోలీసు అకాడెమీ దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం గర్వకారణం: గవర్నర్ శివప్రతాప్ శుక్లా**

**హైదరాబాద్ (నార్సింగి), మే 22 ప్రభాతవార్త :** భారతదేశానికి మావోయిస్టుల పీడ తొలగిపోవడం శుభపరిణామమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్ల పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ పోలీసు అకాడమి 40వ వార్షికోత్సవ ముగింపు వేడుకలు డైరెక్టర్ అభిలాష బిస్తు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు పోలీసు అకాడమిలో 40వ వార్షికోత్సవ వేడుకలు కన్నుల పండువగా సాగాయి. ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గవర్నర్ శివప్రతాప్ శుక్ల మాట్లాడుతూ దేశ హోంమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకొని వివిధ రాష్ట్రాల పోలీసుల సహకారంతో మావోయిస్టుల పీడ నుంచి దేశ ప్రజలకు విముక్తి కల్పించారని తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా తెలంగాణ పోలీసు అకాడమి అనేక సవాళ్లను ఎదుర్కొని సమాజానికి ఉత్తమ, నిజాయితీ, ధైర్యవంతులు, సమర్థులైన పోలీసు అధికారులను అందించిందని తెలిపారు. ఎప్పటికప్పుడు సమాజంలో ఎదురయ్యే సవాళ్లను స్వీకరిస్తూ వాటిని అధిగమించడంలో తెలంగాణ పోలీసు అకాడమి ముందుంటుందన్నారు. ఈ అకాడమిలో శిక్షణ ఇచ్చిన అధికారులు, శిక్షణ పొందిన అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు. శిక్షణ పొందుతున్న అధికారులు పోలీసు యూనిఫాం బలం కాదని, సమాజం పట్ల బాధ్యత అని భావిస్తూ, నిజాయితీగా, తారతమ్య బేధాలు చూపకుండా విధులు నిర్వహించాలని సూచించారు.

చట్టం ద్వారా లభించే అధికారంతో పాటు ప్రజల విశ్వాసం, సహకారం, గౌరవం లభించినప్పుడే పోలీసు ఉద్యోగానికి నిజమైన అర్థం లభిస్తుందన్నారు. ఆధునిక సాంకేతిక సేవలు వినియోగించుకుంటూ కమాండ్ అండ్ కంట్రోల్, మహిళల భద్రత, కమ్యూనిటీ పోలిసింగ్ వంటి వ్యవస్థలతో తెలంగాణ పోలీసు అకాడమి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిందన్నారు. నూతన సాంకేతికతను వినియోగించుకోవడంతో పాటు కఠినమైన శిక్షణ, దూరదృష్టితో పనిచేసే సామర్థ్యం తెలంగాణ పోలీసింగ్‌లో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్‌క్రైమ్, ఆర్థిక నేరాలు, ఆర్టిఫీషియల్ ఇంటలీజెంట్, అబద్దాలు ప్రచారం చేయడం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయని, వీటిని ఎదుర్కొని ప్రజలకు పోలీసు వ్యవస్థ ఉన్నది అన్న భరోసా కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

# గల్ఫ్ ఎన్ఆర్ఐ బాసటగా పటిష్టమైన విధానం

**భద్రత, సంక్షేమంతో శ్రమదోపిడికి అడ్డుకట్ట: ఆది శ్రీనివాస్**

**హైదారబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం గల్ఫ్ ఎన్ఆర్ఐ సంక్షేమం కోసం ఒక కొత్త పాలసీ రూపొందిచి పొట్ట చేతపట్టుకొని విదేశాలకు వలస వెళ్లిన వారికి భరోసా కల్పిస్తామని దీని కోసం అన్ని రాష్ట్రలలోని మంచి అంశాలను అధ్యాయనం చేస్తున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. గల్ఫ్ ఎన్నారైల భద్రత, సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎన్నారై అడ్వయిజరీ కమిటీ బృందం విజయవాడలో పర్యటించింది. ఎమ్మెల్యే భూపతి రెడ్డి, మేడిపల్లి సత్యం,కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆదిశ్రీనివాస్ మాట్లాడుతూ ప్రవాస తెలంగాణ బిడ్డల హక్కులు, రక్షణ, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ సమగ్రమైన గల్ఫ్ ఎన్నారై పాలసీని తీసుకురావడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందనీ తెలిపారు. గల్ఫ్ కార్మికుల సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామనీ అన్నారు. దళారుల చేతిలో మోసపోకుండా వారికి మంచి వేతనం లభించేలా అవసరమైన శిక్షణ వంటి కూడా ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా అక్కడ ఎవరైనా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొవడానికి , మృత్యువాత పడిన వారికి అక్కడి కంపెనీల నుంచి నష్టపరిహారం వంటివి కుటుంబాలకు ఇవ్వడానికి ఆయా సంస్థల బాధ్యతను అధీకృతం చేయడానికి కూడా పాలసీ తీసుకొస్తామని తెలిపారు.

## హజ్ యాత్రకు 418 మందితో చివరి బృందం

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో 418 మంది యాత్రికులతో కూడిన 23వ, చివరి బృందం హజ్‌కు బయలుదేరింది. దీనికి సంబంధించి హజ్ హౌస్ నుంచి జెండా ఊపి ప్రారంభించారు. అధికారుల వివరాలు ప్రకారం ఈ సంవత్సరం హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టు నుండి 4,725 మంది మహిళలతో సహా 9,685 మంది యాత్రికులు హజ్ యాత్రకు బయలుదేరి వెళ్లారు. వీరిలో తెలంగాణకు చెందిన 6,674 మంది ఉండగా, ఇతర రాష్ట్రాల నుండి కూడా యాత్రికులు ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర హజ్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులతో సమన్వయం చేసుకునేందుకు హజ్ కమిటీ 24 గంటల పాటు ఏడు రోజులూ పనిచేసేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది. ఇది జూన్ 4 వరకు కొనసాగుతుందని ఒక అధికారి తెలిపారు. కాగా హజ్ యాత్రకు వెళ్లాలనుకుంటున్న ముగ్గురి మృతి పట్ల తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ సయ్యద్ గులాం అఫ్జల్ బియాబానీ సంతాపం వ్యక్తం చేస్తూ, వారి స్థానంలో కుటుంబసభ్యులలో ఒకరికి అవకాశం కల్పించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

# హైదరాబాద్‌లో టెస్లా ఇవి కార్ల షోరూం

**పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబుతో సంస్థ ప్రతినిధుల భేటీ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 22:** ఇవి వాహనాల దిగ్గజ సంస్థ టెస్లా త్వరలో హైదారాబాద్ లో విక్రయ, సేవల కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. శుక్రవారం నాడు ఆ సంస్థ ఇండియా ప్రతినిధులను ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయిన సందర్భంగా తాము ఇక్కడ అమ్మకాలు ప్రారంభించేందుకు ఆసక్తితో ఉన్నటు వెల్లడించారు. విద్యుత్తు వాహనాలు, ఇంటెలిజెంట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన అత్యాధునిక సాంకేతికతలతో కూడిన ఎకోసిస్టంను తెలంగాణాలో అభివృద్ధి చేసినట్టు ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ సందర్భంగా తెలిపారు. సెమీ కండక్టర్ డిజైన్, ఆటోమొబైల్ సాఫ్ట్ వేర్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, డీప్ టెక్నాలజీ రంగాలకు ప్రధాన కేంద్రంగా రాష్ట్రం ఎదిగిందని చెప్పారు. హైదరాబాద్‌లో టెస్లా విద్యుత్తు వాహనాల సేల్స్, సర్వీసు సెంటర్లను ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చిన టెస్లా ఇండియా జనరల్ మేనేజర్ శరద్ అగర్వాల్, లీడ్ పబ్లిక్ పాలసీ, బిజినెస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రజత్ లను శ్రీధర్ బాబు ప్రత్యేకంగా అభినందించారు. టెస్లా ఇప్పటి వరకు దేశంలో నాలుగు సేల్స్ షోరూంలను ఏర్పాటు చేయగా తదుపరి కేంద్రంగా హైదరాబాద్‌ను ఎంపిక చేసుకోవడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేసారు. టెస్లా కేవలం ఇవి కార్ల కంపెనీ మాత్రమే కాదని, ఎలక్ట్రిక్ వాహనాల సాఫ్ట్‌వేర్, సెమీకండక్టర్లు, కృత్రిమ మేధస్సు (ఏఐ), రోబోటిక్స్, బ్యాటరీ టెక్నాలజీలు, అధునాతన తయారీ రంగాల్లో నూతన ఆవిష్కరణలను పరిచయం చేసిన సంస్థగా ఎదిగిందని మంత్రి పేర్కొన్నారు. టెస్లా దీర్ఘకాలిక సాంకేతిక లక్ష్యాలకు తెలంగాణలో ఉన్న ఎకోసిస్టం బాగా సరిపోతుందని ఆయన తెలిపారు. నగరంలో ఉన్న సెమీకండక్టర్ సంస్థలు ప్రపంచవ్యాప్తంగా తదుపరి తరం ఎలక్ట్రిక్, స్మార్ట్ మొబిలిటీ వ్యవస్థలకు అవసరమైన చిప్స్, సెన్సార్ల అభివృద్ధిలో కీలకంగా పనిచేస్తున్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం కార్ల మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాల వాటా సుమారు 4 శాతం మాత్రమే ఉందని, ఈ రంగంలో భారీ అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. తెలంగాణ ప్రభుత్వం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించడంతో పాటు, హైదరాబాద్‌ను క్లీన్ టెక్నాలజీ, ఆధునిక మొబిలిటీకి ప్రపంచస్థాయి కేంద్రంగా అభివృద్ధి చేసే సంకల్పంతో ఉందని పేర్కొన్నారు. తెలంగాణలో టెస్లాకు సంబంధించిన అనుబంధ పరిశ్రమల విస్తరణ అవకాశాలను పరిశీలించాలని మంత్రి టెస్లా ప్రతినిధులను కోరారు. పరిశ్రమలు, సాంకేతిక రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. సమావేశంలో ప్రభుత్వ ఐటి సలహాదారు సాయికృష్ణ, టిజిఐఐసి ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ప్రత్యేక కార్యదర్శి రఘురామ శర్మ తదితరులు పాల్గొన్నారు.



# డయాలసిస్ పేషెంట్లకు అండగా ప్రభుత్వం

**కొత్తగా 2,356 మందికి పెన్షన్లు మంజూరు**

**అర్హులందరికీ చేయూత పెన్షన్ అందేలా చర్యలు: మంత్రి సీతక్క**

**జూన్ 2న ఆదర్శ, ఉత్తమ పంచాయతీలకు పురస్కారాలు**

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత డయాలసిస్ పేషెంట్ల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోంది. తీవ్రమైన ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కిడ్నీ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం భరోసాగా నిలుస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తర్వాత ఇప్పటికే 4,710 మంది డయాలసిస్ పేషెంట్లకు చేయూత పెన్షన్లు అందించగా తాజాగా మరో 2,356 మంది డయాలసిస్ బాధితులకు కొత్తగా పెన్షన్లు మంజూరు చేసింది. ఈ ఫైల్‌పై పంచాయతీ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క శుక్రవారం సంతకం చేశారు. దీంతో వచ్చే నెల నుంచి నూతన లబ్ధిదారులు పెన్షన్లు అందుకోనున్నారు. అదేవిధంగా మరో 488 దరఖాస్తులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నాయని, అర్హులైన వారికి త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తామని అధికారులు వెల్లడించారు. డయాలసిస్ చికిత్స కోసం బాధితులు తరుచూ ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుండటంతోపాటు మందులు, ప్రయాణ ఖర్చులు, జీవనోపాధి కోల్పోవడం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందిస్తున్న రూ.2016 చేయూత పెన్షన్ వారికి ఆర్థికంగా ఊరటనిస్తోంది. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. డయాలసిస్ పేషెంట్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం మానవీయ కోణంలో అర్థం చేసుకుంటోందన్నారు. ఆరోగ్య సమస్యలతో పోరాడుతున్న కుటుంబాలకు అండగా నిలవడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నా మన్నారు. అర్హులైన ప్రతి బాధితుడికి పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అదేవిధంగా.. జూన్ 2న అవార్డుల వండు తెలంగాణ అవతరణ దినోత్సవ కానుకగా జూన్ 2న రాష్ట్రంలోని ఉత్తమ, ఆదర్శ గ్రామ పంచాయతీలకు ప్రత్యేక పురస్కారాలు అందజేయనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు. పల్లెల్లో పోటీతత్వాన్ని పెంచి, మరింత అభివృద్ధి వైపు నడిపించేందుకే ఈ అవార్డులు ఇస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

## ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం: కూనంనేని

**హైదారబాద్, మే 22, ప్రభాతవార్త:** మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్‌పై కేసులు పెట్టడాన్ని సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తీవ్రంగా ఖండించారు. రాజకీయ, సామాజిక, ఆర్థిక విశ్లేషకులుగా ప్రొఫెసర్ నాగేశ్వర్ కొనసాగుతున్నారని, ఆయనపై ఆంధ్రప్రదేశ్‌లో కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దశాబ్దాలుగా సామాజిక ఆర్థిక రాజకీయ అంశాలను విశ్లేషిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్న ఆయనను ప్రజా మేధావిగా చూడాలి తప్ప రాజకీయాలతో ముడి పెట్టకూడదన్నారు. ఇటీవల ఆయన చేసిన వ్యాఖ్యలను కొన్ని రాజకీయపక్షాలు తప్పుగా అన్వయించుకున్నాయని కాబట్టి వాటిని ఉపసంహరించుకుంటున్నానని స్వయంగా నాగేశ్వర్ చెప్పినప్పటికీ ఆయనపై కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. ప్రజాస్వామ్యంలో నిష్పాక్షిక విశ్లేషకులు మేధావులు పౌర సమాజ ప్రతినిధుల అభిప్రాయాలను సమాజ సమతుల్యతను పరిరక్షించే కోణంలో చూడాలి తప్ప, వారికి తప్పులను ఆపాదించడం సమంజసం కాదన్నారు.

## 80 శాతం కొనుగోళ్లు ఎక్కడా పూర్తి కాలేదు

**ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి**

**బిజెపి శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి**

**హైదారబాద్, మే 22, ప్రభాతవార్త:** యాసంగి ధాన్యం కొనుగోళ్లు 80 శాతం పూర్తయినట్లు సిఎం రేవంత్‌రెడ్డి చెప్పడం విడ్డూరంగా ఉందని, సిఎం వ్యాఖ్యలు ముమ్మాటికి ప్రజలను తప్పుదోవపట్టించే యత్నమేనని బిజెపి శాసనసభాపక్ష నేత ఎలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్రంలో ఏ గ్రామానికైనా వెళదామని, 80శాతం కొనుగోళ్లు జరిగినట్లు నిరూపించాలని సిఎంకు సవాల్ విసిరారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు కలిసి రాష్ట్రంలోని కొనుగోలు కేంద్రాలను పర్యటించి వడ్ల కొనుగోలు ఎంత జరిగింది?, జొన్నల కొనుగోలు ఎందుకు ప్రారంభించలేదో వంటి విషయాలు తెలుసుకుని ప్రజలు వివరిస్తామన్నారు. మూడు రోజుల్లో పర్యటన వివరాలను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఈ విషయమై శుక్రవారం నాంపల్లిలోని బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు సమస్యలను తెలుసుకోవడంతోపాటు వారు పడుతున్న ఇబ్బందులను ఎదుర్కొనే విషయంలో బీజేపీ భరోసాగా నిలబడుతుందన్నారు.

## వనపర్తి, మంచిర్యాల జిల్లాల్లో సాగునీటి పనులకు నిధుల విడుదల

**హైదరాబాద్, మే 22, ప్రభాతవార్త:** రాష్ట్రంలో గ్రామీణ సాగునీటి వనరులు బలోపేతం చేయడానికి వనపర్తి, మంచిర్యాల జిల్లాలోని చెరువుల మరమ్మతు, ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, శాశ్వత రిపేర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.5.04 కోట్లు మంజూరు చేసింది. మిషన్ కాకతీయ, మైనర్ ఇరిగేషన్ విభాగాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ఈ పనులతో ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతులకు సాగునీటి భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోంది. వనపర్తి జిల్లాలోని మదనాపూర్ మండల పరిధిలో ఉన్న కురుమూర్తి రాయ ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు రూ.1.45 కోట్ల పరిపాలనా అనుమతి ఇచ్చింది. ఊకచెట్టి వాగుపై నిర్మితమైన ఈఎల్ఐ స్కీమ్‌కు సంబంధించిన పంపింగ్ వ్యవస్థ బలహీన పడటం వల్ల సాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో పంప్‌హౌస్ మరమ్మతులు, మోటార్ల మార్పు, పైప్‌లైన్ల పునరుద్ధరణ, విద్యుత్ వ్యవస్థ ఆధునికీకరణ వంటి పనులు చేపట్టే అవకాశం ఉన్నట్లు ఇరిగేషన్ వర్గాలు చెప్పాయి. అదే మండలంలోని రామన్‌పాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ బ్యాక్‌వాటర్‌పై ఉన్న నెలివిడి ఎల్ఐ స్కీమ్ పునరుద్ధరణకు రూ.92 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. పథకంలోని ప్రధాన పంపింగ్ వ్యవస్థ, పంపిణీ నెట్‌వర్క్ బలోపేతం చేయనున్నారు. ఇక మంచిర్యాల జిల్లాలోని నెన్నెల మండలం గంగారం గ్రామ సమీపంలోని ఊర చెరువు (పెద్ద చెరువు) మరమ్మతుకు రూ.1.74 కోట్ల పరిపాలనా అనుమతులు జారీ చేసింది. శాశ్వత మరమ్మతులు చేపట్టాలని అధికారులు ప్రతిపాదించారు.

# నగదు నిర్వహణ ఇబ్బందులకు చెక్

**ప్రభుత్వ వ్యక్తిగత రుణ పరిమితి పెంపు**

**రూ.2,407 కోట్లకు పెంచిన రిజర్వ్ బ్యాంక్**

**ఎక్కువ అడ్వాన్స్‌లపైనే ఖజానా ఆధారం**

**ఆదాయ, వ్యయాల మధ్య అంతరం తగ్గించే యత్నం**

**హైదారబాద్, మే 22, ప్రభాతవార్త:** స్వల్పకాలిక నగదు నిర్వహణలో ఇబ్బందులు పడుతున్న తెలంగాణ ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ పెద్ద ఉపశమనం కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు వ్యక్తిగత రుణం పెంచడంతో పాటు, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ లిమిట్‌ను కూడా పెంచింది. తాత్కాలిక రుణ పరిమితి, వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ రూ.2,407 కోట్లకు పెంపుదల చేసింది. ఆర్థిక శాఖ అధికారవర్గాల సమాచారం మేరకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇప్పటికే ఉన్న రూ.60,118 కోట్ల వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ పరిమితిని రూ.61,008 కోట్లకు సవరించాలన్న రిజర్వ్ బ్యాంక్ నిర్ణయానికి అనుగుణంగా తెలంగాణకు కూడా ఈ పెంపు జరిగింది. ఫలితంగా, తెలంగాణ యొక్క వ్యక్తిగత పరిమితిని ఇప్పటి వరకూ రూ.2,300 కోట్లు ఉండగా, దాన్ని తాజాగా రూ.2,407 కోట్లకు పెంచింది. దీనివల్ల ఆదాయా, చెల్లింపుల మధ్య తాత్కాలిక వ్యత్యాసం ఉన్న సమయాల్లో తెలంగాణ ఖజానా నుండి తక్షణ ఖర్చుల అవసరాలను తీర్చగల సామర్థ్యం బలపడుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి. కాగా ఆదాయ, వ్యయం మధ్య స్వల్పకాలిక అంతరాలను పూడ్చుడానికి రిజర్వ్ బ్యాంక్ అడ్వాన్స్‌లపై రాష్ట్రం ఎక్కువగా ఆధారపడుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ రుణాలకు సంబంధించినలో పరిమితి గణనీయమైన వృద్ధిని సాధించింది. 2014లో ఈ పరిమితి రూ.550 కోట్లుగా ఉండగా, రాష్ట్ర ఆదాయ ప్రొఫైల్, మూలధన వ్యయం ఆధారంగా 2016లో దీనిని రూ.1,080 కోట్లకు రిజర్వ్ బ్యాంక్ పెంచింది. ఇది దాదాపు 96.4 శాతం పెరుగుదలను సూచిస్తుంది. 2020లో దీనిని మరింతగా రూ. 1,728 కోట్లకు, ఆ తర్వాత 2026లో ప్రస్తుత స్థాయి అయిన రూ. 2,407 కోట్లకు చేరుకుంది. ఈ స్థిరమైన పెరుగుదల రాష్ట్ర ఆర్థిక కార్యకలాపాల విస్తరణను మరియు నగదు ప్రవాహ హెచ్చుతగ్గులను నిర్వహించడానికి ద్రవ్య మద్దతు అవసరం పెరుగుతున్న విషయాన్ని నొక్కి చెబుతుంది. కాగా ఈ వేస్ అండ్ మీన్స్ అడ్వాన్స్ అనేది రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్వల్పకాలిక నగదు కొరతను అధిగమించడానికి ఆర్‌బిఐ తాత్కాలిక రుణాలుగా అందించే ఆర్థిక సాయం. ఈ అడ్వాన్స్‌లు నగదు రాబడి, ఖర్చుల మధ్య సమయ వ్యత్యాసాలను పూడ్చుడానికి ఉద్దేశించబడ్డాయి. కానీ ఇవి దీర్ఘకాలిక ఆర్థిక సహాయ యంత్రాంగంగా ఉపయోగపడటానికి ఉద్దేశించినవి కావు. డబ్ల్యూఎంఏ కింద తీసుకున్న మొత్తాన్ని 90 రోజులలోపు తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. దీనికి గాను వసూలు చేసే వడ్డీ ప్రస్తుత రెపో రేటుకు అనుగుణంగా ఉంటుంది. ఈ సౌకర్యం ప్రభుత్వాలు నగదు కొరత కారణంగా నిత్య వ్యయాలలో అంతరాయాలను నివారించి, అవసరమైన సేవల సజావుగా నిర్వహణను కొనసాగించడానికి వీలు కల్పించనుందని ఆర్థిక శాఖ అధికారవర్గాలు వెల్లడించాయి.

# ఐఏఎస్‌ల పిల్లలకూ ఇంకా రిజర్వేషన్లా?

## ఉన్నత స్థానాలకు చేరిన కుటుంబాలు కోటా ఆశించడమేమిటి?

## సమాజంలోని చివరి వ్యక్తికీ రిజర్వేషన్ ఫలాలు అందాలి

## జస్టిస్ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్ వ్యాఖ్యలు

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీం నోటీసులు



**న్యూఢిల్లీ, మే 22:** దేశంలో రిజర్వేషన్లు, క్రీమీ లేయర్ అంశాలపై భారత సుప్రీంకోర్టు శుక్రవారం సంచలన వ్యాఖ్యలు చేసింది. విద్య, ఆర్థిక రంగాల్లో ఇప్పటికే ఉన్నత స్థానాలకు చేరుకున్న కుటుంబాలు, ఇంకా కోటా ప్రయోజనాల కోసం పట్టుబట్టడాన్ని న్యాయస్థానం తీవ్రంగా ప్రశ్నించింది. రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. "తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకు?" అని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. వెనుకబడిన వర్గాల్లోని "క్రీమీలేయర్" (ధనిక, ఉన్నత శ్రేణి) పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి (సోషల్ మొబిలిటీ) లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం కోటాను ఆశించడం సరికాదు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉంది' అని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత (బ్యాలెన్స్) అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుతం ఓబిసిలకే పరిమితమైన 'క్రీమీ లేయర్' నిబంధనలను, మరింత శాస్త్రీయంగా అమలు చేయడంపై న్యాయస్థానం దృష్టి సారించింది. ఇంద్ర సాహ్నీ తీర్పును ప్రస్తావిస్తూ, ప్రస్తుత నిబంధనలు 1992 నాటి చారిత్రాత్మక 'ఇంద్ర సాహ్నీ' (మండల్ కమిషన్) కేసులో సుప్రీంకోర్టు ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లను సమర్థిస్తూనే, వారిలో 'క్రీమీలేయర్' వర్గాలను మినహాయించాలని స్పష్టం చేసింది. ప్రస్తుతం వార్షిక ఆదాయం రూ.8 లక్షలు దాటిన వారితో పాటు ఉన్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు, ఐఏఎస్, ఐపిఎస్ వంటి సీనియర్ బ్యూరోక్రాట్లు, మిలిటరీలో టాప్ ఆఫీసర్ల పిల్లలను ఆదాయంతో సంబంధం లేకుండా క్రీమీలేయర్ కింద పరిగణించి కోటా నుంచి మినహాయిస్తున్నారు. అయితే, ఈ మినహాయింపులను సవాల్ చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక, ఈ కేసులో సుప్రీంకోర్టు.. కేంద్ర, కర్ణాటక ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను వాయిదా వేసింది.



# చొరబాట్ల కట్టడికి స్మార్ట్ బోర్డర్‌ప్రాజెక్టు!

## కేంద్ర హోంమంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, మే 22:** దేశంలోకి భూమార్గం ద్వారా అక్రమ చొరబాట్లను నివారించేందుకు త్వరలో దేశ సరిహద్దుల్ని స్మార్ట్ బార్డర్ ప్రాజెక్ట్ పరిధిలోకి మార్చనున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడించారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన ఒక కార్యక్రమంలో అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడారు. త్వరలో స్మార్ట్ బార్డర్ ప్రాజెక్ట్ చేపట్టనున్నట్లు వెల్లడించారు. సరిహద్దుల్లో రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం చేసేందుకు సాంకేతికతను ఉపయోగించుకుంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్ సరిహద్దుల నుంచి అక్రమ చొరబాట్లను ఆపేందుకు ఆధునిక నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. అత్యాధునిక సెక్యూరిటీ కెమెరాలు, రాడార్లు, సెన్సర్లు, సర్వైలెన్స్ టూల్స్, రియల్ టైమ్ మానిటరింగ్ ప్లాట్‌ఫామ్స్ వంటివి ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బంగ్లా, పాక్ సహా అంతర్జాతీయ సరిహద్దు కలిగి ఉన్న వివిధ రాష్ట్రాల్లో ఇందుకోసం ప్రత్యేకంగా భూమిని కేటాయిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాదిలోనే వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకోసం పశ్చిమ బెంగాల్‌లో కూడా ప్రభుత్వం భూమిని కేటాయించిందన్నారు. కొత్త నిర్మాణాల ద్వారా అక్రమ చొరబాట్లను వెంటనే గుర్తించి అడ్డుకోవచ్చన్నారు. సరిహద్దులో డ్రోన్ యాక్టివిటీస్, పశువులు అక్రమ రవాణా, డ్రగ్ ట్రాఫికింగ్ సహా ఎలాంటి అనుమానాస్పద కదలికలనైనా వెంటనే గుర్తించవచ్చని తెలిపారు. ఎలాంటి చొరబాటు, చర్యను గమనించినా వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి అలర్ట్ వెళ్తుందని వెల్లడించారు. దేశానికి ఐదు దశాబ్దాలుగా ఉన్న నక్సల్స్ సమస్య ముగింపు దశకు చేరుకుందన్నారు. త్వరలో ఇండియా నక్సల్ ఫ్రీ దేశం అవుతుందని అభిప్రాయపడ్డారు. మన సైన్యం ఈ విషయంలో తమ సత్తా చాటిందని, సమస్యను కూకటివేళ్లతో సహా పెకిలించామని చెప్పుకొచ్చారు. పాకిస్తాన్ ఉగ్ర చర్యలకు పాల్పడిన ప్రతిసారీ ఇండియా ఘాటుగా స్పందించిందన్నారు. తమ హయాంలో మూడుసార్లు పాక్‌కు సమాధానం చెప్పామని అమిత్ షా వివరించారు. రాష్ట్రాలు, కేంద్రం కలిపి సరిహద్దులో భద్రతను కట్టుదిట్టం చేస్తున్నాయని తెలిపారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్ నుంచి ఇండియాలోకి అక్రమంగా చొరబడుతున్న సంగతి తెలిసిందే.

# కొడుకు పెళ్లికి వెళ్తానో .. లేదో!

## భద్రతా కారణాల రీత్యా సందేహిస్తున్న ట్రంప్



**వాషింగ్టన్, మే 22:** ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో జరగనున్న తన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ పెళ్లికి తాను హాజరుకాకపోవచ్చని పేర్కొన్నారు. ఆ వేడుకకు హాజరైనా.. హాజరుకాకపోయినా తప్పుడు వార్తలతో తనను చంపేస్తారని చమత్కరించారు. అందుకే వివాహానికి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని.. అయితే ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలు, భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో అది కష్టంగా మారే అవకాశం ఉందని తెలిపారు. 48 యేళ్ల డొనాల్డ్ ట్రంప్ జూనియర్ ఈ వారాంతంలో తన ప్రియురాలు బెట్టినా ఆండర్సన్‌ను వివాహం చేసుకోనున్నారు. ఈ వేడుక బహామాస్‌లో జరగనుంది. భద్రతా కారణాల దృష్ట్యా ఈ వివాహానికి సన్నిహితులను మాత్రమే ఆహ్వానిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా ట్రంప్ జూనియర్ 2005లో వెనెసాను వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వీరి మధ్య విభేదాలు రావడంతో 13 యేళ్ల తమ వైవాహిక బంధానికి స్వస్తి పలుకుతూ 2018లో విడాకులు తీసుకున్నారు. వీరికి ఐదుగురు సంతానం. 2020లో ట్రంప్ జూనియర్‌కు ఫాక్స్‌న్యూస్ మాజీ హోస్ట్ కింబర్లీతో నిశ్చితార్థం జరగ్గా.. తర్వాత దానిని రద్దు చేసుకున్నారు. తర్వాత మోడల్, సామాజికవేత్త అయిన బెట్టినా ఆండర్సన్‌తో ట్రంప్ జూనియర్ గతేడాది ఎంగేజ్‌మెంట్ చేసుకున్నారు.

# బలూచ్ దెబ్బకు వ్యూహం మారుస్తున్న షరీఫ్ సర్కార్

- లష్కరేనేతలతో దౌత్యం నెరపేందుకు కసరత్తులు
- హాఫీజ్ స్థానంలో కొత్త నేత ఎంపికకు ఒత్తిళ్లు



**ఇస్లామాబాద్, మే 22:** భారత సైన్యం జరిపిన ఆపరేషన్ సిందూర్ దెబ్బకు పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థ కోలుకోలేని విధంగా దెబ్బతింది. మురిద్కేలో ఉన్న ప్రధాన శిక్షణా కేంద్రాన్ని భారత సైన్యం పూర్తిగా ధ్వంసం చేసింది. దీంతో తీవ్ర నష్టాల్లో ఉన్న ఈ ఉగ్ర సంస్థను మళ్లీ బలోపేతం చేసేందుకు ఈసారి పాకిస్థాన్ సైన్యంతో పాటు అక్కడి రాజకీయ నాయకులూ రంగంలోకి దిగారు. లష్కరే తోయిబా వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ కుమారుడు తల్హా సయీద్, పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ముఖ్య అనుచరుడు రాణా సనావుల్లాతో ఫైసలాబాద్‌లో భేటీ అయ్యాడు. దీనిపై భారత నిఘా సంస్థలు దృష్టి పెట్టాయి. పాక్ సైన్యం, ఐఎస్ఐపై లష్కరే ఉగ్రవాదులకు నమ్మకం సడలడంతోనే పాక్ ప్రభుత్వం నేరుగా రాజకీయ నేతలను రంగంలోకి దించి ఈ చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లష్కరే తోయిబాకు కొత్త నాయకుడిని అధికారికంగా ప్రకటించాలని పాక్ రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం 75 ఏళ్ల హాఫీజ్ సయీద్ వయసు పైబడటం, సంస్థలో తీవ్ర అసంతృప్తి నెలకొనడంతో నాయకత్వ సంక్షోభం ఏర్పడింది. అందుకే 50 ఏళ్ల తల్హా సయీద్‌ను అధికారికంగా ఆపరేషన్స్ చీఫ్‌గా మార్చాలని చూస్తున్నారు. కొత్త టెక్నాలజీలపై పట్టున్న తల్హా అయితేనే ఉగ్రవాదులను నడిపించగలడని పాక్ భావిస్తోంది. బలూచిస్థాన్ సమస్యకు లష్కరే పరిష్కారమా పాకిస్తాన్‌కు బలూచిస్థాన్, ఖైబర్ పఖ్తూంక్వా ప్రాంతాల్లో భద్రత కల్పించడం పెద్ద సవాలుగా మారింది. ముఖ్యంగా బలూచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులతో పాక్ సైన్యం తీవ్రంగా నష్టపోతోంది. బీఎల్‌ఏ గ్రూపులు పాక్ ప్రభుత్వం లేదా సైన్యంతో చర్చలకు అస్సలు అంగీకరించవు. అందుకే లష్కరే తోయిబా నేతలను రాయబారానికి పంపి బీఎల్‌ఏతో ఒప్పందం కుదుర్చుకోవాలని చూస్తోంది. బలూచిస్థాన్ మీదుగా వెళ్లే చైనాపాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ ఫేజ్2 ప్రాజెక్ట్‌కు భద్రత కల్పించడం పాక్‌కు ముఖ్యం. బలూచిస్థాన్‌లోని మైనింగ్ ప్రాజెక్ట్ కోసం అమెరికా 1.3 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టింది. స్థానిక వనరులను దోచుకుంటున్నారంటూ బలూచ్ ప్రజలు ఈ ప్రాజెక్టులను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



# ఆఫ్రికాకు తలనొప్పిగా మారిన ఎబోలా కట్టడి

**బ్రజ్జావిల్లే, మే 22:** ఆఫ్రికా దేశాల్లో ఎబోలా వ్యాప్తి తీవ్ర కలకలం సృష్టిస్తోంది. వైరస్‌తో పాటు తప్పుడు సమాచార వ్యాప్తి ఇక్కడి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. మృతదేహాన్ని అప్పగించలేదని ఎబోలా చికిత్సా కేంద్రానికి స్థానికులు నిప్పంటించడం అందుకు ఉదాహరణ. ప్రస్తుత వ్యాప్తికి కేంద్రంగా ఉన్న కాంగోలోని ర్వాంపారా ప్రాంతంలో ఈ ఘటన చోటు చేసుకుంది. వైరస్ ప్రతిస్పందన విషయంలో ప్రజల్లో నెలకొన్న అపనమ్మకం, ఆగ్రహం ఈ పరిస్థితికి కారణమైంది. 1976లో కాంగోలో తొలిసారి ఎబోలా వైరస్‌ను గుర్తించగా, ఇప్పుడు 17వసారి వ్యాప్తి చెందుతోంది. పాజిటివిటీ రేటు.. వైరస్ బారిన పడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ వైరస్‌కు ప్రత్యేకంగా ఆమోదించిన చికిత్సలు, వ్యాక్సిన్‌లు లేకపోవడం వల్ల దీనిని వెంటనే అరికట్టడం కూడా అసాధ్యమని పేర్కొన్న ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ.. గ్లోబల్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలాంటి సమయంలో వైరస్ కట్టడికి వైద్య సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. కానీ, కాంగో తరహా ఘటనలు వారికి తలనొప్పిగా మారాయి. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఎబోలా లక్షణాలతో ఓ వ్యక్తి మృతి చెందగా, అతని మృతదేహాన్ని అప్పగించేందుకు వైద్య సిబ్బంది నిరాకరించడం స్థానిక యువత ఆగ్రహానికి గురైంది. దీంతో వారు వైద్య కేంద్రంలోకి జొరబడి, నిప్పంటించారు. పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. మామూలుగా ఎబోలా వైరస్ జంతువులు, గబ్బిలాలకు సోకుతుంది. ఆ వరస్ సోకిన జంతువులను వేటాడి (బుష్‌మీట్) తినడం వల్ల మనుషులకు చేరుతుంది. వ్యాధి లక్షణాలు కనిపించడానికి 21 రోజులు పడుతుంది. వైరస్ సోకి వ్యక్తి శరీర ద్రవాల ద్వారా ఇది ఇతరులకు వ్యాపిస్తుంది. ఆ వైరస్ లక్షణాలతో చనిపోయిన వ్యక్తి మృతదేహాన్ని పిపిఇ కిట్లు ధరించిన ప్రత్యేక బృందాలు ఖననం చేయాలని అంతర్జాతీయ వైద్య సంస్థలు.

# హిందూదేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాల్ చేస్తూ పిటిషన్

## తామే మొత్తం విచారణచేస్తామని సుప్రీం ధర్మాసనం స్పష్టీకరణ

**న్యూఢిల్లీ, మే 22** తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో హిందూ దేవాలయాలపై ప్రభుత్వ నియంత్రణ చట్టాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై హైకోర్టును ఆశ్రయించాలంటూ గత ఏడాది ఏప్రిల్‌లో ఇచ్చిన ఆదేశాలను సుప్రీంకోర్టు వెనక్కి తీసుకుంది. దేవాలయాలపై ప్రభుత్వాల నియంత్రణ చట్టాలపై విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దక్షిణ భారతదేశంలోని హిందూ దేవాలయాలను ప్రభుత్వాలు తమ అధీనంలో ఉంచుకోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన కీలక పిటిషన్ల విచారణకు సుప్రీంకోర్టు శుక్రవారంనాడు అంగీకరించింది. కేసును హైకోర్టులకు బదిలీ చేస్తూ గతంలో ఇచ్చిన పాత ఆదేశాలను జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ సతీశ్ శర్మతో కూడిన ధర్మాసనం రద్దు చేసింది. చట్టాల చెల్లుబాటుపై జూలై 24 నుంచి మెరిట్స్ ఆధారంగా తామే తుది విచారణ జరుపుతామని ధర్మాసనం స్పష్టంచేసిం. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరిలో హిందూ ధార్మిక సంస్థల నియంత్రణ చట్టాలను పిటిషన్లరు సవాలు చేశారు. కేవలం హిందూ ఆలయాలనే నియంత్రించడం రాజ్యాంగం కల్పించిన మతస్వేచ్ఛ, సమానత్వ హక్కులకు విరుద్ధమని తమ పిటిషన్‌లో స్వామి దయానంద సరస్వతి ట్రస్ట్ పేర్కొంది. ఆలయాల హుండీ ఆదాయం, మిగులు నిధులను ప్రభుత్వాలు ఇతర కార్యకలాపాలకు మళ్లించడంపై పలువురు పిటిషనర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. సామాజిక సమానత్వం, నిధుల అవినీతిని అరికట్టేందుకే ఆలయాల నిర్వహణలో ప్రభుత్వాలు జోక్యం చేసుకుంటున్నాయని రాష్ట్రాలు వాదన వినిపించాయి. ఈ క్రమంలో న్యాయంకోసం హైకోర్టును ఆశ్రయించాలంటూ గతంలో ఆదేశించిన సుప్రీంకోర్టు ఇపుడు తామే స్వయంగా విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో కేంద్ర ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఏకీభవించారు. వేర్వేరు హైకోర్టుల కంటే సుప్రీంకోర్టు తేల్చడమే సముచితమని పేర్కొన్నారు.

# సిఎం విజయ్‌కేబినెట్‌లో మరో ఇద్దరికి చోటు!



**చెన్నై, మే 22:** తమిళనాడులో ముఖ్యమంత్రి విజయ్ సారథ్యంలోని టీవీకే ప్రభుత్వం శుక్రవారంనాడు ప్రభుత్వంలో మరో ఇద్దరికి చోటు కల్పించింది. టీవీకేకు బయట నుంచి మద్దతిస్తామని ఇంతకుమందు ప్రకటించిన విడుదలై చిరుతైగళ్ కట్చి (విసికె), ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) అధికార కూటమిలో చేరాయి. పాపనాశం అసెంబ్లీ నియోజకవర్గం ఐయూఎంఎల్ ఎమ్మెల్యే ఏఎం షాజహాన్, తిండివనం నియోజకవర్గం వీసీకే ఎమ్మెల్యే వన్ని అరసు శుక్రవారంనాడు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. టీవీకే ప్రభుత్వం కీలకమైన మంత్రివర్గ విస్తరణ గురువారంనాడు జరిపింది. వీసీకే, ఐయూఎంఎల్‌ను కూడా ప్రభుత్వంలో చేరాలని కోరింది. అయితే పేర్ల ఖరారు విషయంలో ఆ రెండు పార్టీలు జాప్యం చేశాయి. దీంతో 23 మంది ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో కాంగ్రెస్‌కు చెందిన ఇద్దరు, టీవీకేకు చెందిన 21 మంది ఉన్నారు. దీనికంటే ముందు ముఖ్యమంత్రితో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు క్యాబినెట్ మంత్రులుగా ప్రమాణ స్వీకారం ప్రమాణస్వీకారం చేశారు. మొత్తం 35 మందికి క్యాబినెట్‌లో అవకాశం రెండు ఖాళీలు మిగిలాయి. వీసీకే, ఐయూఎంఎల్ తాజాగా ప్రభుత్వంలో చేరడంలో మంత్రి కొలువుల భర్తీ పూర్తయింది. ఇటీవల అసెంబ్లీలో ప్రభుత్వ విశ్వాస తీర్మానికి అనుకూలంగా ఓటు వేసిన అన్నాడీఎంకే రెబల్ వర్గానికి చెందిన 25 మంది ఎమ్మెల్యేలకు టీవీకే ప్రభుత్వంలో చోటు దక్కలేదు. మంత్రివర్గ విస్తరణ సందర్భంగా రెబల్ ఎమ్మెల్యేలలోని తొమ్మది మంది షణ్ముగం వర్గానికి దూరంగా ఉండిపోయారు. రాబోయే రోజుల్లో చాలామంది పార్టీ తిరుగుబాటు ఎమ్మెల్యేలు వెనక్కి తీరిగి వస్తారని అన్నాడీఎంకే గట్టి నమ్మకంతో ఉంది.

# పాకిస్థాన్‌కూ ఎగబాకిన సోషల్ మీడియా కాక్రోచ్‌పార్టీ ట్రెండ్!




**కరాచి, మే 22:** భారత్‌లో సంచలనం సృష్టిస్తున్న 'కాక్రోచ్ జనతా పార్టీ డిజిటల్ ట్రెండ్ ఇప్పుడు పాకిస్థాన్‌కూ పాకింది. అక్కడ కూడా కాక్రోచ్ అవామీ పార్టీ కాక్రోచ్ అవామీ లీగ్ వంటి కొత్త గ్రూపులు సోషల్ మీడియాలో పుట్టుకొచ్చాయి. నిరుద్యోగ యువత వేదికగా సాగుతున్న ఈ పొలిటికల్ ట్రెండ్ ఇరు దేశాల్లోనూ హాట్ టాపిక్‌గా మారింది. పాక్‌లో ప్రధాన రాజకీయ పార్టీలైన ఇమ్రాన్ ఖాన్ నేతృత్వంలోని పీటీఐ, నవాజ్ షరీఫ్ పీఎంఎల్ఎన్, పీపీపీలకు ప్రత్యామ్నాయంగా ఈ'కాక్రోచ్ పార్టీలు రంగంలోకి దిగుతున్నాయి. కాక్రోచ్ అవామీ పార్టీ తమ ఇన్‌స్టా బయోలో అవును కాపీ కొట్టాం, కానీ ఎవరికి నష్టం? మా మోటో ఒక్కటే అంటూ భారత్ నుంచి స్ఫూర్తి పొందినట్లు బాహాటంగానే అంగీకరించింది. ఈ అకౌంట్లు పూర్తిగా పాక్ నిరుద్యోగ జనరేషన్ జెడ్ యువత గొంతుకగా మారుతామని ప్రకటిస్తున్నాయి. వ్యవస్థ ఎవరినైతే బొద్దింకలుగా భావించిందో.. మేం ఆ ప్రజల గొంతుకల్గ అంటూ ఎలాంటి పరిస్థితుల్లోనైనా పోరాడతాం అనే ఉర్దూ నినాదంతో పాక్ యువత సోషల్ మీడియాలో హోరెత్తిస్తోంది. నిరుద్యోగం, దేశ పాలన, రాజకీయ వ్యవస్థలపై తమకున్న అసంతృప్తికి ఈ బొద్దింక గుర్తును వాడుకుంటూ మీమ్స్ రూపంలో అక్కడి ప్రభుత్వాలపై నిరసనగా వ్యక్తం చేస్తోంది

## కేన్స్ ఫిలింఫెస్ట్‌లో మిస్ వెనిజులాపై దాడి

**న్యూయార్కు,మే 22:** ప్రపంచ ప్రఖ్యాత కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తీవ్ర కలకలం రేగింది. మిస్ వెనిజులా 2025 టైటిల్ విజేత ఆండ్రియా డెల్ వాల్‌పై ఆమె సెలబ్రిటీ స్టైలిస్ట్ గియోవన్నీ లగునా భౌతిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనకు సంబంధించి వెనెజులా, మెక్సికన్ మీడియా కథనాలను ఉటంకిస్తూ న్యూయార్క్ పోస్ట్ ఒక కథనాన్ని ప్రచురించింది. మంగళవారం కేన్స్‌లోని ఒక హోటల్ గదిలో ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. దాడి అనంతరం 29 ఏళ్ల ఆండ్రియా డెల్ వాల్ తన ముఖానికి అయిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో ఒక వీడియోను షేర్ చేశారు. ఆ వీడియోలో ఆమె ముఖం నుంచి రక్తం కారుతుండగా, తీవ్ర ఆవేదనతో కనిపించారు. స్పానిష్ భాషలో మాట్లాడుతూ, చూడండి, గియోవన్నీ లగునా నాకు చేసిన పని ఇది. కంగ్రాట్స్ గియోవన్నీ, నువ్వు ఎవరో చూపించడానికే ఇది చేశావని ఆమె తన స్టైలిస్ట్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వీడియోలో ఆ హోటల్ గది మొత్తం చిందరవందరగాపడి ఉండటం కనిపించింది.



# ట్విషా శర్మ మృతి కేసు: సిబిఐ విచారణ

- మధ్యప్రదేశ్ ప్రభుత్వం సిఫార్సు
- రీపోస్టుమార్టంకు హైకోర్టు అనుమతి
- నిందితుడు లొంగిపోయేందుకు యత్నం

**భోపాల్, మే 22:** తెలుగు సినీ నటి ట్విషా శర్మ విషాద మరణంపై సిబిఐ విచారణకు మధ్యప్రదేశ్ ప్రభుత్వం శుక్రవారం సిఫార్సు చేసింది. కేంద్ర దర్యాప్తు సంస్థతో స్వతంత్ర విచారణ జరపాలని ఆమె కుటుంబం పదేపదే చేస్తున్న డిమాండ్‌కు ప్రభుత్వం తలొగ్గి, ఒక కీలక పరిణామంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే 12న ట్విషా శర్మ భోపాల్‌లోని తన అత్తగారి ఇంటి డాబాపై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై మృతురాలి కుటుంబం అనుమానాలు వ్యక్తం చేస్తూ హైకోర్టును ఆశ్రయించింది. ఇటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను కలిసి ట్విషా శర్మ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలోనే ట్విషా శర్మ మృతి కేసును సిబిఐకి అప్పగించాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర హోం కార్యదర్శికి, న్యూఢిల్లీలోని సిబిఐ డైరెక్టర్‌కు లేఖలు రాసింది. ట్విషా శర్మ మృతదేహానికి రెండోసారి పోస్ట్‌మార్టం.

# సంక్షిప్తంగా..

## సగం అమెరికా వైమానిక రక్షణ క్షిపణులు ఖాళీ



**వాషింగ్టన్, మే 22:** ఇరాన్‌తో యుద్ధంలో ఇజ్రాయెల్‌కు మద్దతుగా నిలిచే క్రమంలో అమెరికా భారీగా తన క్షిపణి నిల్వలు కోల్పోయినట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు దాని అమ్ములపొదిలోని సగం ఎయిర్ డిఫెన్స్ క్షిపణులు ఖాళీ అయినట్లు సమాచారం. ఈ మేరకు మీడియాలో కథనాలు వస్తున్నాయి. వాటి ప్రకారం.. ఇరాన్‌పై అమెరికా 200కు పైగా థాడ్ క్షిపణులను ప్రయోగించింది. వీటితోపాటు మధ్యధరా సముద్రంలో మోహరించిన యుద్ధనౌకల నుంచి 100కుపైగా స్టాండర్డ్ మిసైల్-3, స్టాండర్డ్ మిసైల్-6లను వినయోగించింది. దీంతో పెంటగాన్ వద్ద ఉన్న ఇంటర్‌సెప్టర్ నిల్వలు సగానికి పడిపోయాయి. అమెరికా వద్ద ఇంకా సుమారు 200 థాడ్ ఇంటర్ సెప్టర్‌లు మాత్రమే మిగిలి ఉన్నట్లు తెలుస్తోంది.

## ఉమర్ ఖలీద్‌కు 3 రోజుల బెయిల్!



**న్యూఢిల్లీ, మే 22:** ఢిల్లీ అల్లర్ల కేసులో ప్రధాన నిందితుడు ఉమర్ ఖలీద్‌కు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరుచేశారు. ఢిల్లీ హైకోర్టు శుక్రవారం ఖలీద్‌కు బెయిల్ జారీ చేసింది. ఖలీద్ తల్లికి వైద్య చికిత్స జరగాల్సి ఉంది, ఈ నేపథ్యంలో తల్లిని చూసేందుకు కోర్టు అతనికి అనుమతి ఇచ్చింది. జస్టిస్ ప్రతిభా ఎం సింగ్, జస్టిస్ మధూ జైన్‌తో కూడిన ధర్మాసనం ఈ ఆదేశాలు జారీ చేసింది. విస్తృతమైన కోణంలో ఈ సమస్యను పరిశీలించి, తల్లికి సర్జరీ ఉన్న నేపథ్యంలో ఉమర్ ఖలీద్‌కు మూడు రోజుల తాత్కాలిక బెయిల్ మంజూరీ చేస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. జూన్ ఒకటో తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు బెయిల్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో ఖలీద్ తన తల్లితో గడపనున్నాడు. బెయిల్ సమయంలో ఖలీద్ తన అడ్రెస్‌లోనే ఉండాలని కోర్టు స్పష్టం చేసింది.

## భోజ్‌శాలను టచ్‌చేసి చూడండి తెలుస్తుంది: ఎస్పీ



**భోజ్‌శాల, మే 22:** మధ్యప్రదేశ్‌లోని భోజ్‌శాల వివాదాస్పద కట్టడం కేవలం హిందూ దేవాలయమేనని మే 15న రాష్ట్ర హైకోర్టు తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. అంతకుముందు వరకు అక్కడ ప్రతి శుక్రవారం ముస్లింలు నమాజ్ చేసుకునేందుకు అనుమతి ఉండేది. అయితే కోర్టు తీర్పు తర్వాత వస్తున్న మొదటి శుక్రవారం కావడంతో అక్కడ ఉద్రిక్తతలు తలెత్తకుండా పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ధార్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ సచిన్ శర్మకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఆయన జీపుపై నిలబడి అల్లరి మూకలను గట్టిగా హెచ్చరించారు. ఎవరికైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవాలనే ధైర్యం ఉంటే, శుక్రవారం ప్రయత్నించి చూడండి. మేము పూర్తిగా సిద్ధంగా ఉన్నాం. ఎవరినీ వదిలిపెట్టం అంటూ ఎస్పీ సవాల్ విసిరారు.

## ఎవరెస్ట్ అధిరోహించి తిరిగి వస్తూ ఇద్దరు భారతీయులు మృతి

**ఖాట్మండు, మే 22:** నేపాల్‌లో ఎవరెస్ట్ శిఖరాన్ని ఎక్కిన ఇద్దరు భారతీయులు మృతిచెందారు. ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఆ ఇద్దరు ప్రాణాలు కోల్పోయినట్లు శుక్రవారం తెలిసింది. నేపాల్ పర్వతారోహణ అధికారి రిషి భండారి వివరాలప్రకారం ఎవరెస్ట్ నుంచి కిందకు దిగుతున్న సమయంలో ఓ పర్వతారోహకుడు తీవ్రంగా అలసిపోయినట్లు చెప్పారు. అయితే అతని ప్రాణాలను కాపాడేందుకు షెర్పాలు తీవ్రంగా ప్రయత్నించినట్లు తెలిపారు. హిల్లరీ స్టెప్ వద్ద అరుణ్ తివారి అనే పర్వతారోహకుడు మృతిచెందినట్లు భండారి చెప్పారు. సందీప్ ఆరె అనే వ్యక్తి రెండో క్యాంప్ వద్ద ప్రాణాలు కోల్పోయాడు. ఎవరెస్ట్‌ను అత్యధికంగా 32 సార్లు అధిరోహించిన నేపాలీ షెర్పా కామి రీటా ఇవాళ అభ్యర్థన చేశారు.

## మిస్టరీ వీడిన స్లీపర్‌కోచ్ మృతదేహం బాక్స్

**లక్నో, మే 22:** రైలు స్లీపర్ కోచ్‌లో వదిలేసిన పెట్టెలోని యువతి మృతదేహం మిస్టరీవీడింది. సీసీటీవీ ఫుటేజ్ ద్వారా నిందితులను గుర్తించారు. ఒక యువకుడితో సంబంధం నేపథ్యంలో కుమార్తెను ఆమె తండ్రి హత్య చేసినట్లు నిర్ధారించారు. ఈనెల 17న ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలోని గోమతి నగర్ స్టేషన్‌లో ప్రయాణాన్ని ముగించిన ఎక్స్‌ప్రెస్ రైలు స్లీపర్ కోచ్‌లో వదిలేసిన ఇనుప పెట్టె, ఒక బ్యాగ్‌ను క్లీనింగ్ సిబ్బంది గుర్తించారు. రక్తం మరకలు ఉండటంతో అనుమానించి రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇనుప పెట్టె తాళం పగులగొట్టి చూడగా మహిళ మొండెం అందులో ఉన్నది.

ఫ్యాషన్ ఫ్యాషన్

# ఆమని.. సాగేను కాటన్‌తో..







వేసవిలో చల్లదనంతోపాటు స్టైల్‌నీ కోరుకునే నూలు దుస్తులు చక్కని ఎంపిక. కుర్తీలతోపాటు అనార్కలీ, మాక్సీ డ్రెస్‌లు, ఫ్రాక్‌లు, పలాజోలు, కో-ఆర్డ్ సెట్‌లు యువతని ఆకట్టుకుంటున్నాయి. వీటికి జతగా ఫ్లోరల్, చారలు, పోల్కా డాట్స్ వంటి క్లాసిక్ ప్రింట్లు ట్రెండీగా మారాయి.చీరల్నీ ఎంచుకుంటోందీ తరం. కాసేపు ఎండలోకి వెళ్లొస్తే చాలు.. ఒళ్లంతా చెమట, జిగురు. వీటిని తట్టుకుని ఫ్రెష్‌గా ఉంచాలంటే కాటన్ వస్త్రధారణే మేలు. ఇందులోని ఫైబర్ సహజ ఎయిర్ కండిషన్‌గా, ఇన్సులేటర్‌గా పనిచేయడంతో వేసవిలో చల్లగా, చలికాలంలో వెచ్చగా ఉంటుంది. □

## ఆరోగ్య భాగ్యం ముల్లంగి

పోషకాలకు నిలయం ముల్లంగి. కాని చాలా మంది రుచి నచ్చకో, వాసన నచ్చకో చాలా మంది తినరు. కాని అందరికి అందుబాటులో, తక్కువ ధరలో ఉండే కూరగాయల్లో ముల్లంగి ఒకటి. దీనికున్న ప్రత్యేక రుచి ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా ప్రపంచవ్యాప్తంగా దీన్ని తినడానికి ఉపయోగిస్తారు. దీని మూలక, మహాకంద, దీర్ఘమూలక, మూలీ, నీల్వర్న్ రాడీష్, గ్రీన్ లుయోబో, మిసాటో గ్రీన్, క్వింగ్ లువోబో, చైనీస్ గ్రీన్ అని వివిధ ప్రాంతాలో పిలుస్తారు. చల్లని వాతావరణంలో పెరిగే దీన్ని వసంత ముల్లంగి అంటారు. రాడిష్ అనే పదం లాటిన్ పదం రాడిక్స్ నుండి వచ్చింది దీని అర్థం రూట్ అని అర్థం. ఇది చాలా వేగంగా 3-4 వారాల్లో పరిపక్వం చెందుతాయి. కాని చల్లని వాతావరణంలో 6-7 వారాలు పెరగుతాయి. ముల్లంగికి పురాతన ఈజిప్టు గ్రీన్, రోమ్ కాలల నాటి చరిత్ర ఉంది దీన్ని 2000 సంవత్సరాలకు పైగా సాగుచేస్తున్నారు. అమెరిన్లకు పరిచయం చేసిన మొట్టమొదటి యూరోపియనే పంట ముల్లంగా చైనాలో 7వ శతాబ్దం బి.సిలో చైనా సాగుచేస్తే, జపాన్‌లో 1,000 సంవత్సరాల క్రితమే సాగు చేసినట్లు అని మధ్య ఆసియాకు వ్యాపించినట్లు ఆధారాలున్నాయి. పురాతన కాలంలానే ఈజిప్టియన్లు ముల్లంగిని పండించినట్ల ఆధారాలున్నాయి. పురాతన గ్రీకులు ముల్లంగిని ఎంతగానో విలువైనదిగా భావించి వారి అపోలో దేవుడికి చిన్న బంగారు ముల్లంగిని అర్పించారు. దీన్ని బట్టి చూస్తే పురాతన కూరగాయల్లో ముల్లంగి ఒకటి అని తెలుస్తుంది ప్రపంచ వ్యాప్తంగా ముల్లంగిని చాలా విభిన్న మార్గాల్లో ఉపయోగిస్తారు. మెక్సికోలో ఒక్సాకా అనే నగరంలో డిసెంబర్ 23న ముల్లంగి ఉత్సవాన్ని జరుపుకున్నారు. ముల్లంగిని ప్రపంచవ్యాప్తగా 7మిలియన్ల టన్నులు ఉత్పత్తి చేస్తే ప్రపంచ ముల్లంగి ఉత్పత్తిలో 2% ప్రాతినిద్యం వహిస్తాయి. అమెరికన్స్ ప్రతి సంవత్సరం 400 మిలియన్ పౌండ్స్ తింటారు. అమెరికా, ఆసియా, చైనా, జపాన్‌లో విస్తారంగా పండించే ముల్లంగి కూరగాయ బ్రాసికేసియా కుటుంబానికి చెందింది. ఇండియాలో పశ్చిమ బెంగాల్, బీహార్, యుపి, కర్నాటక పంజాబ్, అసాంలో విరివిగా సాగుచేసే ముల్లంగి శాస్త్రీయనామం రాఫనస్ సటైవా. **రకాలు :** అధిక పోషకాలుండడంవల్ల దీని 'విటమిన్ ముల్లంగి' అని అంటారు. దీనికలర్, సైజ్, ఆకారాన్ని బట్టి, సీజన్ బట్టి అనేక రకాలుగా ఉంటుంది.



**ఆసియా/స్వదేశీ రకం :** ఇది తెల్లని రంగులో శంఖు ఆకారంలో ఉంటుంది. **ఐరోపా/ విదేశీ రకం :** ఇది తెల్లని రంగు కల్గి గుండ్రంగా ఉండి లోపల గడ్డ తెల్లగా ఉంటుంది. **శీతకాల ముల్లంగి :** శీతకాలం ముల్లంగా । చైనా రోజ్ రకం ఇది పొడవుగా గ్రీన్ కలర్, నల్లనిరంగులో ఘాటుగా ఉంటుంది. **రింగ్ ముల్లంగి :** వసంత ముల్లంగి తెలుపు,పింక్ కలర్‌లో గుండ్రంగా, మైల్డ్‌గా ఉంటుంది.

**వేసవి ముల్లంగి:** ఘాటుగా తెల్లగా ఎర్రగా ఉంటాయి ఆ కూరగాయల్ని భూమిలో ఎక్కువ సేపు ఉంచితే చేదుగా, వగరుగా వారుతుంది.

**పరిమాణంను బట్టి ముల్లంగి రకాలు ..**తెలుపు డైకాన్ ముల్లంగి: ఇది ఆసియా దేశాల్లో ప్రసిద్ధి చెందిన పెద్ద తెల్లని ముల్లంగి ఇది తేలికపాటి, కొద్దిగా తీపి రుచిని కల్గి ఉంటాయి. **ఆకు పచ్చ** ముల్లంగి/ పుచ్చకాయ ముల్లంగి: ఇది బైట పచ్చగా ఉండి, లోపల పుచ్చకాయ రంగులో ఉంటుంది. **కొరియన్ ముల్లంగి :** ఇది తెల్ల రంగులో, మైల్డ్‌గా ఉండి బంగాళా దుంపని పోలి ఉంటుంది. ఇది అనేక రకాల్లో రంగుల్లో ఉన్నప్పటి దాదాపు 10-12 రకాలు మాత్రమే ప్రాచుర్యంలో ఉన్నాయనే చెప్పాలి. □



డాక్టర్ కె.ఉమాదేవి
తిరుపతి

## సరదా.. సరదాగా..



వేసవి సెలవులు మొదలైన నాటి నుంచి జరిగే ప్రతి విషయమూ పిల్లలకెంతో నచ్చుతుంది. ఎన్నో మధుర అనుభూతుల్ని అందిస్తుంది. వాటిని పదిలంగా భద్రపర్చుకునే అవకాశం ఇవ్వండి. వారికి నచ్చేవన్నీ పొందుపరుస్తూ ఓ చక్కని స్క్రాప్ బుక్ తయారు చేసుకోనివ్వండి. కెమెరాలో నచ్చిన ప్రదేశాలూ, వస్తువులూ, వ్యక్తులను బంధించి.. వాటి కాపీలను అందులో జత చేస్తూ మనసు చెప్పినట్లు రాయనివ్వండి. ఎంత ఉత్సాహంగా చేస్తారో మీరే చూడొచ్చు. ఈ పని వారి సమయాన్ని చక్కగా సద్వినియోగం చేస్తుంది. చిన్నారుల ఊహలకూ, ఆలోచనలకూ ఊతం ఇస్తుంది. బంధాలనూ, చక్కగా వ్యక్తపరిచేందుకు తోడ్పడుతుంది. □

**చెలి** సామాజిక పరిణామ క్రమంలో మహిళల పాత్ర ఎంతో అనిర్వచనీయమైనది. దానికి అందం చేకూర్చా లంటే స్త్రీ పాత్ర ఉండాల్సిందే! అందుకే మీ రచనలు పరిచయం చేయాలని 'వార్త' సంకల్పించింది. మహిళ సంబంధిత అంశాలపై వ్యాసాలు ఆహ్వానిస్తున్నాం. మీరు అనుసరించే జాగ్రత్తలు పాటించే చిట్కాలు, ఇతర ఏ అంశాలైనా మీ పేరుతో ప్రచురిస్తాం. ఈ మెయిల్:Cheli@vaartha.com

## నానబెట్టిన శనగలే !

ఖాళీ కడుపుతో వ్యాయామం చేయడం మంచిది.
నానబెట్టిన సెనగలు తిని చూడండి. ఎన్ని ప్రయోజనాలో..



నానబెట్టిన సెనగల్లో ఆరోగ్యానికి ఉపకరించే సంక్లిష్ట కార్బోహైడ్రేట్లు ఉంటాయి. ఇవి శక్తిని ఒకేసారి కాకుండా నెమ్మదిగా విడుదల చేస్తూ.. వర్కవుట్లు చేసుకోవడానికి కావాల్సిన హుషారునీ, ఉత్తేజాన్ని అందిస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలను ఒక్కసారిగా కాకుండా నిదానంగా విడుదలయ్యేట్టు చేస్తాయి.దీనిలో గ్లైసమిక్ ఇండెక్స్ స్థాయిలు తక్కువ. అందువల్ల కాసిని తిన్నా నిదానంగా శక్తిని విడుదల చేస్తూ, చక్కెర స్థాయులు పెరగకుండా చూసుకుంటాయి. పైగా ఏదో ఒకటి తినాలనే కోరిక కలిగించవు. బరువు పెరిగే సమస్యా ఉండదు. నానబెట్టిన సెనగలు తింటే బ్రెస్ట్, లంగ్ క్యాన్సర్ల నుంచి రక్షణ లభిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ముప్ఫై దాటిన తర్వాత ముఖంలో ముడతలు వస్తాయనే దిగులు మొదలవుతుంది. అలాంటి వారు కచ్చితంగా సెనగలు తిన్నాలినసందే వీటికి చర్మాన్ని మెరిపించే శక్తి ఉంది. □

## సౌందర్య పోషణకు టీకాలొద్దు సుమీ!



యువతులైనా, గృహిణులైనా సౌందర్య రక్షణ కోసం వివిధ రకాల లేపనాలు , లోషన్‌లు, కొన్ని సందర్భాలలో ఇంజెక్షన్‌లను కూడా వాడుతుండటం సహజం. కానీ తాజాగా ఇంజెక్షన్‌లు ప్రాణాపాయ మని ఔషధ నియంత్రణ సంస్థ హెచ్చరికలు జారీ చేస్తోంది. చర్మ రక్షణ ప్రక్రియలో ఇటీవల బొటాక్స్, గ్లుటాథియోన్ వంటి సమ్మేళనాలు ప్రాచుర్యం పొందిన నేపథ్యంలో ఈ హెచ్చరికను జారీ చేసింది. వినియోగదారులైనా, నిపుణులైనా, సౌందర్య చికిత్సాలయా లైనా సౌందర్య సాధనాన్ని ఇంజెక్షన్ రూపంలో ఉపయోగించడానికి వీలులేదని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ స్పష్టం చేసింది. సౌందర్య సాధనాలేవైనా సరే అవి మానవ శరీరంపై రుద్దడానికి, పోయడానికి, చల్లడానికి లేదా పిచికారీ చేయడానికి మాత్రమే ఉద్దేశించినవని వివరించింది. వాటిని ఇంజెక్షన్ రూపంలో మానవ శరీరంలోకి పంపడం ద్వారా తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతున్నాయని తెలిపింది. చాలాచోట్ల సౌందర్య చికిత్సాలయాల్లో నైపుణ్యం లేని వారు సైతం ఇటువంటి ప్రయోగాలకు దిగుతూ వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తునందున ఆ సంస్థ జోక్యం చేసుకుంది. □

## 'ది ఇండియా స్టోరి' జూలై 24న విడుదల



జీ స్టూడియోస్, ఎంఐజి ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పణ ఆకట్టుకునే పోస్టర్‌తో ఆసక్తిని రేకెత్తించిన ది ఇండియా స్టోర్రి మేకర్స్ తాజాగా మరో కీలక అప్డేట్ ఇచ్చారు. కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే ప్రధానపాత్రల్లో నటిస్తున్న ఈ సోషియోనేషనల్ డ్రామా టీజర్ త్వరలో విడుదల కానుందని ప్రకటించారు. జీ స్టూడియోస్ సమర్పణలో, ఎంఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్‌తో కలిసి రూపొందుతున్న ఈ చిత్రం 2026 జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్ల లో విడుదల కానుంది. చెట్టన్ డీకే దర్శకత్వంలో, సాగర్ బి షిండే రచించి నిర్మిస్తున్న ది ఇండియా స్టోరీ: స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్ట్ రసాయనాల దుర్వినియోగం, ముఖ్యంగా పురుగుమందుల వ్యవసాయం వల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న ప్రభావాలను ప్రధానాంశంగా తీసుకుని తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన పోస్టర్ ఈ చిత్రంలోని తీవ్రమైన, ఆలోచింపజేసే అంశంపై ఒక బలమైన సంకేతాన్ని ఇచ్చింది. ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబ కథను దాటి, దేశవ్యాప్తంగా లక్షలాది మందిని ప్రభావితం చేస్తున్న సామాజిక సంక్షోభాన్ని ఈ చిత్రం ప్రతిబింబించనుంది. పరిశ్రమల నిర్లక్ష్యం, దాని వల్ల దాగి ఉన్న ప్రమాదాలు, సమాజంలో అవగాహన, బాధ్యత ఎంత అవసరమో ఈ కథ ద్వారా చూపించబోతున్నారు. త్వరలో రానున్న టీజర్‌ప్రేక్షకులను ది ఇండియా స్టోరీ ప్రపంచంలోకి మరింతగా తీసుకెళ్తుందని మేకర్స్ తెలిపారు. తొలిసారి కలిసి నటిస్తున్న కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పాడే తమ ఎమోషనల్, ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో కథకు మరింత బలం తీసుకురానున్నారు.

## 'పెద్ది' బిగ్గెస్ట్ స్పెషల్ సాంగ్ 'హెల్లల్లో' రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, ఈరోజు చిత్ర బృందం మూడవ సింగిల్ 'హెల్లల్లో'ప్రోమోను విడుదల చేసింది. ప్రోమో చూస్తుంటే ఇటీవలి కాలంలో వచ్చిన అత్యంత ఎనర్జిటిక్, కలర్‌ఫుల్ స్పెషల్ సాంగ్స్‌లో ఒకటిగా నిలవనుందని అర్థమవుతోంది. పవర్ ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్, జాతర వాతావరణాన్ని తలపించే ట్యూన్‌తో పాట ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకుంటోంది. ఈ పాటలో రామ్ చరణ్ తన రగ్డ్, స్టైలిష్ లుక్‌లో అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకుంటున్నారు. ఆయనతో పాటు శ్రుతి హాసన్, జాన్వీ కపూర్ కూడా అలరించారు. శ్రుతి హాసన్ తన బోల్డ్ అటిట్యూడ్‌తో, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ ఎనర్జీతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. పూర్తి పాటను రేపు భోపాల్‌లో జరగనున్న భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్, ఆయన బృందం ఈ పాటను ప్రత్యక్షంగా ప్రదర్శించనుండ టంతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది.

## తెర

## 'టాన్స్‌ఫర్ త్రిమూర్తులు' టీజర్ లాంచ్




వడ్డే జిష్ణు సమర్పణలో వడ్డే క్రియేషన్స్ బ్యానర్ మీద వడ్డే నవీన్ హీరోగా, నిర్మాతగా రూపొందించిన చిత్రం 'టాన్స్ ఫర్ త్రిమూర్తులు' కమల్ తేజ నార్ల ఈ మూవీతో దర్శకుడిగా పరిచయం కాబోతున్నారు. ఈ సినిమాలో వడ్డే నవీన్, రాశి సింగ్, శిల్పా తులస్కర్, వివేక్ రఘువంశీ, రఘుబాబు, శివన్నారాయణ, వడ్లమాని శ్రీనివాస్, జ్వాలా కోటి, దేవి ప్రసాద్, సూర్య, బాబా బాస్కర్, ప్రమోదిని, సాత్విక్ రాజు, అంజలి ప్రియ, గాయత్రి చాగంటి తదితరులు ముఖ్య పాత్రల్ని పోషించారు. ఈ మూవీని జూన్ 19న విడుదల చేయనున్నారు. ఈ క్రమంలో మూవీ టీజర్‌ను రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంచ్ ఈవెంట్‌లో..హీరో, నిర్మాత వడ్డే నవీన్ మాట్లాడుతూ.. .. మా నాన్న చనిపోయిన తరువాత నేను నటిస్తున్న, నిర్మిస్తున్న మొదటి చిత్రమిది. నేను ఎప్పుడూ హైదరాబాద్‌లోనే ఉన్నాను. ఫ్యామిలీతోనే ఉంటున్నాను. నేను ఎక్కువగా బయట కనిపించను. కానీ నా గురించి మీడియా, అభిమానులు మాత్రం ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉన్నారు. అందుకు థాంక్స్. హీరోయిన్ రాశీ సింగ్ మాట్లాడుతూ.. ..'టాన్స్ ఫర్ త్రిమూర్తులు' సినిమాలో నాకు లక్ష్మీ అనే మంచి పాత్రను ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. దర్శకుడు కమల్ తేజ నార్ల మాట్లాడుతూ.. .'టాన్స్ ఫర్ త్రిమూర్తులు' మూవీకి ముందు నుంచీ మీడియా అద్భుతమైన సపోర్ట్ చేస్తూనే ఉంది. ఏడాదిన్నర పాటుగా కథ, స్క్రిప్ట్ మీద పని చేశాం. ఇలా మా టీజర్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది.

## 'సమవర్తి' టైటిల్ ఫస్ట్ లుక్ రిలీజ్



వైవిధ్యమైన చిత్రాల్లో నటిస్తూ హీరోగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు యంగ్ టాలెంటెడ్ హీరో సత్యదేవ్. ఆయన హీరోగా నటిస్తున్న కొత్త చిత్రానికి 'సమవర్తి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ రోజు ఈ చిత్ర టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. సత్యదేవ్ హీరోగా నటిస్తున్న 16వ చిత్రమిది. 'సమవర్తి'సినిమాను రుద్ర పిక్చర్స్ బ్యానర్ పంచభూత ప్రొడక్షన్స్, స్ పై శివచరణ్ రెడ్డి జక్కిడి, శశిధర్ రెడ్డి పడమటి నిర్మిస్తున్నారు. అజయ్ నాగ్. వి దర్శకత్వం వహిస్తున్నారు. ఎకోలాజికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలోనే తెలుగుతో పాటు తమిళ, కన్నడ, మలయాళంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. సమవర్తి సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో సత్యదేవ్ చుట్టూ గొడ్డళ్లు, కత్తులతో కొందరు దూసుకురాగా, ఆయన ఎలాంటి భయం లేకుండా హెడ్ ఫోన్స్‌లో పాటలు వింటూ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తుండటం ఆసక్తి కలిగిస్తోంది. సమవర్తి అంటే యముడు, ఎవరి పట్ల పక్షపాతం లేనివాడు అని అర్థం. ఈ సమవర్తి శత్రువుల పాలిట యముడిలా మారి వారందరినీ ఎలాంటి తేడాలు లేకుండా ఒకేలా కనుమరుగు చేస్తాడని అనుకోవచ్చు. సత్యదేవ్ కెరీర్‌లో ఇదొక హై ఇంటెన్స్ యాక్షన్ మూవీ అవుతుందనే అంచనాలు టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్‌తో ఏర్పడుతున్నాయి.

## 'మేము కాప్'లం' గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్



'మేము కాప్'లం' విజయం సాధించాలని కోరుకుంటున్నాను బండ్ల గణేష్.. 'మేము కాప్'లం' సిరీస్‌కు పని చేసిన ప్రతీ ఒక్కరికీ మంచి పేరు, సక్సెస్ రావాలని కోరుకుంటున్నాను గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో కోన వెంకట్.. 'మేము కాప్'లం' సిరీస్ మంచి విజయం సాధించాలని కోరు కుంటున్నాను గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో తమన్..'మేము కాప్'లం' అనే మరో ఒరిజినల్ సిరీస్ వచ్చింది. ఎంటర్‌టైన్‌మెంట్స్ (ప్రొడక్షన్ నెం. 3) బ్యానర్‌పై బి.వి.ఎస్. రవి నిర్మించిన 'మేము కాప్'లం' సిరీస్‌కు 'వికటకవి' ఫేమ్ ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించారు. ఈ సిరీస్‌లో నాగబాబు కొణిదెల ప్రధాన పాత్రను పోషించారు. గెటప్ శ్రీను, రవి తేజ నన్నిమాల వంటి ప్రముఖ తారాగణం నటించారు. ఈ సిరీస్ మే 22 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ క్రమంలో గురువారం నాడు గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తమన్, బండ్ల గణేష్, అజయ్ భూపతి, కోన వెంకట్ తదితరులు ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ మేరకు తమన్ మాట్లాడుతూ.. సాకేత్ ఈ 'మేము కాప్'లం' సిరీస్‌కు సంగీతం అందించడం ఆనందంగా ఉంది. అజయ్ భూపతి మాట్లా డుతూ.. 'మేము కాప్'లం'అనే టైటిల్ కాంట్రవర్సీ అవుతుందేమో అని అనుకున్నాను. కానీ ట్రైలర్ మాత్రం వినోదాత్మకంగా ఉంది. బండ్ల గణేష్ మాట్లాడుతూ.. ప్రదీప్ నాకు నచ్చాడు. ఆయన తన అమ్మానాన్నను తీసుకు వచ్చి ఇక్కడ కూర్చోపెట్టాడు. అందుకే నాకు ఆయన నచ్చాడు. కోన వెంకట్ మాట్లాడుతూ.. అనురాధ మేడం ఎప్పుడూ కూడా మంచి కంటెంట్‌ను ఎంచుకుంటారు. ఇదొక రిఫ్రెషింగ్ కంటెంట్‌లా ఉంది. నిర్మాత కౌముది మాట్లా డుతూ.. మాకు ఈ అవకాశం ఇచ్చిన అనురాధ మేడంకి థాంక్స్. ప్రదీప్ గారి వల్లే ఈ ప్రాజెక్ట్ మా వరకు వచ్చింది. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్.

## 'CASTE ' రాజా రవీందర్ ఫస్ట్‌లుక్



వరుణ్ సందేశ్, గగన్, సత్యం రాజేష్, రవి ప్రధాన పాత్రల్లో ఎకె జంపన్న రచన దర్శకత్వంలో గోల్డెన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై తోట లక్ష్మీ కోటేశ్వరరావు నిర్మిస్తున్న చిత్రం 'దితిళీగిని' ఈ సినిమా ఫస్ట్ లుక్, గ్లింప్స్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రంలో రాజా రవీందర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రని మినిస్టర్ నారాయణగా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్ ని రిలీజ్ చేశారు మేకర్స్.మంత్రి నారాయణ గా రాజా రవీందర్ లుక్ పవర్‌ఫుల్‌గా ఆకట్టుకుం టోంది. తెల్లటి దుస్తులు, భుజంపై పార్టీ కండువా ధరించి ఇంటెన్స్‌గా కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో కశికా కపూర్, దివి హీరోయిన్స్‌గా నటిస్తున్నారు.ఈ చిత్రానికి అనూప్ రూబెన్స్ మ్యూజిక్ అందిస్తున్నారు. మేకర్స్ త్వరలోనే ఈ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేయనున్నారు.







## మూడు మ్యాచ్‌లు 4 జట్లు, ఒక సీటు

# చివరి బెర్త్ జాక్‌పాట్ ఎవరిదో?

**కాసుల క్రికెట్ ఇండియన్ ప్రీమియర్ లీగ్ చివరి స్టేజ్‌కు చేరువైంది. మార్చి 26న ప్రారంభమైన ఐపీఎల్‌లో మరో మూడు లీగ్ మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. ప్లే ఆఫ్ చేరే ఆ నాలుగు జట్లలో మూడు మాత్రమే ఖరారయ్యాయి. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, గుజరాత్ టైటాన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లే ఆఫ్‌కు చేరుకున్నాయి. మరో బెర్త్ ఖరారవ్వాల్సి ఉంది. ప్లే ఆఫ్‌కు చేరే నాలుగో జట్టేది అన్నది ఆసక్తి రేపుతోంది.**

(వార్త క్రీడా విభాగం)

ప్లే ఆఫ్‌కు మొదటగా చేరే జట్లలో పంజాబ్ కింగ్స్ మొదటి స్థానంలో, రాజస్థాన్ రాయల్స్ రెండో స్థానంలో ఉంటాయని తొలి దశ తర్వాత అంతా ఊహించారు. దానికి భిన్నంగా ఆ జట్లు ప్లే ఆఫ్‌కు చేరడం అటుంచి ఇపుడు అక్కడికి అర్హత పొందుతాయా అన్న డైలమాలో పడ్డాయి. నాలుగో బెర్త్ కోసం రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ పోటీపడుతున్నాయి. నేడు, రేపు జరిగే మ్యాచ్‌ల్లో ఎవరిది నాలుగో బెర్త్ అన్నది తేలిపోనుంది.

### పంజాబ్ గెలిచినా?

ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లతో అయిదో స్థానంలో ఉంది. వరుసగా ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనూ గెలుపొంది జోరుమీద కనిపించిన పంజాబ్ ఆతర్వాత ఒక్కసారిగా ఢీలా పడింది. ఆ తరువాత వరుసగా ఆరు మ్యాచ్‌ల్లో ఓడి ప్రస్తుత స్థితికి వచ్చింది. నేడు లక్నో సూపర్ జెయింట్స్‌తో పంజాబ్ కింగ్స్ తలపడనుంది. సొంతగడ్డలో మ్యాచ్ జరుగుతుండడం లక్నోకు అనుకూలించే అంశం. గత కొన్నిమ్యాచ్‌ల్లో ప్రత్యర్థి జట్లకు షాకిస్తున్న లక్నోపై పంజాబ్‌కు గెలుపు తప్పనిసరి. 15 పాయింట్లతో నాలుగో స్థానానికి చేరుకుంటుంది. గెలిచినా ప్లేఆఫ్ ఖచ్చితంగా చేరుతుందన్న గ్యారంటీ లేదు. ఆదివారం రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితం కోసం ఎదురుచూడాల్సి ఉంటుంది. ఈమ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ ఓడిపోవాలని కోరుకోవాల్సి ఉంటుంది. ఇక పంజాబ్ కింగ్స్ ఓడితే ఆశలు గల్లంతే.

### రాజస్థాన్ గెలిస్తే ప్లేఆఫ్ బెర్త్

ఇక రాజస్థాన్ రాయల్స్ వరుసగా మూడు ఓటముల తర్వాత గెలిచి నిలవాల్సిన మ్యాచ్‌లో లక్నోపై గెలుపొంది ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. ప్రస్తుతం 13మ్యాచ్‌ల్లో 7విజయాలు, 6 పరాజయాలతో 14పాయంట్లతో నాలుగో స్థానంలో ఉంది. నేడు ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఇప్పటికే ముంబై ఇండియన్స్‌ను ఓడించిన రాయల్స్... ఈ మ్యాచ్‌లోనూ గెలుపొందితే 16 పాయిట్లతో ప్లే ఆఫ్‌కు చేరుకుంటుంది. పంజాబ్, కేకేఆర్, ఢిల్లీ ఇంటికే. రాజస్థాన్ ఓడితే 14పాయింట్లకే పరిమితమవుతుంది. అపుడు నేటి మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ ఓడిపోతే 13 పాయింట్ల వద్దే నిలిచిపోతుంది. ఆదివారం జరిగే రెండో మ్యాచ్ కీలకమవుతుంది. కోల్‌కతా నైట్‌రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌లో ఢిల్లీ గెలవాలని కోరుకోవాల్సి ఉంటుంది. అపుడు తక్కువ నెట్‌రన్‌రేట్ ఉన్న ఢిల్లీకి బదులు రాజస్థాన్ ముందంజ వేస్తుంది.

### రాయల్స్ ఓడితేనే కోల్‌కతాకు ఛాన్స్

13 పాయింట్లతో ఉన్న కోల్‌కతా నైట్‌రైడర్స్ సొంతగడ్డ ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఆదివారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది. అంతకు ముందు మ్యాచ్‌లో రాజస్థాన్ గెలిస్తే మాత్రం ఈ మ్యాచ్ నామమాత్రమే. పంజాబ్, రాజస్థాన్ ఓడిపోయి.. కేకేఆర్ విజయం సాధిస్తే నాకౌట్‌కు చేరుకుంటుంది. ఢిల్లీ గెలిస్తే మాత్రం మళ్లీ నెట్ రన్‌రేట్ కీలకమవుతుంది. ఢిల్లీతో పోరు వర్షం కారణంగా రద్దైనా సరే కోల్‌కతాకు నాకౌట్ బెర్తు ఛాన్స్ ఉంటుంది. అప్పుడూ ఏ జట్టు నెట్ రన్‌రేట్ ఎక్కువ ఉంటే వారిదే నాలుగో ప్లేస్. మొత్తానికి నాలుగో బెర్త్ సాధించేదెవరు అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది.

# ఆర్సీబీపై సన్‌రైజర్స్ ఘనవిజయం





**హైదరాబాద్, మే 22(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్‌లో సన్‌రైజర్స్ బ్యాట్స్‌మెన్ పరుగుల సునామీ సృష్టించారు. ఓపెనర్ అభిషేక్ (22 బంతుల్లో 56; 4 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఇషాన్ కిషన్ (46 బంతుల్లో 79; 8 ఫోర్లు, 3 సిక్స్‌లు), క్లాసెన్ (24 బంతుల్లో 51; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) హాఫ్ సెంచరీలతో విశ్వరూపం చూపారు. వీరికి తోడుగా ట్రావిస్ హెడ్(16 బంతుల్లో 26; 5 ఫోర్లు), నితీష్‌కుమార్ రెడ్డి(12 బంతుల్లో 29 నాటౌట్; 1ఫోర్, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించడంతో ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం లక్ష్య చేధనలో ఆర్సీబీని ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 200 పరుగులకు పరిమితం చేసింది. ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లి(15) నిరాశపరచగా, ఎవరూ పెద్ద స్కోర్లు చేయలేకపోయారు. వెంకటేశ్ అయ్యర్(44), దేవ్‌దత్ పడిక్కల్(21) రాణించారు. రజత్ పాటిదార్(56) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు తోడు కృనాల్ పాండే(41 నాటౌట్) ధాటిగా ఆడినా భారీ స్కోరును అందుకోలేకపోయారు. 55పరుగుల తేడాతో నెగ్గి లీగ్ స్టేజ్‌ను సన్‌రైజర్స్ విజయంతో ముగించింది. సన్‌రైజర్స్ 18 పాయింట్లతో ఆర్సీబీ, గుజరాత్‌తో సమంగా నిలిచినా నెట్‌రన్ రేట్‌లో వెనకబడింది. టేబుల్‌లో ఆర్సీబీ మొదటి స్థానంలో.. గుజరాత్, సన్‌రైజర్స్ వరుసగా 2,3 స్థానాల్లో నిలిచాయి.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న ఆరేంజ్ టీమ్‌కు ఓపెనర్లు శుభారంభం అందించారు. ట్రావిస్ హెడ్, అభిషేక్ తొలి ఓవర్ నుంచే దంచడం మొదలుపెట్టారు. భువీ వేసిన తొలి ఓవర్లో ఫోర్, సిక్స్ బాదారు. ఇక రసిఖ్ ఓవర్లో మూడు ఫోర్లు బాదిన హెడ్... చివరి బంతికి క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. దీంతో తొలి వికెట్ 45 పరుగుల వద్ద పడింది. ఈ దశలో ఇషాన్ తో జతకట్టిన అభిషేక్ మరింత జోరు చూపాడు. సుయాంష్ ఓవర్లో బ్యాక్ టు బ్యాక్ రెండు సిక్స్‌లు, షెఫర్డ్ ఓవర్లో రెండు సిక్స్‌లు, ఓ ఫోర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేశాడు. కురిపించాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అదే క్రమంలో సుయాంష్ బంతికి భారీ షాట్ ఆడబోయి అభి పెవిలియన్‌కు చేరాడు. ఈ దశలో జత కట్టిన ఇషాన్, క్లాసెన్.. ఎస్ఆర్‌హెచ్ ఇన్నింగ్స్‌ను మరో రేంజ్‌కు తీసుకెళ్లారు. తొలుత ఆచితూచి ఆడిన ఇద్దరూ ఆ తర్వాత గేర్ మార్చారు. పోటాపోటీగా ఫోర్లు, సిక్సర్లతో ఆర్సీబీ బౌలర్లను ఊచకోత కోశారు. హేజిల్‌వుడ్ వేసిన 13వ ఓవర్లో క్లాసెన్ మూడు సిక్స్‌లు, ఒక బౌండరీతో సహా 27 రన్స్ సాధించాడు. ఈ క్రమంలో క్లాసెన్ 23 బంతుల్లో ఇషాన్ 31 బంతుల్లో అర్ధసెంచరీలు పూర్తి చేశారు. ఎస్ఆర్‌హెచ్ స్కోరును 200 మార్కు దాటించారు. మాంచి ఊపుమీదున్న క్లాసెన్ (51) మరింత వేగంగా ఆడే క్రమంలో కృనాల్ పాండ్యా బౌలింగ్ లో వెనుదిరిగాడు. క్లాసెన్ ఔట్ అయ్యాక క్రీజులోకి వచ్చిన నితీష్ రెడ్డి కూడా మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. కేవలం 12 బంతుల్లోనే ఒక ఫోర్, మూడు సిక్సర్లు బాది 29 పరుగులు చేశాడు. ఫస్ట్ డౌన్ లో బ్యాటింగ్ కు వచ్చిన ఇషాన్ కిషన్ ఇన్సింగ్స్ లాస్ట్ బౌల్ కు ఔట్ అయ్యాడు. 46 బంతుల్లో 8 ఫోర్లు, మూడు సిక్సర్లు కొట్టి హైదరాబాద్ కు భారీ స్కోర్ అందించాడు. ఆర్సీబీ బౌలర్లలో రసిఖ్ సలాందార్ రెండు, సుయాష్, కృనాల్ పాండ్యా చెరో వికెట్ తీశారు.



# క్వార్టర్స్‌లో అష్మిత ఓటమి ముగిసిన భారత్ సవాల్

**కౌలాలంపూర్:** మలేషియా మాస్టర్స్ 2026 బ్యాడ్మింటన్‌లో భారత్ సవాల్ ముగిసింది. ఏకైక ఆశాకిరణంగా ఉన్న భారత రైజింగ్ స్టార్ అష్మిత చలిహా క్వార్టర్‌ఫైనల్లో పరాజయం పొందింది. డెన్మార్క్‌కు చెందిన మాజీ యూరోపియన్ ఛాంపియన్ లైన్ కెర్స్‌ఫెల్డ్ చేతిలో 23-21, 21-18, 21-11తో ఓడింది. చలిహా మొదటి గేమ్ నెగ్గి శుభారంభం చేసింది. రెండో సెట్‌లోనూ ఇద్దరూ పోటాపోటీగా పాయింట్లు రాబట్టారు. 17-17తో సమవుజ్జీగా నిలిచారు. ఈ దశలో అష్మిత ఒత్తిడికి లోనై పొరపాట్లు చేయగా, పుంజుకున్న కెర్స్ ఫెల్డ్ వరుసగా మూడు పాయింట్లు సాధించి సమం చేసింది. ఫలితం తేల్చే మూడో సెట్‌లో కెర్స్‌ఫీల్డ్ జోరు ముదు అష్మిత నిలవలేకపోయింది. హోరాహోరీగా సాగిన నిర్ణయాత్మక గేమ్ ఏకపక్షంగా మారింది. బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్‌లో అష్మిత ప్రస్తుతం 71వ స్థానంలో ఉంది. అంతకుముందు ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండుసార్లు జూనియర్ ప్రపంచ ఛాంపియన్ మలేషియాకు చెందిన గోజిన్ వెయ్‌ను అష్మిత వరుస గేమ్‌లలో ఓడించింది. కాగా మహిళల సింగిల్స్‌లో మాళవిక, దేవిక సిహాగ్ ప్రి క్వార్టర్ ఫైనల్లో వెనుదిరగారు. ఇక లక్ష్య సేన్, హెచ్ఎస్ ప్రణయ్ ఓటమితో పురుషుల సింగిల్స్‌లో భారత ప్రయాణం మొదటి రౌండ్‌లోనే ముగిసింది. భారత షట్లర్లు మంగళవారం నుంచి ప్రారంభమయ్యే సింగపూర్ ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నారు.

# ఐపిఎల్‌లో ధోనీ స్కామ్ : సీఎస్కేపై మండిపడ్డ శ్రీకాంత్

చెన్నై: ఐపీఎల్ పంతొమ్మిదో సీజన్‌లో ఎంఎస్ ధోనీ ఆట కోసం నిరీక్షించిన అభిమానులకు నిరాశే మిగిలింది. చెన్నై సూపర్ కింగ్స్ ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించడంతో ధోనీ ఆడుతాడనే ఆశ కూడా ఆవిరైంది. ఇదుగో వస్తుండు.. వచ్చే మ్యాచ్‌లో ఆడతాడు అని ఊరించిన చెన్నై యాజ మాన్యం.. చివరికి అభిమానులను పిచ్చోళ్లను చేసింది. సీఎస్‌కే యాజమాన్యం తీరుపై టీమిండియా మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ ఓ రేంజ్‌లో మండిపడ్డాడు. ఐపీఎల్‌లో ధోనీ స్కామ్‌కు సీఎస్‌కే పాల్పడిందని విమర్శించారు. ఎంఎస్ ధోనీ ఫిటినెస్ మొత్తం ఓ మాయ అని పేర్కొన్నాడు. మొత్తానికి క్రికెట్ అభిమానులను సీఎస్కే యాజమాన్యం పిచ్చోళ్లను చేసిందని మండిపడ్డారు. ఎంఎస్ ధోనీ ఈ ఐపీఎల్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. గాయం నుంచి కోలుకుంటున్న ధోనీ త్వరలోనే ఫిట్‌నెస్ సాధిస్తాడని, లీగ్ దశ చివర్లో ఆడతాడని చెన్నై కెప్టెన్, కోచ్ చెప్పిన మాటలన్నీ అబద్దాలని తేలిందన్నారు.



# కేంద్రానికి ఆర్బీఐ 2.87 లక్షలకోట్ల డివిడెండ్




**ముంబయి, మే 22:** కేంద్ర ప్రభుత్వానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుండి భారీ మొత్తంలో మిగులు నిధులు బదలీ అవుతున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రభుత్వానికి బదిలీ చేయాల్సిన మిగులు నిధులపై (డివిడెండ్) ఆర్బీఐ సెంట్రల్‌బోర్డు నిర్ణయం వెలువరించాల్సి ఉంది. ఈసారి డివిడెండ్ మొత్తం గత ఏడాది రికార్డును అధిగమించి రూ.3 లక్షల కోట్లకు పైగా ఉండవచ్చని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

ఇది ప్రభుత్వ ఆర్థిక నిర్వహణకు పెద్ద ఊరటనివ్వనుంది. గతేడాది ఆర్బీఐ రూ.2.68 లక్షల కోట్ల రికార్డు స్థాయి డివిడెండ్‌ను ప్రభుత్వానికి బదిలీ చేసింది. ఈసారి అంతకుమించి సుమారు రూ.2.87 లక్షల కోట్ల నుంచి రూ.3.3 లక్షల కోట్ల మధ్య డివిడెండ్ ఉండవచ్చని బ్యాంక్ ఆఫ్ బరోడా, ఎంకే గ్లోబల్ వంటి సంస్థలు అంచనా వేస్తున్నాయి. పన్నేతర ఆదాయం రూపంలో అందే ఈ భారీ మొత్తం, ప్రపంచ ఆర్థిక అనిశ్చితుల నడుమ ప్రభుత్వానికి ఎంతగానో తోడ్పడనుంది. మార్కెట్ నుంచి అదనపు రుణాలు సమీకరించాల్సిన అవసరం లేకుండా ఆర్థిక లోటును అదుపులో ఉంచేందుకు మేలుచేస్తుంది. 2026-27 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల నుంచి, ఆర్బీఐ నుంచి డివిడెండ్ల రూపంలో రూ.3.16 లక్షల కోట్లు వస్తాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఈసారి అధిక డివిడెండ్‌కు ప్రధాన కారణం కంటింజెన్సీ రిస్క్ బఫర్(సీఆర్‌బీ)ను తగ్గించే అవకాశం ఉండటమేనని అంచనా. బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఎకనమిస్ట్ మదన్ సబ్నవిస్ మాట్లాడుతూ గతేడాది విదేశీ మారక నిల్వల వినియోగం ద్వారా వచ్చిన అధిక ఆదాయం వల్ల డివిడెండ్ పెరిగింది. కానీ ఈసారి సీఆర్‌బీని తగ్గించడం ద్వారా మిగులు నిధులు పెరిగే అవకాశం ఉంది. ఈసారి డివిడెండ్ రూ.3 3.2 లక్షల కోట్ల మధ్య ఉండొచ్చని వివరించారు.

ఆర్బీఐ ఎకనమిక్ క్యాపిటల్ ఫ్రేమ్‌వర్క్ ప్రకారం కంటింజెన్సీ రిస్క్ బఫర్‌ను 4.5 శాతం నుంచి 7.5 శాతం మధ్యలో నిర్వహించాలి. ప్రస్తుతం ఇది గరిష్ఠ స్థాయిలో అంటే 7.5 శాతం వద్ద ఉంది. దీనిని స్వల్పంగా 7 శాతానికి తగ్గించినా కూడా ప్రభుత్వానికి బదిలీ చేసేందుకు భారీగా నిధులు అందుబాటులోకి వస్తాయి. అధిక వడ్డీ ఆదాయం, బఫర్ అవసరాలు తగ్గడం వంటి కారణాలు ఈసారి అధిక చెల్లింపులకు మద్దతుగా నిలుస్తాయని ఎంకే గ్లోబల్ చీఫ్ ఎకనమిస్ట్ మాధవి అరోరా పేర్కొన్నారు.




# స్వల్ప లాభాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, మే 22:** ఈక్విటీ మార్కెట్లు వారాంతంలో స్వల్పలాభాలతోనే సరిపెట్టాయి. సానుకూలంగా న్న ప్రపంచ మార్కెట్‌ధోరణులు, ఇరాన్ అమెరికామధ్య శాంతి ఒప్పందం జరుగుతుందన్న అంచనాలు ఇన్వెస్టర్లలో పెట్టుబడులకు సానుకూలత కనిపించింది. అయితే చివరిదశలో ఎంపిక చేసిన షేర్లలో లాభాల స్వీకరణ కూడా జరిగింది. ప్రైవేటు బ్యాంకులు, ఆర్థికరంగ స్టాక్స్ లాభాల్లో వెళ్లాయి. హెల్త్‌కేర్, ఫార్మారంగషేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. మొత్తంగాచూస్తే ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. బిఎస్‌ఇ ఎన్సెక్స్ 231.99 పాయింట్లుపెరిగి 75,415.35 పాయింట్లవద్ద స్థిరపడితేనిఫ్టీ 50 సూచీ 64.60 పాయింట్లవద్దకు చేరి 23,719.30 పాయింట్లవద్దట్రేడింగ్ ముగించింది.

బిఎస్‌ఇలో మిడ్‌క్యాప్ సూచీ 0.11శాతంపెరిగితే స్మాల్‌క్యాప్ సూచీ 0.26శాతం క్షీణించింది. బిఎస్‌ఇలో 2168 కంపెనీల షేర్లుపెరిగితే 2027 షేర్లుక్షీణించగా మరో 174షేర్లు స్థిరంగా కొనసాగాయి. విదేశీ కరెన్సీ మార్కెట్‌లో డాలరుతో రూపాయి మారకం విలువలు 95.68వద్ద నిలిచాయి. అంతకుముందు రోజు 96.36వద్ద ట్రేడ్ అయిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు జూన్ ఐదునాటి సెటిల్‌మెంట్ ధరలు లక్షా 59వేల 127కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురు 2.32 డాలర్లు పెరిగి బ్యారెల్‌కు 104.90 చొప్పున ట్రేడ్ అయింది. అమెరికా డౌజోన్స్ ఫ్యూచర్‌లు 151 పాయింట్లు పెరిగింది. యూరోపియన్ షేర్లు వారాంతంలో గరిష్టంగానే ట్రేడ్ అయ్యాయి. యుకె మార్కెట్‌షేర్లు ఒత్తిడులకులోను కాగా ఆసియా షేర్లు మాత్రం గరిష్ట స్థాయిలోనే ట్రేడ్ అయ్యాయి. అమెరికా ఇరాన్ దౌత్య చర్చలే ఇందుకు కారణమని తెలుస్తోంది. వాల్‌స్ట్రీట్ డౌజోన్స్ పారిశ్రామిక సగటు 276.31 పాయింట్లుపెరిగితే ఎస్‌అండ్‌పి 500 సూచీ 0.17 శాతం, నాస్‌డాక్ కాంపోజిట్ 0.09శాతంపెరిగాయి. ఇక నిఫ్టీలోప్రైవేటు బ్యాంక్‌సూచీ 1.49శాతం, ఐసిఐసిఐ బ్యాంకు 1.96 శాతం, బంధన్‌బ్యాంకు 1.79, యస్‌బ్యాంకు 1.44, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 1.30, ఇండస్‌ఇండ్ 1.13, ఫెడరల్ బ్యాంకు 1.06, కోటక్ మహీంద్ర 0.908, ఐడిఎఫ్‌సి ఫస్ట్ బ్యాంకు 0.95శాతం పైపైకి వెళ్లాయి. ఎస్‌బిఐ షేర్లు 1.59శాతంపెరిగాయి. గెయిల్ 3.12,3ఎం ఇండియా 3.46శాతం పెరిగితే మారుతిసుజుకి 0.18 శాతం క్షీణించింది. లక్ష్మీడెంటల్ 20శాతంపెరిగింది. రామ్‌కో సిస్టమ్స్ కూడా 20శాతానికి వెళ్లింది. సెంట్రల్ బ్యాంక్ 7.81శాతంపెరిగింది. క్విక్ హీల్ టెక్నాలజీస్ 7.06 శాతం, విఎ టెక్ వాబాగ్ 1.48శాతంచొప్పున పెరిగాయి.

# స్వల్పంగా తగ్గిన పసిడి వెండి మాత్రం అదే జోరు



**ముంబయి, మే 22:** కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలకు శుక్రవారం స్వల్పంగా బ్రేక్ పడింది. పసిడి ధర కాస్త తగ్గడంతో కొనుగోలుదారులకు కొద్దిగా ఊరట లభించింది. అయితే, వెండి ధర మాత్రం తన పరుగును కొనసాగిస్తూ మరోసారి భారీగా పెరిగింది. ఈరోజు ఉదయం 10.30 గంటల సమయానికి హైదరాబాద్ మార్కెట్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరరూ.440 తగ్గి రూ.1,59,490 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.400 తగ్గి రూ.1,46,200కు చేరింది. మరోవైపు కిలో వెండి ధర నిన్నటితో పోలిస్తే ఏకంగా రూ.5,000 పెరిగి రూ.2,95,000కు చేరుకుంది. విజయవాడలో కూడా దాదాపు ఇవే ధరలు కొనసాగాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో ధరలను పరిశీలిస్తే చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధరరూ.1,61,240గా ఉండగా, ముంబైలో రూ.1,59,490గా ఉంది. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,640 వద్ద ట్రేడ్ అవుతోంది. దేశవ్యాప్తంగా వెండి ధరలు కిలోకు రూ.2.85 లక్షల నుంచి రూ.2.95 లక్షల మధ్య కొనసాగాయి. హైదరాబాద్‌లో రూ.2.95 లక్షలుగా కొనసాగింది. ఏడాదిపాటు బంగారం కొనుగోలు చేయవద్దన్న ప్రధాని పిలుపుతో బులియన్ మార్కెట్ ఒక్కసారిగా ఢమాల్ మంది. అయితే వెండిపరంగా పారిశ్రామిక వినియోగం పెరుగుతుండటంతో డిమాండ్ ఏర్పడింది. చిప్స్ తయారీ, సోలార్ ఫోటోవోల్టాయిక్ ప్యానెళ్ల తయారీలోను వెండి వినియోగం భారీగా పెరిగిన సంగతి తెలిసిందే.


# కాల్గేట్ పామోలివ్ రాబడులు రూ.1595 కోట్లు




**ముంబయి, మే 22:** కాల్గేట్ పామోలివ్ ఇండియా త్రైమాసిక ఫలితాలు ఆశించిన స్థాయిలో రాలేదు. రాబడులు మాత్రం ఏడుశాతం పెరిగాయి. రాబడులు పెరగడంతో కంపెనీ రూ.24 డివిడెండ్ ప్రకటించింది. మార్జిన్లపై ఎక్కువ వ్యయాలు ప్రభావంచూపించాయి, ఎఫ్ఎంసిజి విభాగంలో రూ.353 కోట్లు లాభం వచ్చింది. గత ఏడాదికంటే స్వల్పంగా తగ్గింది. రాబడులు మాత్రం 7.3 శాతం పెరిగి రూ.1486 కోట్ల నుంచి రూ.1595 కోట్లకు పెరిగాయి. ఎబిడిటా కూడా 2.3శాతం క్షీణించింది. 522 కోట్లనుంచి రూ.510 కోట్లకు పడిపోయింది. ఎబిడిటా మార్జిన్‌కూడా 35.1 నుంచి 31.9శాతానికి తగ్గింది. నాలుగోత్రైమాసికంలో నికర అమ్మకాలు 9శాతం వృద్ధితో ఉంది. ప్రీమియం పోర్టుఫోలియోల్లో అమ్మకాలుపెరిగాయి. వ్యాపార ప్రకటనలు కూడా ఈ త్రైమాసికంలో వ్యయం 10శాతంపెరిగాయి. ఎక్కువగా ప్రీమియం కేటగిరీపైనే కంపెనీ ఫోకస్ పెంచింది. ప్రతి రూపాయి విలువ కలిగిన షేరుపై బోర్డు రూ.24 డివిడెండ్ సిఫారసుచేసింది. జూన్ 17న చెల్లిస్తారు. రికార్డు తేదీ జూన్ 1గా తేలింది. ఎండి ఇఒ ప్రభా నరసింహమ్ మాట్లాడుతూ కంపెనీ ఈ ఏడాది అమ్మకాల్లో వృద్ధి నమోదుచేసింది. దేశీయంగా బిజినెస్ 9.2శాతం పెరిగిందన్నారు. కంపెనీ ప్రీమియం పోర్టుఫోలియో అమ్మకాల్లో మంచి వృద్ధి కనిపించిందని, కంపెనీ వృద్ధి మూడురెట్లు పెరుగుతుందన్న నమ్మకాన్ని వ్యక్త చేసారు.

## క్షీణించిన ఫారెక్స్ ఖజానా

ముంబయి, మే 22:భారత ఫారెక్స్ నిల్వలు 8.094 బిలియన్ డాలర్లు క్షీణించి 688.894 బిలియన్ డాలర్లకు చేరాయి. మే 15తో ముగిసిన వారంలో నిల్వలు కొంత మేర కరిగాయి. డాలర్ చెల్లింపులు పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. గత వారంలో ఆర్బీఐ రిజర్వులు 6.295బిలియన్ డాలర్లు పెరిగి 696.988 బిలియన్ డాలర్లకు పెరిగిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఫిబ్రవరి 27తో ముగిసిన వారంలో ఆర్బీఐ కరెన్సీ రిజర్వులు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. 728.494 బిలియన్ డాలర్లకు చేరాయి. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు, డాలర్ చెల్లింపులు పెరగడంతో విదేశీ కరెన్సీ ఖజానా ఒత్తిడికి లోనయింది. విదేశీ కరెన్సా ఆస్తులు పరంగాచూసినా 6.483 బిలియన్ డాలర్లు క్షీణించి 545.904బిలియన్ డాలర్లకు చేరాయి. డాలరేతర కరెన్సీలు యూరో, పౌండ్, యెన్ ఇతరవిదేశీ కరెన్సీ మార్పిడిలో వచ్చే హెచ్చుతగ్గుల విలువలే విదేశీ కరెన్సీ ఆస్తులుగా పరిగణిస్తారు. ఇక బంగారం నిల్వలపరంగా చూస్తే 1.536 బిలియన్‌డాలర్లు క్షీణించి 119.317 బిలియన్ డాలర్లకు చేరాయి. ఇక ఐఎంఎఫ్‌వద్ద స్పెషల్‌డ్రాయింగ్ హక్కులు కూడా 49 మిలియన్ డాలర్లు తగ్గి 18.824బిలియన్ డాలర్లకు చేరినట్లు వెల్లడించింది. ఐఎంఎఫ్ వద్ద రిజర్వుస్థాయి కూడా 25 మిలియన్ డాలర్లు క్షీణించి 4.85 బిలియన్ డాలర్లకు చేరాయి.







# ఎల్ఐసి నికరలాభం 57,419 కోట్లు

**ముంబయి, మే 22:** ప్రభుత్వరంగంలోని జీవితబీమా సంస్థ పూర్తి ఆర్థిక సంవత్సరానికి రూ.57,419 కోట్లు నికరలాభం ఆర్జించింది. గత ఏడాది కంటే 19.25 శాతం లాభాలు పెంచుకోవడంతో ఎల్ఐసి బోర్డు తుది డివిడెండ్ ప్రతి పది రూపాయల ఈక్విటీ షేరుకు రూ.10 డివిడెండ్ ప్రకటించింది. వ్యక్తిగత బిజినెస్ 43.78శాతం పెరిగి రూ.15,214కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ విలువలు 41.63శాతం పెరిగి రూ.14,179 కోట్లకు చేరింది. కొత్త బిజినెస్ ప్రీమియం కూడా 8.29శాతం పెరిగి రూ.67,676 కోట్లకు చేరింది. మొత్తం ప్రీమియం ఆదాయి 9.80శాతం పెరిగి రూ.5,35,984 కోట్లుగా ఉందని ఎల్ఐసి పెరిగింది. భారత్ బీమా విలువలు 1.58శాతంపెరిగి రూ.7,89,185 కోట్లకు చేరింది. అలాగే ప్రీమియం కూడా 5.59శాతంనుంచి 7.51శాతానికి పెరిగింది.

వ్యయ నిష్పత్తి కూడా 51 బేసిస్ పాయింట్లు తగ్గింది. 12.42శాతం నుంచి 11.91శాతానికి చేరింది. పాలసీ దారులకు బోనస్ రూపంలోనే ఈ ఏడాది రూ.59,726 కోట్లు చెల్లించినట్లు ఎల్ఐసి వివరించింది. సంస్థ ఎండిసిఇఒ ఆర్.దరైస్వామి మాట్లాడుతూ సంవత్సరంలో పనితీరు సంతృప్తికరంగానే మారిందని అన్నారు. అకౌంటింగ్ ప్రమాణాలు భారతీయ ప్రమాణాలకు అనుసరించి ఇండాస్ వ్యవస్థనే అనుసరిస్తున్నట్లు తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని కొత్త మైలురాళ్లు చేరుకోగలమని దొరైస్వామి చెప్పారు. మొత్తం 20 కోట్లమందికిపైగా పాలసీదారుల విశ్వాసం చూరగొన్నామని, భవిష్యత్తులో కూడా ఇదే తీరులో ముందుకు వెళతామన్నారు. ప్రస్తుతం నిర్వహణ ఆస్తులు ఎల్ఐసికి రూ.57,29,396కోట్ల వరకూ ఉన్నాయి. గతఏడాది కొంటే 5.08శాతంపెరిగినట్లు తెలిపారు. వాటాదారుల నమ్మకాన్ని వమ్ముచేకుండా 1:1 నిష్పత్తిలోనే బోనస్ ప్రకటించినట్లు సిఇఒ ఎండి గుర్తుచేసారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.